

లెబనాన్, సిరియాల్లో పేజర్ల పేలుళ్లు

9 మంది హెజ్బొల్లా ఉగ్రవాదుల మృతి

2,750 మందికిపైగా తీవ్రగాయాలు › 7

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

నిపుణ Guide to Excellence

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

బుధవారం WEDNESDAY 18.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+ 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 104 ‖ వెల (Price) రూ.6.50

పౌర్ణమి

బుధవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-15. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: పౌర్ణమి ఉదయం 8-04 వరకు, తదుపరి కృష్ణ పాడ్యమి తెల్లవారుజామున 4-20 వరకు. నక్షత్రం: పూర్వాభాద్ర ఉదయం 11-00, తదుపరి ఉత్తరాభాద్ర. వర్జ్యం: రాత్రి 7-26 నుంచి రాత్రి 8-50 వరకు. రాహుకాలం: పగలు 12-09 నుంచి పగలు 1-41 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-45 నుంచి పగలు 12-34 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 3-51 నుంచి తెల్లవారుజామున 5-15 వరకు. మహాలయ పక్షారంభం.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఊరికి దక్షిణాన..

రాష్ట్రమంతా రియల్ ఎస్టేట్ పండుకున్నది... కానీ అక్కడ మాత్రం ఏదో అలజడి కనిపిస్తున్నది!

భూమి కొనే నాథుడేడీ అని అనేక చోట్ల రైతులు ఎదురు చూస్తున్నరు... కానీ అక్కడ మాత్రం రైతుల ఇండ్ల ముందు కార్లు బారులు తీరుతున్నయి!

అన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఆఫీసులు వెలవెలబోతున్నయి.. కానీ అక్కడ మాత్రం ప్రైవేటు పత్రాల మార్పిడులు పంజా విసురుతున్నయి!

తెలంగాణవ్యాప్తంగా రియల్టీ ఏజెంట్లు బేరాలు రాక లబోదిబోమంటున్నరు... కానీ అక్కడ మాత్రం ఫామ్‌హౌస్‌లలో ఒప్పందాల దందాలు సాగుతున్నయి!

ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ ట్రేడింగ్?

ఉరిమేను భూమాయ!

అసైన్డ్ భూములకూ అగ్రిమెంట్లు కుదురుతున్నయి. లావణి పట్టాల రికార్డులు లాఘవంగా మాయమవుతున్నయి. సీలింగ్ భూములు సిత్రంగా ముడుచుకుంటున్నయి. ప్రభుత్వ భూములు పదిలంగా వివరాలు దాచుకుంటున్నయి! హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలో ఎఫ్‌టీఎల్, బఫర్, ప్రభుత్వ భూముల పరిరక్షణ అంటూ హడావుడి చేస్తున్న హైడ్రా, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ.. ఏదీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

ఐటీ సిటీ రాయదుర్గంలో ఆక్యుపెన్సీ లేదన్న మెట్రో రైలు, ఊరి జనమే లేని ఆ నగరానికి ఉరకలు పెడతానంటున్నది. రద్దీయే లేని చోటుకు 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పరుగులు తీస్తుందట. రీజినల్ రింగు రోడ్డు రంగులు మార్చుకుంటుందట.కొత్త రేడియల్ రహదారులు పరుచుకుంటాయట. కనెక్టింగ్ రోడ్లు కనికట్టు చేస్తాయట! కొత్త ప్రాజెక్టుల్ని అక్కడే ప్రకటించాలని రియల్టీ కంపెనీలపై ఒత్తిళ్లు వస్తున్నయ్!!


సిటీలోఉన్న ప్రాజెక్టులు రద్దవుతున్నయ్. నూతన ప్రణాళికలు ఊపిరి పోసుకుంటున్నయ్! భూమి సిద్ధంగా ఉన్నా ఫార్మాసిటీ రద్దయింది. సిటీలో రద్దీ ఉన్నా ఎయిర్‌పోర్టు మెట్రో మార్గం మళ్లీ పోయింది. అకస్మాత్తుగా హైడ్రా అవతరించి, సిటీలో రియల్టీ డిమాండ్‌ను బుల్డోజర్లతో తొక్కించింది. వెలుగుల నగరాన్ని కాదని, ఇంకా మొ(ద)లవని సిటీకి ప్రాజెక్టుల ప్రకటనలు వెలువడుతున్నాయి. స్కిల్ వర్సిటీ, ఏఐ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ.. ఇలా అన్నీ అక్కడికే దారి తీస్తున్నయి. ఏ మౌలిక వసతులూ లేని అచ్చోటకు పెట్టుబడుల ప్రకటనలు వెల్లువెత్తుతున్నయి.

రోజుకో కొత్త పేరుతో పెద్దల నోటి నుంచే ప్రమోషన్ యాక్టివిటీ సాగుతున్నది! జర్నలిస్టులూ ప్రమోట్ చేస్తే, అక్కడే ఇళ్లస్థలాలు ఇస్తామన్న ఎరలూ మొదలయ్యాయి. ఇంతకీ ఏమిటీ కథ!

ఆ ప్రాంతం హైదరాబాద్‌కు దక్షిణాన ఉంది. దానికిప్పటికే నాలుగు ఘనమైన పేర్లతో నామకరణం జరిగింది. రాచకొండ సిటీ!.. ఫోర్త్ సిటీ..!.. ఏఐ సిటీ!.. ఫ్యూచర్ సిటీ! పేరేదైతేనేం... తెరవెనుక ఉన్నది పెద్దలు! వందల ఎకరాలు! కోట్ల దందాలు! ఒత్తిళ్లు–ఒప్పందాలు!

నాలుగో నగరం కింద నలుగుతున్నది నిరు పేదలు. వాళ్ల భూముల్ని చెరబడుతున్నది పెద్దలు. వస్తుందో రాదో తెల్వని ఫోర్త్‌సిటీ కోసం ఫ్యూచర్‌ను కోల్పోతున్నది బడుగు రైతులు. మరి ఈ రంగులరాట్నం తిప్పుతున్నదెవరు? కాచుకుని కూర్చున్న రాబందులెవరు? ఇది అందినకాడికి అమ్ముకునిపోయే ఆర్టిఫిషియల్ బూమా? కండ్లు బైర్లు కమ్మించే అమరావతి కథా?

ఫ్యూచర్ సిటీ.. వర్తమానంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాలు నేటి నుంచి...



రూటు మారిన ట్రిపుల్ ఆర్

- రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణభాగం అలైన్‌మెంట్‌లో మార్పు
- మాడ్గుల, మన్నెగూడ ప్రధాన కేంద్రాలుగా మారిన మ్యాప్
- ఆమనగల్ నుంచి కడ్తాల్‌కు... చేవెళ్ల నుంచి మన్నెగూడకు..
- పాతరూట్ నుంచి పలుచోట్ల పక్కకు జరిగిన అలైన్‌మెంట్
- 189 నుంచి 194కు.. 5 కిలోమీటర్ల వరకు పెరిగిన దూరం
- అలైన్‌మెంట్ మార్పుల వెనుక అసలు మతలబేమిటో..!


హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 17 (నమస్తే తెలంగాణ): ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు సాంకేతిక వెసులుబాటు ప్రకారం వెళ్లే రింగు రోడ్డుకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పూనకం వస్తుంది. అప్పటివరకు ఉన్న అలైన్‌మెంట్లు పాములు తిరిగినట్టుగా అటూ ఇటూ వంకర తిరుగుతాయి. ఇప్పుడూ అదే జరిగింది. రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) రూటు మారింది. దక్షిణ భాగంలో ఏకంగా నాలుగైదు కిలోమీటర్ల మేర రోడ్డు పెరిగింది. ఇటీవల ఓ కీలక నేత నివాసంలోనే ఈ మార్పునకు అధికారిక ముద్ర పడగా... తాము బహిరంగంగా ప్రకటించేవరకు సమాచారం బయటికి పొక్కొద్దంటూ ఆర్అండ్‌బీ అధికారులకు గట్టిగానే హెచ్చరికలు జారీ అయినట్టు తెలిసింది. పైకి ఫ్యూచర్ సిటీ కోసమేనంటూ నేతలు చెప్తున్నా.. వాస్తవం వేరే ఉన్నదని ప్రచారం జరుగుతున్నది. నానాటికీ విస్తరిస్తున్న హైదరాబాద్ మహా నగరం పరిధిలో అధునాతన రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రీజినల్ రింగురోడ్డుకు అంకురార్పణ జరిగింది. కేంద్రప్రభుత్వ సహకారంతో అవుటర్ రింగు రోడ్డుకు అవతల 300 కిలోమీటర్లకు పైగా పొడవుతో ట్రిపుల్ ఆర్‌ను ప్రతిపాదించారు. ఈ మేరకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే › 2వ పేజీలో

ఈ భూదందాకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి 91827 77711



తెలంగాణ ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని › 6

'విజిలెన్స్' కమిషనర్‌గా **గోపాల్ బాధ్యతలు** › 6



లీటరు పల్లినూనె రూ.170 › 6

భారీగా పెరిగిన వంటనూనె ధరలు



సచివాలయ సౌధం సప్తముఖుడి రథం

వినాయక నిమజ్జనం సందర్భంగా జనసందోహం మధ్య ట్యాంక్‌బండ్ వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న ఖైరతాబాద్ బడాగణేశ్



సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ మంగళవారం తెలంగాణభవన్‌లో తెలంగాణతల్లికి క్షీరాభిషేకం చేస్తున్న కేటీఆర్

అప్పులపై తప్పుడు లెక్క



- మీ చేతగానితనాన్ని బీఆర్‌ఎస్‌పై రుద్దొద్దు
- రాష్ట్ర పరపతిని దిగజార్చేలా సీఎం వ్యాఖ్యలు
- ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న పరిశ్రమలు
- బీఆర్‌ఎస్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ
- పదేండ్లలో అయిన అప్పు 4.26 లక్షల కోట్లే
- ఇకనైనా అబద్ధాలు ఆపండి: హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పులపై తప్పుడు లెక్కలు చెప్తున్నారని, తన చేతగాని తనాన్ని గత ప్రభుత్వాలపై రుద్దడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు అగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే మాట్లాడటం, రాష్ట్ర ప్రతిష్ఠను, పరపతిని దిగజార్చేలా వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యల ద్వారా రాష్ట్ర భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ముందు అబద్ధాలను వల్లెవేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంపై రూ.6.85 లక్షల కోట్ల అప్పు ఉన్నదనే తప్పుడు ప్రచారాన్ని ఇంకెన్నిసార్లు చెప్తారని ప్రశ్నించారు. పబ్లిక్ మీటింగ్‌ల్లో, ప్రచారసభల్లో, 16వ ఆర్థిక సంఘం ముందు చివరికి ప్రజాపాలన దినోత్సవ వేదికగా అదే తొండివాదన వినిపించడం వల్ల రాష్టానికి వచ్చే › 5వ పేజీలో



ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని ఎల్జీని కోరుతున్న ఆతిశీ

ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ

ఆప్ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవం..ఢిల్లీకి యంగెస్ట్ సీఎంగా రికార్డు

26 లేదా 27న ఆతిశీ ప్రమాణం.. పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్

కేజ్రీవాల్ స్థానంలో ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిశీని పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ నెల 26 లేదా 27న ఆమె సీఎంగా ప్రమాణం చేయనున్నట్టు సమాచారం. › 7

చేతనైతే 420 హామీలు అమలు చెయ్

- 9 నెలలైనా రాష్ట్రంలో ఆలనా పాలనా లేదు.. ఇకనైనా పరిపాలనపై దృష్టిపెట్టు
- కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను తిట్టడమే పనా?.. పాఠశాలల్లో చాక్‌పీస్‌లకూ పైసల్లేవ్
- కంప్యూటర్‌ను కనిపెట్టింది బాబేజ్.. దేశానికి పరిచయం చేసింది టాటా గ్రూప్
- రాజీవ్ విగ్రహం మీ ఇంట్లో పెట్టుకో.. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెడుతం
- రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించే పరిస్థితి.. కేటీఆర్ ఫైర్ › 3


హైకోర్టు తీర్పుతో రేవంత్‌రెడ్డికి భయం

- అందుకే పిచ్చికూతలు కూస్తున్నడు.. ఫిరాయింపులపై మాట మార్చిందెవరు?
- కండువా కప్పినోడిది తప్పా? మాకేం సంబంధం లేదన్నోడిది తప్పా?
- ఆ ఎమ్మెల్యేలు ఎటూకాకుండా పోతరు.. జాతీయ మీడియాతో కేటీఆర్ › 3

రూటు మారిన ట్రిపుల్ ఆర్


మొదటిపేజీ తరువాయి...

ఉత్తర, దక్షిణ భాగాలకు సంబంధించిన అలైన్‌మెంట్ ప్రతిపాదనలు కూడా కేంద్రానికి వెళ్లాయి. అందులో భాగంగా తొలుత ఉత్తర భాగం సంగారెడ్డి (ఎన్‌హెచ్-65 మీదుగా) - తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ (ఎన్‌హెచ్-65 మీదుగా) వరకు 158 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ నిర్ధారణ జరిగింది. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఆరోపణలు గానీ, అనుమానాలుగానీ రాలేదు. దక్షిణ భాగంలో అలైన్‌మెంట్‌కు సంబంధించిన ప్రాథమిక దశ కసరత్తు పూర్తయ్యింది. ఆ మేరకు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మ్యాపునూ విడుదల చేశారు. అందులో దక్షిణభాగం వైపు ట్రిపుల్ ఆర్ ఎలా వెళ్తుందనే వివరాలు కూడా ఉన్నాయి. కాకపోతే దానిని అధికారికంగా సర్వే చేసి నిర్ధారించాల్సి ఉంది. ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం వాస్తవానికి 189 కిలోమీటర్లుగా గతంలోనే నిర్ధారించారు. ఎన్‌హెచ్-65 మీదుగా చౌటుప్పల్ నుంచి షాద్‌నగర్- ఆమన్‌గల్ సమీపంలో నుంచి చేవెళ్ల మీదుగా సంగారెడ్డి వరకు రింగును కలపాల్సి ఉంది. గతంలో అధికారికంగా విడుదల చేసిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మ్యాపులోనూ ఇదే రీతిన అలైన్‌మెంట్ ఉన్నది. కానీ కొంతకాలం కిందటి నుంచి అలైన్‌మెంట్‌లో మార్పులపై ప్రభుత్వ పెద్దల స్థాయిలో అంతర్గతంగా తర్జనభర్జనలు జరిగినట్టు తెలిసింది. ఈ మేరకు ఏకంగా నాలుగు కిలోమీటర్ల మేర పొడిగింపుతో పలు చోట్ల అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు.



- చౌటుప్పల్ నుంచి అలైన్‌మెంట్‌ను గతంలోని పాయింట్ నుంచి 5 కిలోమీటర్ల అవతలకు జరిపారు. ఫలితంగా తక్కళ్లపల్లి- చినమాడ్గుల - ఆమన్‌గల్- కొందుర్గు- చెంగోముల్- చేవెళ్ల- కొండాపూర్- సంగారెడ్డి వరకు ఉండే అలైన్‌మెంట్ దూరం జరిగింది.
- భట్లపల్లి దగ్గర మొదలై కొద్దిదూరం గత అలైన్‌మెంట్ మాదిరిగానే కొనసాగినా... ఆపై నల్లగొండ జిల్లాలో తక్కళ్లపల్లి నుంచి కిష్టరాంపల్లి వైపునకు జరిగింది. అలా శివన్నగూడ మీదుగా పోవాల్సిన అలైన్‌మెంట్ కురంపల్లి ఎక్స్ రోడ్డు-నల్లచెరువు మీదుగా వెళ్లింది.
- రంగారెడ్డి జిల్లాలో నాగిళ్ల నుంచి ఆమన్‌గల్, ఆకుతోటపల్లి లోపల నుంచి తలకొండపల్లి వైపు పాత అలైన్‌మెంట్ ఉన్నది. ఇక్కడ భారీ ఎత్తున మార్పు చేపట్టారు. ఇందులో నల్లచెరువు-సింగంపల్లి మీదుగా ఆకుతోటపల్లి బయటి చాలా దూరం నుంచి తలకొండపల్లి వరకు అలైన్‌మెంట్‌ను మార్చారు.
- అలైన్‌మెంట్‌లో తలకొండపల్లి నుంచి కిలోమీటర్ల దూరం వరకు మార్పులు చేశారు.
- ఇక సేరిరామకృష్ణాపురం నుంచి చౌలపల్లి వరకు ఎలాంటి మార్పు లేకుండా పాత అలైన్‌మెంట్‌ను కొనసాగించారు.
- చౌలపల్లి నుంచి ఏదురుగూడెం వరకు పాత అలైన్‌మెంట్‌లో భారీ మార్పులు చేశారు. టేకులపల్లి-మీర్జాగూడ-చెంగోముల్ గ్రామ సమీపంలో నుంచి సంకేపల్లి మీదుగా వెళ్లాల్సిన అలైన్‌మెంట్ తుమ్మలపల్లి-చిన్న ఉమ్మెంతాల-తిప్పాపూర్-ఆపై చెంగోముల్ పోలీస్‌స్టేషన్ మీదుగా పులిమామిడి, హరిదాస్‌పూర్ మీదుగా సంగారెడ్డికి తీసుకువెళ్లారు. చెంగోముల్ గ్రామం నుంచి పోలీస్‌స్టేషన్ సుమారు ఐదు కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. అంటే అలైన్‌మెంట్‌ను నాలుగైదు కిలోమీటర్ల మేర అవతలికి జరిపారు.
- గత అలైన్‌మెంట్‌లో ఎక్కడా సాంకేతిక సమస్యలు లేవు. సర్వేనే పూర్తికానందున భూసేకరణ సమస్య తలెత్తినట్టుగా చెప్పలేం. అలైన్‌మెంట్ మార్పు వెనక భారీ వ్యూహం ఉన్నదనేది స్పష్టం. ఫోర్త్‌సిటీ కోసం అలైన్‌మెంట్ మార్చినట్టుగా ప్రభుత్వ పెద్దలు బయట ప్రచారం చేస్తున్నప్పటికీ.. గత అలైన్‌మెంట్ మాత్రమే ఫోర్త్ సిటీకి సమీపంలో ఉన్నది. తాజా అలైన్‌మెంట్ నాలుగైదు కిలోమీటర్ల దూరం పెరిగింది. దీంతో మార్పు వెనక ఉద్దేశం వేరే ఉందనేది బహిరంగ రహస్యం.

(రేపు: ట్రిపుల్ ఆర్ రూట్ మార్పు ఎవరికి లాభం?)



ఫోర్త్‌సిటీ.. ఫ్యూచర్ ట్రేడింగ్?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 17 (నమస్తే తెలంగాణ): ఒకవైపు రియల్ ఎస్టేట్ రంగంలో రాష్ట్రవ్యాప్తంగా స్తబ్దత నెలకొన్న తరుణంలో హైదరాబాద్‌కు దక్షిణ భాగాన మాత్రం అనూహ్య అలజడి కనిపిస్తున్నది. రంగారెడ్డి జిల్లా కందుకూరు, ముచ్చర్ల, తుక్కుగూడ మొదలు యాచారం వరకు భూమాయాజాలం కొనసాగుతున్నది. ఒకవైపు రాష్ట్రమంతా వ్యవసాయ భూముల ధరలు పడిపోతుంటే.. అక్కడ మాత్రం అవి ఆకాశానికి ఎగబాకుతున్నాయి. అన్ని చోట్లా ప్లాట్ల రేట్లు పడిపోతుంటే.. అక్కడ మాత్రం రెట్టింపు అయ్యాయి. ఈ వింత, విచిత్రం ఎలా సాధ్యమవుతున్నదని 'నమస్తే తెలంగాణ' ఆరా తీసినప్పుడు.. విస్తుగొల్పే నిజాలు, విస్మయపరిచే విషయాలు బయటకువచ్చాయి.

అంతా గోప్యం.. అధికారుల మౌనం

అక్కడ వందల ఎకరాలు చేతులు మారుతున్నా అంతాగోప్యం! వేల కోట్ల దందాలు సాగుతున్నా అంతా గప్‌చుప్! పెద్దల ఒత్తిడితో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవం చెప్పలేక, విషయం దాచలేక మల్లగుల్లాలు పడుతున్నారు. తమకేమీ తెలియనట్టే నటిస్తున్నారు. వారం రోజులక్రితం ఓ కీలక నేత నివాసంలో ఫ్యూచర్ సిటీపై కీలక సమావేశం జరిగింది. ప్రిన్సిపల్ సెక్రటరీ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరైన ఆ మీటింగ్‌లో రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు.. ఆ తర్వాత ఫ్యూచర్ సిటీ కోసం చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై వివరించిన సదరు నేత చివరికి ఓ హెచ్చరికతో ముగించారని సమాచారం. 'అధికారులెవరూ నోరువిప్పొద్దు. సందర్భం వచ్చినప్పుడు నేనే చెప్తా. అంతవరకు విషయం బయటకు పొక్కితే సీరియస్‌గా ఉంటుంది' అంటూ ఆయన వార్నింగ్ ఇచ్చారని ప్రచారం జరుగుతున్నది.

ఫార్మా రద్దుతోనే తొలి అడుగు

ఫార్మాసిటీ రద్దుతోనే తొలి అడుగు పడింది. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతో అసలు కథ మొదలైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు 19వేల ఎకరాల భూసేకరణ పూర్తిచేసి ఫార్మాసిటీ రూపొందిస్తే.. దాన్ని రద్దు చేసి అదే భూములు లక్ష్యంగా సర్కారు ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నది. కొత్త ప్రాజెక్టులను అక్కడికే తరలిస్తున్నది. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీతోపాటు ఏఐ సిటీ వంటి వాటినీ దక్షిణానికే తరలిస్తున్నది. అంతర్జాతీయ కంపెనీలకూ అక్కడే భూ కేటాయింపులు జరుపుతున్నది. ఫోర్త్‌సిటీకి ప్రభుత్వ పెద్దలే బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేస్తుండటం గమనార్హం. ఫలితంగా మౌలిక వసతుల కల్పనంతా అక్కడికే మళ్లుతున్నది. ఆక్యుపెన్సీ లేదనే సాకుతో రాయదుర్గం ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేసిన ప్రభుత్వం.. పట్టుమని పది ఆవాసాలు లేని ఫోర్త్ సిటీకి ఇప్పుడే మెట్రో రైలును నిర్మించే పనిలో తలమునకలైంది. మూడు నగరాల్లో లేనివిధంగా నాల్గోనగరిలో అవసరం లేకున్నా... 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఫ్యూచర్ సిటీ హైప్ కోసం ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నట్టు తేటతెల్లమవుతున్నది. అసలు హైడ్రా పేరుతో ట్రైసిటీలో చేపడుతున్న నిర్మాణాల కూల్చివేత కూడా భావినగరం వైపు రియల్టీ మళ్లించేందుకేనన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.



లోకం పోకడ

కంప్యూటర్ కనిపెట్టింది ఎవరని అడిగితే రాజీవ్‌గాంధీ అంటావేంరా? ఎవర్రా నీకు చెప్పింది? ఏడిచినట్లేవుంది నీ చదువు!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.2°c	23.4°c
ఖమ్మం	35.0°c	21.0°c
మెదక్	34.2°c	21.6°c
రంగారెడ్డి	33.5°c	21.1°c
నిజామాబాద్	32.9°c	23.1°c
వరంగల్	32.0°c	23.0°c
కరీంనగర్	32.0°c	23.0°c
నల్లగొండ	31.5°c	24.6°c
మహబూబ్‌నగర్	31.0°c	21.5°c
హైదరాబాద్	31.0°c	22.0°c

రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై ఢిల్లీ ఆగ్రహం!

తెలంగాణతల్లికి కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటి?
ఇలా చేస్తే రాజీవ్‌గాంధీ గౌరవం పెరుగుతుందా?
ఆయనను విలన్‌గా చేయాలనుకుంటున్నారా?
తెలంగాణతల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదు?
రాష్ట్ర ముఖ్య నేతలను తలంటిన అధిష్ఠానం!

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు అంశం కాంగ్రెస్ పార్టీలో రచ్చ రేపుతున్నది. విగ్రహ ఏర్పాటుపై అధిష్ఠానం పెద్దలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎంతో ముఖ్యమైన ఈ కార్యక్రమానికి గాంధీ కుటుంబం నుంచి ఒక్కరు కూడా హాజరు కాకపోవడానికి ఈ ఆగ్రహమే కారణమని తెలిసింది. వాస్తవానికి ఈ కార్యక్రమానికి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. కానీ, వారు మాత్రం రావడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర పెద్దలను అధిష్ఠానం తలంటినట్టు తెలిసింది. 'వివాదాల మధ్య రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇది రాజీవ్‌గాంధీకి గౌరవం పెంచుతుందా? తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటుచేశారు? తద్వారా తెలంగాణ ప్రజల్లో రాజీవ్ గాంధీని విలన్‌ను చేయాలని అనుకున్నారా?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. ఒకవేళ ఇదే జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించినట్టు తెలిసింది. అప్పుడు రాజీవ్ గాంధీ గౌరవం ఏం కావాలని గట్టిగానే తలంటినట్టు తెలిసింది. మాజీ ప్రధాని అయిన రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే సమయంలో అందరి ఆమోదంతో చేయాలనే కనీస ఆలోచన కూడా లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అయితే దీనిపై రాష్ట్ర నేతలు వివరణ ఇచ్చిననట్టు తెలిసింది. తెలంగాణతల్లి విగ్రహాన్ని సచివాలయం లోపల ఏర్పాటు చేయబోతున్నామని, అందుకే బయట తెలంగాణతల్లికి కేటాయించిన స్థలంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్టు వివరించినట్టు తెలిసింది. ఈ వివరణపై అధిష్ఠానం పెద్దలు అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. అలాంటప్పుడు ముందుగా తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు చేసి ఆ తర్వాత రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేయాల్సిందని, అప్పుడు ఈ వివాదం ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తంచేసినట్టు తెలిసింది. పేరున్న నేతలను గౌరవం పెంచకపోయినా ఫర్వాలేదు కానీ, ఉన్న గౌరవాన్ని తగ్గించే పనులు మాత్రం చేయొద్దని గట్టిగానే చెప్పినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అధిష్ఠానంతోపాటు రాష్ట్ర సీనియర్ నేతలు కూడా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయంపై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది.

వరదసాయంలోనూ మెలిక

- **పక్కాగాలేని వరద బాధితుల సర్వే**
- **3,800 కుటుంబాలకు నష్టమని అంచనా**
- **2,813 కుటుంబాలు నష్టపోయినట్టు క్షేత్రస్థాయి నిర్ధారణ**
- **సాంకేతిక కారణాలతో 318 కుటుంబాలకు అందని సాయం**
- **క్యాటగిరీలుగా విభజించి.. వందలాది మందికి మొండిచేయి**
- **తహసీల్దార్ కార్యాలయంలో వరద బాధితుల ఆందోళన**

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 17: సవాలక్ష కొర్రీలతో అరకొరగా రుణమాఫీ చేసిన సర్కారు వరదసాయంలోనూ తన మార్క్ చూపింది. వరద బాధితులను క్యాటగిరీలుగా విభజించి వరదసాయంలోనూ మెలిక పెట్టింది. ఫోన్‌నంబర్లు ఒకేలా ఉన్నాయని, ఖాతా నంబర్లు లేవని కారణాలు చెబుతూ వరద బాధితులను నిండా ముంచింది. మున్నేటి వరద తమ ఇండ్లను ముంచెత్తితే.. ఆదుకోవాల్సిన సర్కారు నిండా ముంచేసిందని మున్నేరు వరద బాధితులు మొత్తుకుంటున్నారు. ఇండ్లు మునిగినా.. పంటలు కొట్టుకుపోయినా.. కట్టుబట్టలతో ఉన్నా.. నష్టప్రభావం తక్కువేనని సర్కారు సాకులు చెప్తున్నదని మండిపడ్డారు. వరద బాధితులను క్యాటగిరీలుగా విభజించి పరిహారం అందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరిగిన నష్టాన్ని కండ్లారా చూసిన అధికారులు.. వివరాలన్నీ నమోదు చేసుకొని జాబితాలో పేరు కూడా పొందుపర్చారని.. కానీ ఎక్కువ ప్రభావితమైన వారికే అని కొందరి ఖాతాల్లోనే పరిహారం జమ చేస్తున్నారని ఆరోపించారు. నివాసాలు మునిగినా.. తీవ్రత ఉన్న జాబితాలో చేర్చకనే పరిహారాన్ని కోల్పోయామని బోరుమంటున్నారు.

ఆందోళనలో వరద బాధితులు

ఖమ్మం రూరల్ మండలంలో ప్రాథమికంగా 3,800 కుటుంబాలకు నష్టం జరిగి ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. క్షేత్ర పరిశీలన తరువాత 2,813 కుటుంబాలు నష్టపోయినట్టు నిర్ధారించారు. ఒకే ఫోన్ నంబర్లు ఇవ్వడం, బ్యాంకు ఖాతాలు లేకపోవడం, ఉన్నా నంబర్లు తెలియకపోవడం వంటి సాంకేతిక కారణాలతో 318కుటుంబాలకు సాయం అందలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ సర్వే జరగని కుటుంబాలు, అర్హత ఉన్నా పరిహారం అందని కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నాయి. వరుస సెలవుల అనంతరం తెరుచుకున్న ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వరద బాధితులు వందల సంఖ్యలో చేరుకున్నారు. ఇండ్లు మునిగినా ఘటనను కండ్లారా చూసి కూడా నష్టపరిహారం ఇవ్వలేదని అధికారులకు మొరపెట్టుకున్నారు. కొందరైతే పూర్తిగా ముంపునకు గురైన ఇండ్లు, ఇతర ఆస్తుల ఫొటోలు తీసుకొచ్చి మరీ అధికారులకు చూపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, కేంద్ర, రాష్ట్ర అధికారులు ప్రత్యక్షంగా చూసినా పరిహారం ఇవ్వకపోవడంపై వరద బాధితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో అధికారులు బాధితుల నుంచి మరోసారి దరఖాస్తులు స్వీకరించారు.



ఖమ్మం రూరల్ మండల ఆర్‌ఐ ఎదుట మొరపెట్టుకుంటున్న పరిహారం అందని మున్నేటి వరద బాధితులు

అధికారులు కండ్లారా చూశారు



మా ఇల్లు మునిగిన విషయాన్ని అధికారులు కండ్లారా చూశారు. సర్కారు సాయం చేసే జాబితాలో మా పేరు లేదు. వరద తగ్గిన తరువాత ఒక్కరిద్దరు అధికారులు వచ్చారు. వివరాలన్నీ మా ఇంటి దగ్గరే నమోదు చేసుకున్నారు. కానీ మాకు పరిహారం రాలేదు. సర్కారు సాయం రూ.16 వేలు అందినోళ్లకే స్థానిక నాయకులు రూ.5 వేలు ఇచ్చారు. జాబితాలో పేరు లేదని మాకు అది కూడా రాలేదు.

–అమృతమ్మ, ఆర్టీసీ కాలనీ

మా ఇల్లు పూర్తిగా మునిగింది



మున్నేటి వరదలకు మా కేబీఆర్ నగర్ కాలనీ పూర్తిగా మునిగింది. మా ఇంట్లో దాదాపు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లింది. సర్వే అధికారులు వచ్చి చూశారు. వాళ్లు కూడా చాలా బాధపడ్డారు. కానీ నా ఖాతాలో పరిహారం జమ కాలేదు. ఎందుకని అడిగితే జాబితాలో నా పేరు క్యాటగిరీ-1లో ఉందని సమాధానమిచ్చారు.

–బూడిద వెంకన్న, కేబీఆర్ నగర్

మళ్లీ సేకరిస్తున్నాం..

మున్నేటి వరదలకు మండలంలో ప్రాథమికంగా 3,800 కుటుంబాలకు ఆస్తి నష్టం జరిగినట్టు తొలుత అంచనా వేశాం. క్షేత్ర పరిశీలన తరువాత 2,813 కుటుంబాలకు ఆస్తి నష్టం జరిగినట్టు నిర్ధారణ అయింది. ఒకే ఫోన్ నెంబర్లు ఇవ్వడం, బ్యాంకు ఖాతాల నెంబర్లు ఇవ్వకపోవడం వంటి సాంకేతిక కారణాలతో 318 కుటుంబాలకు పరిహారం రాలేదు. వారి వివరాలు మళ్లీ సేకరిస్తున్నాం.

– రాంప్రసాద్, తహసీల్దార్, ఖమ్మం రూరల్



హైవేపై బోల్తాపడిన కారును స్థానికులతో కలిసి సరిచేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్యే

- **ఇటిక్యాలపాడు హైవేపై కారు బోల్తా**
- **గాయపడిన వ్యక్తికి ధైర్యం చెప్పి ప్రథమ చికిత్స చేయించిన విజయుడు**

ఉండవెల్లి, సెప్టెంబర్ 17 : ప్రమాదవశాత్తు కారు బోల్తాపడగా అదేసమయంలో అటు నుంచి వెళ్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆగి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడికి ధైర్యం చెప్పారు. దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వివరాలు ఇలా.. కర్నూల్ జిల్లా నందవరం మండలం పులచింతకు చెందిన నవీన్‌కుమార్ కారు కొనుగోలు చేశాడు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి క్షేత్రంలో పూజలు చేయించిన అనంతరం తిరిగి కర్నూల్ వైపు బయలుదేరాడు. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు హైవేపై ప్రమాదవశాత్తు బోల్తాపడింది. అందులోని నవీన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. అదే సమయంలో గద్వాల కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవానికి హాజరై తిరిగి వెళ్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తన కారును ఆపి.. బోల్తాపడిన కారును స్థానికుల సాయంతో సరిచేశారు. గాయపడిన నవీన్‌కు స్థానిక దవాఖానలో ప్రథమ చికిత్స అందించి తిరిగి పంపించారు. సాయం చేసిన ఎమ్మెల్యేకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఫిరాయింపులను ప్రోత్సహించడమే ప్రజాపాలనా?

- **ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ప్రజా పాలన అంటే పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించడమేనానని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ ప్రశ్నించింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడంపై వారు స్పందించారు. ప్రజాపాలన అంటే పార్టీలు ఫిరాంయిపులను ప్రోత్సహిస్తూ వీధి రౌడీల్లా తన్నుకోవడమా అని ప్రశ్నించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రజాప్రతినిధుల సభ్యత్వాలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై బీఎన్‌రెడ్డి, మద్దికాయల ఓంకార్ విగ్రహాలు పెట్టాలని కోరారు. నల్గొండ యూనివర్సిటీకి, ఎస్సారెస్పీ రెండో దశకు బీఎన్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. వరంగల్- నర్సంపేట రహదారి, మెడికల్ కాలేజీకి, నర్సంపేట స్టేడియానికి ఓంకార్ పేరు పెట్టాలని కోరారు. ప్రజానేతలు భీంరెడ్డి నరసింహారెడ్డి-ఓంకార్‌ల స్మారకార్థం హైదరాబాద్‌లో 5, సూర్యాపేటలో 2, నర్సంపేటలో 2ఎకరాలు ప్రభుత్వం కేటాయిస్తే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనకు గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఎంసీపీఐ(యూ)తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు.

ఐఐటీ బాంబేకు 130 కోట్ల విరాళం

బెంగళూరు, సెప్టెంబర్ 17: మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఐఐటీ బాంబేకు మంగళవారం రూ.130 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఆర్థిక రంగ వృద్ధికి తోడ్పడే విధంగా మోతీలాల్ ఓస్వాల్ సెంటర్ ఫర్ క్యాపిటల్ మార్కెట్స్‌ను క్యాంపస్‌లోక్యాంపస్‌లో నెలకొల్పనున్నారు. అకడమిక్ ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేయాలని ప్రణాళికలు రచిస్తున్నది.



మిర్యాలగూడలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న గురుకుల అధ్యాపకులు

కొత్త టైమ్‌టేబుల్ అమలుచేయాలి

గురుకుల విద్యాజేఏసీ డిమాండ్ - నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురుకుల విద్యాజేఏసీ డిమాండ్ చేసింది. కొత్త టైమ్‌టేబుల్‌ను వెంటనే అమలుచేయాలని, అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలని, విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి రాష్ట్రవ్యాప్తంగా గురుకుల అధ్యాపకులు విధులకు హాజరయ్యారు. జేఏసీ స్టీరింగ్ కమిటీ నేతలు బాలరాజు, యాదయ్య, మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో 28న విధులను బహిష్కరించి, పెన్‌డౌన్ / చాక్‌డౌన్ నిర్వహిస్తామన్నారు.

దేశంలో పెరుగుతున్న కోటీశ్వరులు!

న్యూఢిల్లీ: భారత్‌లో సంపన్నుల సంఖ్య పెరుగుతున్నది. ఏడాదికి రూ.10 కోట్లు సంపాదిస్తున్న వాళ్లలో.. 63 శాతం పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూషనల్ రిసెర్చ్' తాజా నివేదిక ప్రకారం, 2019 నుంచి 2024 వరకు భారత్‌లో కోటీశ్వరుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. ఏడాదికి 50 లక్షలకుపైగా సంపాదిస్తున్న సంఖ్యలో పెరుగుదల 25 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం భారత్‌లో 31,800 మంది రూ.10 కోట్లకుపైగా వార్షిక సంపాదన కలిగి ఉన్నారు. ఏటా రూ.50 లక్షలకుపైగా సంపాదిస్తున్న వాళ్ల సంఖ్యలో దాదాపు 10 లక్షల మంది పెరిగారు. రూ.5 కోట్ల సంపాదన (వార్షిక) కలిగిన వారి సంఖ్య 58,200కు చేరుకుంది. ఈ విభాగంలో కోటీశ్వరుల సంఖ్య 49 శాతం పెరిగింది.

చేతనైతే 420 హామీలు అమలు చెయ్

- సీఎం రేవంత్..ఇకనైనా పరిపాలన మీద దృష్టిపెట్టు
- కంప్యూటర్‌ను కనిపెట్టింది బాబేజ్.. దేశానికి పరిచయం చేసింది టాటా గ్రూప్
- రాజీవ్ విగ్రహం మీ ఇంట్లో పెట్టుకో.. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెడుతం
- రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించే పరిస్థితి
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



తెలంగాణ భవన్‌లో మంగళవారం జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం వందనం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రజాపాలన పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ గేమ్‌లు ఆడుతున్నాడని, ఇకనైనా ఆయన పరిపాలన మీద దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. పాలనను పక్కనపెట్టి కేవలం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను దూషించటమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అలనా లేదు, పాలనా లేదని ధ్వజమెత్తారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో మంగళవారం జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సోమవారం మాట్లాడిన పనికిమాలిన మాటలను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నదని దుయ్యబట్టారు. 'చేతనైతే మీరిచ్చిన 420 అడ్డగోలు హామీలను అమలు చేయాలి. మా మాదిరి కరెంట్ ఇవ్వాలి. రైతు బంధు ఇవ్వాలి.. రైతులకు ఎకరానికి 15 వేలు ఇస్తా అని డైలాగులు కొట్టుడు కాదు.. దమ్ముంటే.. చేతనైతే రైతుభరోసా ఇవ్వు. మహిళలకు రూ.2500 పథకం అమలు చెయ్. అవ్వ, తాతలకు ఇస్తానన్న 4 వేల పింఛన్ ఇవ్వు. ఇంట్లో ఇద్దరికి పింఛన్ ఇస్తానన్నవ్. ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులకు పింఛన్ ఇస్తానన్నవ్.. ఇచ్చి చూపించు. నిరుద్యోగులకు మొదటి సంవత్సరంలో ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వు' అంటూ రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవం జరుపుకొంటున్నదని, చరిత్ర తెలియని చాలా మంది సెప్టెంబర్ 17ను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నోరు ఉంది కదా అని కేసీఆర్‌ను దూషించటమే పనిగా పెట్టుకొని, తొమ్మిది నెలలు టైమ్ పాస్ చేసినవ్.. చేతనైతే మీరిచ్చిన 420 అడ్డగోలు హామీలు అమలు చేసి చూపెట్టు.. - కేటీఆర్

సకల మర్యాదలతో తరలిస్తం

'తెలంగాణ ఆత్మను అవమానించినవ్.. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టినవ్. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సకల మర్యాదలతో రాజీవ్ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తం' అని కేటీఆర్ మరో మారు ప్రకటించారు. సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్ద పప్పు అని రేవంత్ రెడ్డి తిట్టాడని, వాటిని కవర్ చేసుకోడానికే ప్రాపకం చేస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు. 'రేవంత్‌రెడ్డి చేసిన తప్పునకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలతో అభిషేకం చేస్తామంటే అడ్డుకుంటారా? పోలీసులు అత్యుత్సాహాన్ని మానుకొని అరెస్ట్ చేసిన మా విద్యార్థి నేతలను వెంటనే విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు. తమ విద్యార్థి నాయకులు ఏం తప్పు చేశారని అరెస్ట్ చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టినవ్. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సకల మర్యాదలతో రాజీవ్ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తం. నీకు అంత ఇష్టమైతే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మీ ఇంట్లో పెట్టుకో.. గణేశ్ నిమజ్జనం రోజు చెప్తున్న రాసి పెట్టుకో.. కచ్చితంగా రాజీవ్ విగ్రహాన్ని తొలగిస్తం. - కేటీఆర్

హెల్త్ ఎమర్జెన్సీ పెట్టాల్సిన అవసరం

పల్లె, పట్టణం తేడా లేకుండా పారిశుధ్యం పడకేసిందని, చికున్ గున్యా, డెంగ్యూ, విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాల్సిన పరిస్థితి వచ్చిందని కేటీఆర్ వాపోయారు. 'బడుల్లో చాక్‌పీసుల్లేవు..మాజీ సర్పంచ్‌లు బిల్లుల కోసం బాధపడుతున్నరు. ఇప్పటికైనా ప్రజల దృష్టిని మళ్లించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలనపై ప్రభుత్వం దృష్టిసారించాలి' అని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గణపతి నిమజ్జనానికి సహకరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సీహెచ్ మల్లారెడ్డి, మహమూద్ అలీ, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎకరానికి కేసీఆర్ పది వేలే ఇస్తా అన్నడు, నేను 15 వేలు ఇస్తా అని డైలాగులు కొట్టుడు కాదు.. వానకాలం పంటలకు ఇంకా 14 రోజులు మాత్రమే టైముంది. దమ్ముంటే రైతుబంధు ఇవ్వు. - కేటీఆర్

గురుకులాలపై కక్ష ఎందుకు?

కేసీఆర్ నిండు మనసుతో తెచ్చిన గురుకులాలపై కక్ష ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాజకీయం చేయాలనుకుంటే తమతో చేయండి కానీ, పసిమనసులతో చేయకండి అని సూచించారు. 'కుక్కల కన్నా దారుణంగా చూస్తున్నారు.. నిత్యం పురుగుల అన్నం తినలేక, కడుపులు మాడ్చుకోలేక చచ్చిపోతున్నాం.. అడిగితే ప్రిన్సిపాల్ తిడుతున్నారు' అని గురుకుల విద్యార్థుల వేదనను ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేసి 'విద్యార్థుల ఆవేదన వినపడుతున్నదా?' అని ఆయన ప్రశ్నించారు. 'చదువుకుంటూ ఉన్నతంగా ఆలోచించాల్సిన ఆ పసిమనసులకు ఎందుకింత కష్టం? ఎందుకింత ఆవేదన? ఇదేనా ప్రజా పరిపాలన ? ఇదా ఇందిరమ్మ రాజ్యం? ఆ పసిపిల్లలకు ఇందిరమ్మ రాజ్యంలో కడుపు నిండా అన్నం పెట్ట లేరా? అని నిలదీశారు.

హైకోర్టు తీర్పుతో రేవంత్‌కు భయం

- అందుకే పిచ్చికూతలు కూస్తున్నడు
- ఓ జాతీయ న్యూస్ చానల్ ఇంటర్వ్యూలో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : 'ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పుతో సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకున్నది. అందుకే పిచ్చికూతలు కూస్తున్నారు' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పార్టీ ఫిరాయింపులు, సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం తదితర పరిణామాలపై ఆయన ఓ జాతీయ న్యూస్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు.



ఫిరాయింపులపై ప్రభుత్వ వైఖరి ఎలా ఉందని భావిస్తున్నారు?

మేం మొదటి నుంచి చెప్తున్నాం. చట్టం కండ్లుగప్పి ఎంతోకాలం ఉండలేరు. హై కోర్టు తీర్పు తర్వాత మంత్రి, ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలే సాక్ష్యం. సీఎం రేవంత్‌రెడ్డి మా పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరిగి కండువాలు కప్పితే.. మంత్రి శ్రీధర్‌బాబు వాళ్లు వాళ్లు చూసుకోవాలంటరు.. వాళ్ల పార్టీతో మాకేం సంబంధం అంటరు.. 10 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని హై కోర్టు తీర్పు రాగానే సన్నాయి నొక్కులు నొక్కుతున్నరు. మంత్రి, సీఎం ఎవరిని పిచ్చోళ్లను చేస్తున్నట్టు? కండువా కప్పినోడిది తప్పా? మాకేం సంబంధం లేదన్నోడిది తప్పా? వాళ్లే తేల్చుకోవాలి. ఫిరాయింపుల నిషేధ చట్టం విషయంలో సుప్రీం కోర్టు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పడం తో నాటకాలు మొదలయ్యాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎటూ కాకుండ పోతరు.

రాజీవ్‌గాంధీ విగ్రహంపై అభ్యంతరం ఎందుకు?

తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టినందుకే మా అభ్యంతరం. దేశంలో, రాష్ట్రంలో రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ, నెహ్రూ పేర్లతో అనేక సంస్థలు ఉన్నాయి. తెలంగాణ ఔటర్ రింగ్ రోడ్డుకు నెహ్రూ, యూనివర్సిటీకి ఇందిరా గాంధీ (ఇగ్నో), విమానాశ్రయానికి, స్టేట్ హైవేస్‌కు రాజీవ్‌గాంధీ పేర్లున్నాయి. వాటికి మేమెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. ఒక్క పేరు కూడా మార్చలేదు. మాజీ ప్రధానిగా దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను మేమే నాడూ విస్మరించలేదు. వారి కీర్తిని తగ్గించలేదు. కానీ, తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా రాజీవగాంధీ విగ్రహం పెట్టడాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణ అమరులకు నివాళిగా అమరజ్యోతి ని ర్మించుకున్నాం. కొత్త సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టుకున్నాం. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను విస్మరించి కుర్చీని కాపాడుకోవటం కోసం సోనియా, రాహుల్‌దగ్గర మార్కులు కొట్టేయటం కోసమే సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టాడు. అసలా విగ్రహం రాజీవ్‌గాంధీది కాదు రాహుల్‌గాంధీదని అంటున్నారు. ఆ వివాదంతో మాకు సంబంధం లేదు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ఆర్థిక సంక్షోభంపై మీరేమంటారు?

అధికారం కోసం హామీలిచ్చి ప్రజలను మోసం చేయవచ్చన్నదే కాంగ్రెస్ విధానం గా మారింది. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో హామీలిచ్చారు. తెలంగాణ లో 6 గ్యారెంటీలు అందులో 420 హామీ లు. ఎన్నికల సమయంలో అరచేతిలో వై కుంఠాన్ని చూపారు. కానీ జరిగింది శూన్యం. హిమాచల్‌ప్రదేశ్‌లో ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు గంజాయి సాగు ను చట్టబద్ధం చేస్తామంటున్నారు. దీనిపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి.

లా అండ్ ఆర్డర్‌పై మీ కామెంట్

అసలు రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? 30 రోజుల్లో 13 హత్యలు.. పత్రికల పతాక శీర్షికల్లో 'ఈ నగరానికి ఏమైంది?' వంటి కథనాలు వచ్చినయ్. ఉసిగొలిపే చర్యలు తప్ప బాధ్యతాయుత పాలన సాగుతున్నదా? పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏనాడైనా ఇలాంటి పరిస్థితిని చూశామా? అని ప్రజలు బాధపడుతున్నారు. ఇప్పుడు ఒక్క శాంతిభద్రతలే కాదు.. రాష్ట్రంలో పాలన మొత్తం గాడితప్పింది.

చిట్టినాయుడి సుభాషితాలతో రాజీవ్‌గాంధీకి అవమానం

రాజీవ్‌గాంధీని అవమానిస్తున్నదే రేవంత్‌రెడ్డి. కంప్యూటర్ కనిపెట్టింది చార్లెస్ బాబేజ్ అయితే రాజీవ్‌గాంధీ కనిపెట్టిండు అని, 1956లో రాజీవ్‌గాంధీకి 12 ఏండ్ల వయస్సున్నప్పుడు దేశంలో కంప్యూటర్ సేవలను టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ఆటోమేటిక్ క్యాలిక్యులేటర్ (టిఫ్రాక్) ప్రారంభిస్తే దాన్ని రాజీవ్ గాంధే పరిచయం చేశారని నోటికొచ్చినట్టు వాగుతూ ఆయనను రేవంత్‌రెడ్డే అవమాన పరుస్తున్నారు. చిట్టినాయుడు తనకు బాగా తెలిసిన రియల్ ఎస్టేట్ దందాలు, బ్లాక్‌మెయిల్.. వీటికే పరిమితం కావాలి కానీ, సుభాషితాలు ఎందుకు?



వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం

- తెలంగాణ భవన్‌లో అభిషేకించిన కేటీఆర్
- తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్వీ నాయకుల నిర్బంధం
- ఎక్కడికక్కడ అరెస్ట్
- రాష్ట్రంలో నిర్బంధ పాలన : గెల్లు శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు, నాయకులతో కలిసి తెలంగాణ భవన్‌లో ఆయన తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 'జైతెలంగాణ, జైజై తెలంగాణ'.. 'జోహార్లు జోహార్లు తెలంగాణ అమరవీరులకు జోహార్లు', 'సిగ్గు చేటు సిగ్గు చేటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సిగ్గు చేటు', 'సిగ్గు సిగ్గు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు సిగ్గు సిగ్గు'.. 'వర్ధిల్లాలి వర్ధిల్లాలి బీఆర్‌ఎస్ వర్ధిల్లాలి'.. అంటూ గులాబీ శ్రేణులు పెద్దపెట్టున నినాదాలు చేయడంతో తెలంగాణ భవన్, దాని పరిసరాలు దద్దరిల్లాయి.

జాతీయ జెండా ఆవిష్కరణ

సెప్టెంబర్ 17న జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పాటిస్తూ తెలంగాణభవన్ లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. పార్టీ శ్రేణులంతా కలిసి జాతీయగీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ,జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ కవిత పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ బీఆర్‌ఎస్వీ నేతల అరెస్ట్


తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్లలో ఉంచి వదిలేశారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నారని, ఆ కార్యక్రమానికి వెళ్తున్నామని చెప్పినా వినకుండా పోలీసులు అరెస్ట్ చేసినట్టు బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగబాలు, పడాల సతీశ్ తెలిపారు. వీరిని వేర్వేరు చోట్ల పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలించా రు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పదే పదే ప్రజాపాలన అని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, అన్ని వర్గాలపై నిర్బంధాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. సెప్టెంబర్ 17ను స్వేచ్ఛగా జరుపుకొనే హక్కులేదా? అని ప్రశ్నించారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటును నిరసి స్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేయాలని చూసిన బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్ట్ చేశారని, తెలంగాణ తల్లి విగ్రహాలకు కూడా క్షీరాభిషేకం చేయనివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పోలీసులతో పాలన సాగిస్తున్నారని విమర్శించా రు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా పోలీసులతో అధికారం చెలాయించిందో ఇప్పుడు కూడా అలానే చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే కొనసాగితే ప్రజల నుంచి తిరుగుబాటు తథ్యమని స్పష్టంచేశారు.

పాప పరిహారాన్ని పాలతో కడిగి..

నమస్తే తెలంగాణ నెటవర్క్, సెప్టెంబర్ 17 : సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో రేవంత్‌రెడ్డి సర్కారు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ కేటీఆర్ పిలుపుమేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలు, చిత్రపటాలను పాలతో అభిషేకించాయి. నాయకులతో కలిసి వనపర్తి నుంచి గోపాల్‌పేట వరకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బైక్ ర్యాలీ తీశారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని పాలతో శుద్ధిచేసి నిరసనలో పాల్గొన్నారు. సూర్యాపేటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య, దేవరకొండలో పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి తెలంగాణ తల్లికి క్షీరాభిషేకాలు చేశారు. సిరిసిల్లలో టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, పార్టీ జిల్లా, పట్టణ అధ్యక్షుడు తోట ఆగయ్య, పెద్దపల్లిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో, గోదావరిఖనిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు చేశారు. జగిత్యాలలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మెట్‌పల్లిలో బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, హనుమకొండలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ మండల కేంద్రం-లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేశారు.



నస్పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మహబూబాబాద్ బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు



జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

జమిలి మీమాంస

బీజేపీకి అత్యంత ప్రీతిపాత్రమైన వాటిలో '370 అధికరణం రద్దు', 'ఉమ్మడి పౌరస్మృతి'తో పాటు మరో ముఖ్య అంశం 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'. గత నెల ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో ఈ అంశాన్ని మరోమారు ప్రస్తావించారు. పదే పదే ఎన్నికలు దేశ ప్రగతికి అడ్డుపడుతున్నాయన్నారు. ఆయన ఇలా మాట్లాడటం అదే మొదటిసారి కాదు, గతంలో అనేక సార్లు 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' గురించి ఆయన బలంగా వాదించారు. అంతులేని ఎన్నికల చక్రభ్రమణంలో నుంచి దేశాన్ని బయటపడేయాలనడం మోదీకి పరిపాటిగా మారింది. బీజేపీ ప్రస్తుత పదవీ కాలంలోనే ఏక కాల ఎన్నికలనే వివాదాస్పద విధానాన్ని ప్రవేశ పెట్టాలనే కృత నిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నదనే సూచనలు వెలువడుతున్నాయి. అయితే, ఇవి నేరుగా అధికారిక ప్రకటన రూపంలో కాకుండా అభిజ్ఞ వర్గాల సమాచార రూపంలో బయటకురావడం గమనార్హం.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ, గత మార్చిలో సమర్పించిన నివేదికలో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' భావనను బలంగా సమర్థించింది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల పాలన పరమైన సుస్థిరత, విధానపరమైన స్పష్టత ఏర్పడి దేశానికి మేలు కలుగుతుందని ఆ కమిటీ అభిప్రాయపడింది. ఈ ప్రక్రియ ఓటర్లకు సౌకర్యంగా ఉంటుందని, అనవసరమైన హైరానా తప్పుతుందని, అధిక ఓటింగ్ నమోదుకు అవకాశం ఉంటుందని, దేశంపై ఎన్నికల నిర్వహణ వ్యయ భారం కూడా తగ్గుతుందని కూడా ఆ కమిటీ సూచించింది. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని, అదేవిధంగా 100 రోజుల లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం లోక్‌సభకు ఐదేండ్ల కాలవ్యవధితో ఎన్నికలు జరుగుతున్నాయి. కానీ, వివిధ రాష్ట్రాల్లో అర్ధాంతరంగా శాసనసభల రద్దు, ఇతరేతర కారణాల వల్ల పదే పదే ఎన్నికలు జరపాల్సి వస్తున్నది.

ఏక కాల ఎన్నికల విషయంలో దేశంలో ఏకాభిప్రాయం లేదు. దీన్ని సమర్థించేవారు ఉన్నట్టుగానే వ్యతిరేకించేవారు కూడా బహుళ సంఖ్యలో ఉన్నారు. దీని సమర్థకులు ఎన్నిల వ్యయం తగ్గడం మొదలుకొని ప్రభుత్వ పరిపాలనా సౌలభ్యం దాకా పలు కారణాలను చూపిస్తుంటారు. ప్రాంతీయ అస్థిత్వాలు, ఆకాంక్షలు వెనుకతట్టు పడతాయని, సమాఖ్యవాదానికి ముప్పు ఏర్పడుతుందని, లోక్‌సభతో పాటు అసెంబ్లీలకూ ఎన్నికలు జరిపితే జాతీయవాద ఎజెండా ముందుకువచ్చి రాష్ట్రాల ప్రాధాన్యాలు నిర్ణయాత్మకం కాకుండా పోతాయనేవి వ్యతిరేకుల ప్రధాన అభ్యంతరాలు. జమిలి ఎన్నికలు జరపాలంటే కనీసం ఐదు రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయని, ఇది అంత సులభసాధ్యమైన విషయం కాదని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. మూడో హయాంలో మైనారిటీలోకి పడిపోయి, మిత్రపక్షాల మద్దతుతో సర్కారును నెట్టుకొస్తున్న ఎన్డీయే ప్రభుత్వం ఇదంతా ఎలా సాధిస్తుందన్నది ప్రశ్న. కానీ, మిత్రపక్షాలైన తెలుగుదేశం, జేడీయూ ఏకకాల ఎన్నికలకు సానుకూలంగా ఉన్నాయని బీజేపీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ప్రస్తుతం ఎన్డీయేలో భాగంగా ఉన్న జనతా పరివార్ పార్టీలు జమిలి భావనను సమర్థిస్తున్నప్పటికీ డీఎంకే, టీఎంసీ, ఆప్ వంటివి గట్టిగా వ్యతిరేకిస్తుండటం గమనార్హం. 2017లో జరిగిన ఒక సర్వే ప్రకారం లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే 77 శాతం మంది ఒకే పార్టీని ఎన్నుకునే అవకాశాలున్నాయని, అలా కాకుండా ఆరు మాసాల తేడాతో జరిగితే వేర్వేరు పార్టీలను ఎన్నుకునే అవకాశాలు పెరుగుతాయని, ఒకే పార్టీని ఎన్నుకునే అవకాశాలు 69 శాతం తగ్గిపోతాయని వెల్లడైంది. ఈ అంశమే బీజేపీని జమిలి వైపు లాగుతున్నద నే వాదన ఉన్నది. జమిలి వంటి సుదూర పర్యవసానాలు కలిగిన మార్పుల విషయంలో కేంద్రం ఆచితూచి అడుగువేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అన్నిపక్షాల అభిప్రాయాలు తీసుకొని, రాజ్యాంగపరమైన, పరిపాలనపరమైన అంశాలను లోతుగా పరిశీలించిన తర్వాతే దీనిపై ముందడుగు వేయడం శ్రేయస్కరం. కానీ, దుందుడుకు పోకడలకు పేరుగాంచిన మోదీ సర్కారు ఆ మార్గంలో పయనిస్తుందా?

మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఒక తినుబండారాల దుకాణానికి వెళ్లాను. అది గోదావరి జిల్లాల వాళ్లది. దాని యజమానికి నేను జర్నలిస్టునని తెలుసు. నన్ను చూడగానే 'ఏం సార్ ఎట్లా ఉంది పరిస్థితి' అన్నాడు. ఆ వెంటనే, 'ఎట్లా ఉంది పరిపాలన' అని అడిగాడు. ఆ రోజుల్లోనే ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, పాడి కౌశిక్‌రెడ్డిల ఉదంతం నడుస్తున్నది. పరిస్థితి ఎట్లా ఉందని ఆయన అడిగింది ఈ ఉదంతం గురించి. పరిపాలన అన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి. జర్నలిస్టులు మాట్లాడించాలి తప్ప తాము మాట్లాడగూడదు గనుక, 'మీరే చెప్పాల'న్నాను. 'గొడవలేవో ఉంటూనే ఉంటాయి. కానీ, ఒక ఎమ్మెల్యే తన మనుషులతో పోయి ఇంకో ఎమ్మెల్యేపైన దాడి చేయటమేంటి సార్. ఇటువంటిది ఎప్పడూ చూడలేద'న్నాడు. 'కౌశిక్‌రెడ్డి ప్రాంతీయ భేదాలు తెస్తున్నట్టు గాంధీ అంటున్నారు గదా' అని అడిగాను. 'ఏంటి సార్, మేమంతా కేసీఆర్‌ను ఎప్పటినుంచి చూస్తున్నాం. అటువంటిది ఎప్పుడైనా ఉందా' అన్నాడు.

ఒక్క ఏడాదిలోనే ఇట్లా ఉంటే..



టంకశాల అశోక్



అంతలో మళ్లీ తానే, 'ఈ రేవంత్‌రెడ్డి పరిపాలనేమిటో అర్థం కావడం లేదు. ఏం జరుగుతున్నదో, ఏం జరగటం లేదో తెలియటం లేదు. రియల్ ఎస్టేట్ అయితే అంతా కుప్పకూలింది. మా వాళ్లు చాలామంది మళ్లీ కేసీఆర్ వస్తాడనుకొని 50 కోట్లు, 100 కోట్లు తెచ్చి వ్యాపారాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ రావటంతో గందరగోళం మొదలైంది. ఇప్పుడు ఇదేదో హైడ్రా అని పెట్టారు. దానితో అంతా కుప్పకూలింది. వాళ్లకు ఏం చేయాలో తోచటం లేద'న్నాడు. ఈ మాటలు సాగుతుండగా, దుకాణం బయట కూర్చుని ఉన్న పెద్దాయన ఒకరు లోపలికి వచ్చి, 'ఏంటీ రేవంత్‌రెడ్డి గురించేనా' అని గోదావరి యాసలో అడిగాడు. జవాబు గురించి ఎదురుచూకుండానే 'ఛీ ఛీ ఛీ' అంటూ మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. నేను కొనటం పూర్తిచేసి వెళ్తుండగా 'రియల్ ఎస్టేటే కాదు, అన్నీ ఇలాగే ఉన్నాయి. ఒక్క ఏడాదిలోనే ఇలా ఉంటే, ఇంకా నాలుగేండ్లు ఎలా నడుస్తాయి సార్' అన్నాడు.

ఇంటికి వెళ్తుండగా, వెళ్లిన తర్వాత కొంత సేపటి వరకూ ఆ మూడు విషయాల చుట్టూ ఆలోచనలు తిరుగుతూ పోయాయి. ఒకటి, గాంధీ, కౌశిక్‌రెడ్డిల ఉదంతం. రెండు, హైడ్రా. మూడు, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన. వీటిలో మొదటిది ముందుగా చూస్తే, తినుబండారాల దుకాణం యజమాని అన్నట్టు, రాజకీయాలలో గాని, నాయకుల మధ్య గాని గొడవలు ఏవో ఉంటూనే ఉంటాయి. వాటిని వివరంగా తెలుసుకుంటూ, అందులోని తప్పొప్పులపై ఒక అభిప్రాయానికి వచ్చేంత సమయం సాధారణ ప్రజలలో ఎక్కువమందికి ఉండదు. వారికి తమ పనులు తమకుంటాయి. అయితే, కొన్ని కొండ గుర్తులు మిగిలిపోయాయి. తిరిగి ఆ యజమానే అన్నట్టు, మామూలుగా ఉండే గొడవలు వేరు, ఒక ఎమ్మెల్యే అంతటి మనిషి మరొక ఎమ్మెల్యే ఇంటికి మనుషులతో వెళ్లి దాడి చేయటం వేరు. ఇటువంటి ఘటన తానెన్నడూ చూడలేదన్నాడాయన. అవును, మనమెవరమూ చూడలేదు కూడా. అందునా అటువంటిది, ప్రశాంతతకు మొత్తం దేశంలోనే పేరుపడిన తెలంగాణలో జరగటం నమ్మశక్యం కానిది. అది అందరినీ దిగ్భ్రమకు గురిచేసింది.

దీనంతటికీ మూలం ఎక్కడుంది, పార్టీ ఫిరాయింపులేమిటి, ఆ సంస్కృతికి 1967 నాటి హర్యానాలో ప్రారంభోత్సవం చేసిందెవరు, తెలంగాణ విషయానికి వస్తే టీఆర్‌ఎస్ విషయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిందేమిటి, తర్వాత కేసీఆర్ ఏం చేశారు, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన ఏం జరుగుతున్నదనే దంతా ఒక సుదీర్ఘ చర్చ. ప్రజలకు, ప్రజాస్వామ్యానికి సంబంధించినంత వరకు ఇదంతా ఎప్పుడూ ఉన్నదే. అందుకు సంబంధించిన వాదోపవాదాలు, చట్టాలు, కేసులు, చట్టాలను వంకర టింకరగా తిప్పే చాతుర్యాలు, దీనంతటిలో స్పీకర్లు, గవర్నర్ల పాత్రలు ఒక అంతులేని నీతిరహితమైన కథ వలె నిరంతరం సాగుతున్నవే. ప్రస్తుత సందర్భంలోనూ బీఆర్‌ఎస్ నుంచి కొన్ని ఫిరాయింపులు, వాటిపై ఫిర్యాదులు, అవి స్పీకర్‌తో పాటు హైకోర్టు పరిధిలో ఉండటాన్ని ప్రజలు గమనిస్తూ వస్తున్నారు. చివరికి ఏం జరుగుతుందన్నది వారి ఆసక్తి. కానీ, ఇటువంటి సాధారణ స్థాయి పరిణామాల క్రమం కాస్తా, కౌశిక్‌రెడ్డి ఇంటిపై గాంధీ భౌతికదాడితో అకస్మాత్తుగా మరొకస్థాయికి వెళ్లింది.

> **తెలంగాణలో రాజకీయ సంస్కృతి ఈ స్థాయికి పతనం కావటమన్నది మనకు ఆందోళన కలిగిస్తుండటం ఒక విషయం కాగా, ఇది ఈ ఒక్క ఘటనతో ఆగుతుందా, ఇంతకు మించి కూడా మరేమైనా జరగవచ్చునా అన్నవి ఇతర ప్రశ్నలు. కౌశిక్‌రెడ్డిని చంపివేయగలనని గాంధీ కుమారుడు ఇప్పటికే బహిరంగంగా హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి. దాన్ని బట్టి, ప్రశాంతతకు పేరుబడ్డ తెలంగాణ రాజకీయాల్లో కొత్తగా ఒక ప్రమాదకర దశ రాగలదేమోనని మనం భయపడాలేమో తెలియటం లేదు.**

హైడ్రా విషయానికి వస్తే, దాని లక్ష్యం చాలా మంచిది. అదే సమయంలో రెండు మాటలు చెప్పాలి. పర్యావరణ పరిరక్షణ అనే కోణం నుంచి అది కీలకమైనది కాగా, దాని అమలుతో ముడిబడిన సామాజిక అంశాల కోణం నుంచి సున్నితమైనది. అటువంటప్పుడు ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకుంటూ ముందుగా చేయవలసిన ఆలోచనలు, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనేకం ఉంటాయి. అట్లా చేయనప్పుడు ఒక వైపు అమలులో హైడ్రా సంస్థకు, రెండవ వైపు ప్రజలకు కలిగే అయోమయాలు, అనర్థాలు అనేకం ఉంటాయి. కానీ, ఇంత భారీ కార్యక్రమాన్ని తలపెట్టినప్పుడు అవసరమైన ముందస్తు ఆలోచనలు, ఏర్పాట్లు జరగకపోవటమన్నది ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అందువల్లనే ప్రజల నుంచే గాక కోర్టుల నుంచి కూడా మళ్లీ మళ్లీ ప్రశ్నలు, విమర్శలు ఎదురవుతున్నాయి. పర్యావరణ లక్ష్యం పట్ల మొదట కలిగిన సదభిప్రాయం నెమ్మదిగా మసకబారిపోతున్నది. అయినప్పటికీ ప్రభుత్వం గాని, హైడ్రా గాని తగు సవరణలు చేసుకోకపోవటం తీవ్రమైన అభ్యంతరకర విషయం.

విస్తృతంగా చర్చకు వచ్చినవే అయినా కొన్ని ప్రధాన అంశాలను మరొకమారు పేర్కొందాం. హైడ్రాను తెలంగాణ అంతటా గాక హైదరాబాద్‌లోని ఓఆర్ఆర్‌కు పరిమితం చేయటం ఎందుకనే ప్రశ్నను పక్కన ఉంచుదాం. ప్రస్తుతానికి తీసుకున్న పరిధిలోనైనా ఏమి చేయవలసింది? అన్ని చెరువులు, కుంటలు, నాలాల జాబితా ఏమిటి? వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల సరిహద్దులు ఎక్కడున్నాయి? అందుకు సంబంధించిన మ్యాప్‌లు, ఉపగ్రహ చిత్రాలు? ఆ ప్రకారం నేలపై గుర్తింపులు? మ్యాప్‌లు, ఉపగ్రహ చిత్రాలు వేర్వేరు ప్రభుత్వ శాఖల వద్ద, సంస్థల వద్ద వేర్వేరుగా పరస్పర విరుద్ధంగా గల సందర్భాలు కూడా కనిపిస్తున్నందున వాటిలో దేనిని ప్రామాణికంగా తీసుకోవాలి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో గల తాత్కాలిక నిర్మాణాలు, శాశ్వత నిర్మాణాలు ఏవి? శాశ్వత నిర్మాణాల స్థలాలకు రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతులు ఎంతకాలం క్రితం ఇచ్చారు, ఇచ్చిందెవరు? నిర్మాణాల తర్వాత ఇంటి నంబర్, వివిధ కనెక్షన్లు, ఇతర పౌర సదుపాయాలు కల్పించిందెవరు?

వీటన్నింటికి రుసుముల వసూలు ఏ విధంగా ఎవరు చేస్తున్నారు? ఇంకా నిర్మాణ దశలో ఉన్నవి ఏవి? నిర్మాణాలు చేసినవారు వ్యక్తులు, స్వయంగానా లేక బిల్డర్లా? సహకార గృహ నిర్మాణ సంస్థలా? నిర్మాణమైన తర్వాత ఎవరినుంచి ఎవరికైనా అమ్మకాల ద్వారానో లేక కుటుంబ పంపిణీల వల్లనో చేతులు మారాయా? స్థలాలను ప్రభుత్వాలే ఏవో పథకాల కింద పేదలకు పట్టాలిచ్చినవి ఉన్నాయా? పక్కాగా కబ్జాలు జరిగినవి ఏవి? దీనంతటిలో నాయకుల పాత్ర ఏమిటి? తరచూ ప్రకటిస్తూ వస్తున్న క్రమబద్ధీకరణ పథకాలు వర్తించినవి ఏవి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు ఉన్నప్పటికీ వాతావరణ మార్పులు, నీటి పరీవాహకతలో మార్పుల వల్ల దశాబ్దాల కాలంలో ప్రజలు, అధికారులు గాని గమనించక సహజమైనరీతిలో కుంచించుకుపోయినవి ఏవి? ఇప్పుడు ఉల్లంఘనలను వెనుకకు పోయి గుర్తించేందుకు కటాఫ్ సంవత్సరం ఏమిటి? వీటన్నింటిని తిరగదోడటం ఎట్లా? దేనిని ఆధారంగా తీసుకొని ఆ పనిచేయాలి? చివరకు ఇవన్నీ సమగ్రంగా తేలి ఒక చిత్రం స్పష్టమైన వెనుక చర్యలు తీసుకునేందుకు ఎట్లా ముందుకు కదలాలి? ఆ విషయంలో చట్టాలు, ఇతరత్రా ప్రభుత్వ నిబంధనలు, గతంలో కోర్టు తీర్పులు ఏం చెప్తున్నాయి?

గమనించదగిన మౌలిక వైఫల్యం ఏమంటే, ఇటువంటి మేధోమథనం ఏమీ జరగలేదు. అంతేకాదు, కూల్చివేతల వల్ల శాశ్వత నివాసాలు కోల్పోయే అమాయక కొనుగోలుదారుల గురించి గాని, తాత్కాలిక నివాసాలు పోగొట్టుకునే పేదల విషయంలో గాని చేయవలసిందేమిటి? ఈ చర్యలన్నింటి ఫలితంగా హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, ప్రజలు, వ్యాపారాలు, పరిశ్రమలు ఆర్థికంగా దెబ్బతినే అవకాశాలున్నాయా? ఉంటే ఏ విధంగా, ఏ మేరకు? ఆ నష్టాలను ఏ విధంగా వీలైనంత మేరకు పరిమితం చేయాలి? తర్వాత తిరిగి ఏ విధంగా కోలుకోవాలి? అందుకు ఇప్పటినుంచే ఏమి ఏర్పాట్లు చేసుకోవాలి? అనే ఆలోచనలు గాని, వాటినన్నింటిని ప్రజల ముందు పారదర్శకంగా, ప్రజాస్వామికంగా ఉంచటం గాని ఏమీ జరగలేదు.

హైడ్రా అధికారి రంగనాథ్ అరకొర మాటలేవో ఇప్పుడు చెప్తున్నారు. హైడ్రా కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొన్ని వారాల పాటు ఆయన నుంచి ఈ మాత్రపు సంయమనపూరితమైన మాటలు అయినా వినిపించలేదు. పైగా, కోర్టుకు ఎవరైనా వెళ్తే స్టే వచ్చేలోపల కూల్చేస్తాం తరహా విభ్రాంతికరమైన మాటలు మాట్లాడారు. చివరికి పేదల రేకుల ఇళ్లను సైతం రాత్రి వేళ కూల్చే అత్యుత్సాహానికి పాల్పడ్డారు. ఆ మాటలు చేతలు చూడగా, హాలీవుడ్ సినిమాలలో అశ్వారూఢులై వచ్చి పిస్తోళ్లను తీసి ఢాం ఢామ్మని పేల్చి మళ్లీ అంతే వేగంగా దూసుకుపోయే పాత్రలు గుర్తుకువచ్చాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార యంత్రాంగం వ్యవహరించదగిన పద్ధతేనా అది? అది కూడా పైన సుప్రీంకోర్టు, ఇక్కడ హైకోర్టూ, బుల్డోజర్ న్యాయాలు తగవని, చట్టవిరుద్ధమని హెచ్చరిస్తుండగా. ఈ తీరు వల్ల రియల్ ఎస్టేట్ కుప్పకూలటం, పేదలే నిరాశ్రయులు కావటం, మధ్య తరగతిలో, పై తరగతిలో, వ్యాపార వర్గాలలో భయాందోళనలు వ్యాపించటం ఒక్కటైతే, అంతకన్న మౌలికంగా ప్రభుత్వం పట్ల, హైడ్రాతో సహా అధికార యంత్రాంగం పట్ల ప్రజల విశ్వాసం దెబ్బతినిపోతున్నది. కబ్జాదారులలో భయం సృష్టించటం కూడా తమ లక్ష్యమన్నారు హైడ్రా కమిషనర్. అది మంచి మాటే. కానీ భయం సృష్టి చట్టాల సక్రమమైన అమలు ద్వారా జరగాలి తప్ప, పైన అన్న హాలీవుడ్ సినిమాల తీరులో కాదు. రంగనాథ్‌కు గత రికార్డు వల్ల మంచి పేరు, గౌరవం తగినంత లభించగా, తన మాటలు చేతల తీరు కారణంగా ఇప్పుడది దెబ్బతినటం మొదలైంది. కనుక సంయమనం చూపించి జాగ్రత్తపడటం మంచిది. అంతకన్న ముఖ్యంగా, సమగ్రమైన సమాచారంతో సంపూర్ణమైన విధి విధానాలు రూపొందించి ఇవ్వవలసిందిగా, వాటిని ప్రజలకు పారదర్శకంగా ప్రకటించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరాలి. లేనిపక్షంలో ప్రభుత్వ వైఫల్యాల దోషం తనకు సైతం చుట్టుకోకతప్పదు.

చివరగా ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఏర్పడుతున్న అభిప్రాయాలు అనేకం ఉన్నా, వాటి సారాంశాన్ని ఒకే ఒక వాక్యంలో చెప్పుకోవాలంటే, తిరిగి ఆ తినుబండారాల దుకాణం యజమాని నిస్పృహగా, 'ఒక్క ఏడాదిలోనే ఇలా ఉంటే ఇంకా నాలుగేండ్లు ఎలా నడుస్తాయి సార్' అని అడిగినట్టు, పరిస్థితులు అనేక విధాలుగా నానాటికి నిస్పృహకరంగానే మారుతున్నాయి. ఆ వివరాలు అనేకానేకం అయినందున, అందరూ గమనిస్తున్నవే గనుక, ఇక్కడ ప్రత్యేకంగా ఏకరవు పెట్టుకోవల్సిన అవసరం లేదు కూడా. ■

తెల్ల కోటు విప్లవానికి కేసీఆర్ నాంది

ఒక దేశం ప్రగతి దిశగా పయనిస్తున్నదా? పతనం వైపు పురోగమిస్తున్నదా? అని తెలుసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రమాణాలున్నాయి. గతంలో ప్రతీ విషయాన్ని ఆర్థిక అంశాలతో ముడిపెట్టి చూసేవారు. కానీ, ఇప్పుడు ప్రగతిని కొలిచే పద్ధతి మారింది. ఎక్కడ మనిషి మంచి విద్య, వైద్యం పొందగలుగుతున్నాడు? తదితర అంశాల ఆధారంగా ఐరాస పలు దేశాలకు రేటింగ్ ఇస్తున్నది. 193 దేశాలున్న ఈ జాబితాలో మనది 134వ స్థానం కావడం శోచనీయం.



తన్నీరు హరీశ్‌రావు



మానవ అభివృద్ధిని పరిగణనలోకి తీసుకు న్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆ దిశగా పాలన ప్రారంభించా రు. తెలంగాణ ప్రజలు అత్యున్నత జీవన ప్రమాణాలతో జీవించాలని ఆయన తపించారు. ఆ తపనలోంచి పుట్టిన కార్యక్రమాలే రెసిడెన్షియల్ స్కూళ్లు, మిషన్ భగీరథ, శాంతిభద్రతల పరిరక్షణ, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపరచడం.

ప్రజా వైద్యాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దితే ఆరోగ్య తెలంగాణను సాధించవచ్చనేది కేసీఆర్ భావన. మన దేశంలో ప్రజలకు సరిపడా వైద్యులు, వైద్య కళాశాలలు లేవు. ఉన్న కొన్ని మెడికల్ కాలేజీలు కూడా ప్రైవేటువే. ఆస్ట్రేలియాలో ప్రతీ వెయ్యి మందికి 5.5, బ్రిటన్‌లో 3.2, అమెరికా, చైనాలో 2.6 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. కానీ, మన దేశంలో ఒక్కరు మాత్రమే ఉన్నారు. అదీ కూడా ఒక్క అల్లోపతిలో కాదు, వివిధ రంగాల్లో కలిపి ఈ సంఖ్య ఉన్నది. అందుకే, తెలంగాణ ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలందించాలనే సంకల్పంతో 2014లోనే కేసీఆర్ రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. తత్ఫలితంగానే నేడు దేశంలో అత్యుత్తమ ప్రజావైద్యం అందుతున్న మొదటి మూడు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది.

ఇక వైద్య కళాశాలల విషయానికి వస్తే.. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలన ఓ స్వర్ణయుగం. దేశంలో మరెక్కడా లేనివిధంగా, కొత్త జిల్లాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాకో వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌ది. తాజాగా 4 వైద్య కళాశాలలకు అనుమతి రావడంతో వాటి సంఖ్య 34కు చేరింది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణ ప్రాంతంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. ఈ సంఖ్యను పెంచాలని అసెంబ్లీలో, బయటా మేం ఎంత మొత్తుకున్నా ఫలితం లేదు. నాలుగు జిల్లాలున్న రాయలసీమలో నాలుగు మెడికల్ కాలేజీలు, 9 జిల్లాలున్న ఆంధ్రలో 7 మెడికల్ కాలేజీలుండేవి. కానీ, పది జిల్లాలున్న తెలంగాణలో మరో మూణ్నాలుగు మెడికల్ కాలేజీలు పెట్టాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం, దానికి తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నిక కావడంతో మెడికల్ కాలేజీల కల నెరవేరింది. ఉమ్మడి రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన కేసీఆర్ కేంద్రం ఏ మాత్రం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతోనే జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటుచేశారు. కేంద్రం దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలను మంజూరు చేయగా, మనకు ఒక్కటీ ఇవ్వకపోవడం గర్హనీయం.

తెలంగాణ ఏర్పాటుకు ముందు 70 ఏండ్లలో రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటైతే, తొమ్మిదేండ్ల స్వయం పాలనలో 29 మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేస్తూ తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే రికార్డు సృష్టించింది. 2014 నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 850 ఎంబీబీఎస్ సీట్లుండగా, నేడు వాటి సంఖ్య 4,090కి పెరిగింది. ఏటా పది వేల మందికి పైగా డాక్టర్లను తయారుచేసే రాష్ట్రంగా తెలంగాణ తయారైంది. తెలంగాణ చేసిన కృషి ఫలితంగా నేడు దేశంలో జనాభా, వైద్యుల మధ్య నిష్పత్తి తగ్గింది.

మెడికల్ కళాశాలలు మాత్రమే కాదు, వాటికి అనుబంధంగా అన్ని వసతులతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు కూడా అందుబాటులోకి వచ్చాయి. 450-1000 పడకల సామర్థ్యం గల ప్రభుత్వ ఆసుపత్రులు అనేక జిల్లాల్లో ఇప్పటికే నడుస్తున్నాయి. ఈ ఆసుపత్రుల్లో 60-100 మంది వరకు వైద్యులు అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల వైద్య సేవలందుతున్నాయి. డయాలసిస్, డయాగ్నస్టిక్, క్యాన్సర్, మదర్ అండ్ చైల్డ్ కేర్ సెంటర్లు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నాయి. ప్రతీ జిల్లా కేంద్రంలోనూ ఇలాంటి ఆసుపత్రి అందుబాటులో ఉండటం వల్ల ఇవాళ తెలంగాణ ప్రజలు వంద కిలోమీటర్ల లోపే మెరుగైన వైద్యాన్ని పొందుతున్నారు. ఇది తెలంగాణ సాధించిన గొప్ప వైద్య విజయం.

> **కేసీఆర్ మంజూరు చేసిన మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం నుంచి ఇటీవల అనుమతులు లభించడం సంతోషకరం. యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ సహా గత నెలలో అనుమతి పొందిన ములుగు, నర్సంపేట్, గద్వాల్, నారాయణపేట్ ప్రాంత ప్రజలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు. దీంతో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ కల సాకారమైంది. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది.**

ఈ ఏడాదికి సంబంధించి మొత్తం 8 మెడికల్ కాలేజీలు ఏర్పాటు కోసం గత కేసీఆర్ ప్రభుత్వం నిధులు, భూ కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతులు జారీచేసింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కాలేజీలకు గాను నాలుగు మెడికల్ కాలేజీలకు మాత్రమే ఎన్ఎంసీ నుంచి గత నెల అనుమతులు లభించాయి. నిబంధనల ప్రకారం మౌలిక వసతుల ఏర్పాటు, బోధనా సిబ్బంది నియామకంలో ప్రభుత్వం విఫలమైందనే కారణంతో ఎన్ఎంసీ అనుమతులు నిరాకరించింది. జరిగిన తప్పును ఆలస్యంగా గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులు, బోధన సిబ్బందిని సమకూర్చుకుంటామని అనుమతి కోరుతూ కేంద్రానికి అప్పీల్ చేసింది. దీన్ని పరిశీలించిన కేంద్రం ఆ 4 మెడికల్ కాలేజీలకు అనుమతులివ్వాలని ఎన్ఎంసీకి మార్గనిర్దేశం చేసింది. దీంతో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం నాలుగు కాలేజీల్లో 200 సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి రానున్నాయి. కొత్త సీట్లతో కలుపుకొని తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే మొత్తం సీట్ల సంఖ్య 4,090కు చేరుకున్నది. తొమ్మిదేండ్లలో ఆ సంఖ్యను కేసీఆర్ సర్కార్ 5 రెట్లు పెంచింది. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి ఏటా పదివేల మందికి పైగా డాక్టర్లను తయారుచేసే రాష్ట్రంగా తెలంగాణ ఎదిగింది. ఎంబీబీఎస్ సీట్లలో లక్ష జనాభాకు 22 సీట్లతో దేశంలోనే తొలిస్థానంలో నిలవడం గర్వకారణం. పేద ప్రజల చెంతకే సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడంతో పాటు, మన బిడ్డలు వైద్య విద్య చదివే అవకాశాలను కేసీఆర్ గణనీయంగా పెంచారు.

వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం విప్లవాత్మకమైన పురోగతిని సాధించింది. అరవై ఏండ్లలో సాధ్యం కాని అద్భుతాలను దశాబ్దంలోనే ఆవిష్కరించింది. తెలంగాణ పిల్లలు వైద్యవిద్య కోసం లక్షలు ఖర్చుచేసి చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. విద్యార్థులు మాతృభూమికి, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ అవస్థలు పడాల్సిన అవసరం లేదు. ఒకవైపు ఎంబీబీఎస్ చదవాలనే ఆశ, మరోవైపు అర్థం కాని భాష, దేశం కాని దేశంలో గోస. ఇదంతా ఒకనాడు. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, లోకల్ రిజర్వేషన్ వల్ల డాక్టర్ చదవాలనుకునే తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి. శ్వేత విప్లవం, హరిత విప్లవం, గులాబీ విప్లవం, నీలి విప్లవాలకు నిలయంగా మారిన తెలంగాణ, జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైట్ కోట్ విప్లవానికి నాంది పలికింది. ఇక్కడ ఎంబీబీఎస్ చదివినవారు రాష్ట్ర ప్రజలకే కాదు, వివిధ దేశాల్లోనూ సేవలందించబోతున్నారు. తద్వారా తెలంగాణ ఖ్యాతిని దశ దిశలా వ్యాపింపజేయబోతున్నారు.

సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ వైద్య విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా, వైద్య విద్య హబ్‌గా ఎదిగిందని చెప్పేందుకు గర్వపడుతున్నాను. పెరిగిన మెడికల్ సీట్లను రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. డాక్టర్ కావాలనే తమ కలను సాకారం చేసుకోవాలి. మెడికల్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం దృష్టిసారించాలని, మౌలిక వసతులు, బోధనా సిబ్బంది కొరత లేకుండా చూడాలి. అంతేకాదు, ఏటా ఎన్ఎంసీ అనుమతులు (రెన్యువల్) కొనసాగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. తద్వారా వైద్య విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

(వ్యాసకర్త: వైద్యారోగ్య శాఖ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు)

వెదురు గడ్డిజాతి మొక్కనే...



జొర్రిగల శ్రీనివాస్
(మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

ప్రపంచ వెదురు దినోత్సవాన్ని సెప్టెంబర్ 18న జరుపుకొంటున్నాం. వెదురుకు 'ఆకుపచ్చ బంగారం' అనే మరో పేరున్నది. దీనిపై ఆధారపడే మేదరులు తమ బతుకును వెళ్లదీస్తారు. అయితే, మేదర కులం ఒకటి ఉన్నదనే విషయం కూడా చాలామందికి తెలియకపోవడం విచారకరం.

సహజంగా అటవీ ప్రాంతాల్లో లభించే వెదురును సేకరించి దానితో చాటలు, బుట్టలు, గంపలు, మొంటెలు, తడకలు, నిచ్చెనలు, గుమ్ములు, విసనకర్రలు, జల్లెడలు, కోళ్ల గంపలు మొదలైన వస్తువులను మేదరులు కళాత్మకంగా తీర్చిదిద్దుతారు. ఇదొక ఇంజినీరింగ్ కళ. వెదురుతో తయారుచేసే వస్తువులన్నీ పర్యావరణహితమే. గతంలో గృహోపకరణాలు, వ్యవసాయానికి కావలసిన వస్తువులు వెదురుతో తయారుచేసినవే వాడేవారు. కానీ, ప్లాస్టిక్ కారణంగా ఈ వృత్తికి, వెదురు వస్తువులకు డిమాండ్ తగ్గిపోయింది. అంతేకాదు, ముడిసరుకైన వెదురు కూడా లభించడం గగనమైపోయింది. అందుకే, మేదరులు ఈ వృత్తికి దూరమై అడ్డా కూలీ, ఇతరత్రా పనులు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మేదర వృత్తి కనుమరుగైపోవడం ఖాయం.



వెదురు చెట్టుకాదు, అదొక గడ్డి జాతి మొక్క. ఈ మేరకు 1926 అటవీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించి, వెదురు నరకడంపై ఉన్న నిషేధాన్ని సడలించింది. కానీ, అధికారులు మాత్రం మేదరులను ఇప్పటికీ దొంగలుగానే పరిగణిస్తున్నారు. అడవి తల్లే జీవనాధారంగా బతుకుతున్న మేదరులు దేశమంతటా ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారు. కానీ, తెలంగాణ, ఏపీలో మాత్రమే వీరు బీసీలు కావడం గమనార్హం. కాబట్టి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుబడిన వీరిని ఆయా ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేర్చాలి. నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి. ముఖ్యంగా వెదురు వస్తువు లనే ఉపయెగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. మేదర వృత్తి కనుమరగువుతున్న నేపథ్యంలో కులవృత్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

(నేడు ప్రపంచ వెదురు దినోత్సవం)





మెదక్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

అప్పులపై తప్పుడు లెక్క

మొదటిపేజీ తరువాయి...

ప్రయోజనం ఏమిటని నిలదీశారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమాల కోసం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమేనని అసెంబ్లీ వేదికగా వివరించామని చెప్పారు. తెచ్చిన అప్పులను మూలధనంగా మార్చి ఎన్ని ఆస్తులు, ఎంత సంపద సృష్టించామో లెక్కలతో సహా అసెంబ్లీ వేదికగా వివరించామని గుర్తుచేశారు. అయినా రూ.6.85 లక్షల కోట్ల అప్పు ఉన్నదని, రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం ఏమిటని మండిపడ్డారు. దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీసిందని ప్రచారం చేయడం ముఖ్యమంత్రికి తగునా? ఇది పాపం కాదా? అని ప్రశ్నించారు. కేవలం అప్పుల గురించి మాట్లాడుతున్నారు కానీ, తెలంగాణ దేశంలోనే తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచిన విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. రాష్ట్రం దివాలా తీసిందనే మాటాలు విని పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా వస్తారా? రాజకీయ కక్షల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తారా? భావి తరాలకు శిక్ష వేస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రతిష్ఠను కాపాడటం అంటే విదేశాలకు వెళ్లి ఇక్కడి డొల్ల కంపెనీల్లో బోగస్ పెట్టుబడులు పెట్టినంత సులువు కాదని చురకలేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సీఎం బాధ్యత లేని వ్యాఖ్యల వల్ల ఇప్పటికే పలు పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాయని విమర్శించారు. ప్రభుత్వ ఆనాలోచిత చర్యల వల్ల రియల్‌ఎస్టేట్ కుదేలైందని దుయ్యబట్టారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ రేవంత్ పాలనలో టాప్ పది స్థానాల్లో సైతం లేకుండా పోయిందని మండిపడ్డారు. దీనికి మీ దివాలాకోరు వ్యాఖ్యలు, చేతగానితనం కారణం కాదా? అని ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపు కోసం రాష్ట్ర ప్రయోజనాలను సైతం పణంగా పెట్టే గొప్ప ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని వ్యాఖ్యానించారు. ఇకనైనా రాష్ట్ర ప్రతిష్ఠను, గౌరవాన్ని మరింత పెంచే విధంగా వ్యవహరిస్తే మీకే కాదు రాష్ట్ర భవిష్యత్తుకు సైతం మంచిగా ఉంటుందని హితవు చెప్పారు.

తెలంగాణ అప్పులు - వాస్తవాలు

రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న లెక్కలు వాస్తవాలకు భిన్నంగా ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 23న విడుదల చేసిన శ్వేతపత్రంలో నాలుగు రకాల అప్పులు చూపించారని, ఇందులో రెండు రకాల అప్పులను ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేదని క్లియర్‌గా పేర్కొన్నారని గుర్తుచేశారు.

- ప్రభుత్వ శ్వేతపత్రంలోనే గవర్నమెంట్ హామీ లేనివి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ.59,414 కోట్లుగా, గవర్నమెంట్ హామీ ఉండి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ.95,462 కోట్లుగా పేర్కొన్నారు. అంటే మొత్తంగా గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేని అప్పులు రూ.1,54,876 కోట్లు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన రూ.6,71,757 కోట్ల అప్పుల నుంచి రూ.1,54,876 కోట్లను తీసేస్తే మిగిలిన అప్పు రూ.5,16,881 కోట్లు అని హరీశ్‌రావు వివరించారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన శ్వేతపత్రం ప్రకారం రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించింది. ప్రభుత్వం కట్టాల్సిన రూ.5,16,881 కోట్ల అప్పు నుంచి దీనిని తీసేస్తే రూ.4,44,223 కోట్ల అప్పు ఉంటుంది.
- తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీ (స్పెషల్ పర్పస్ వెహికల్స్) ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.11,609 కోట్లు. ఈ మొత్తాన్ని రూ.4,44,223 కోట్ల నుంచి తీసేస్తే రూ.4,32,614 కోట్లు మిగులుతుంది.
- ప్రభుత్వ శ్వేతపత్రంలో ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మార్చి 31, 2024 వరకు ఉన్న బడ్జెట్ ప్రతిపాదనలను తీసుకున్నారు. శ్వేతపత్రం డిసెంబర్‌లోనే విడుదల చేశారు. ఈ శ్వేతపత్రంలో తెలివిగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రూ.6,115 కోట్ల అప్పును బీఆర్ఎస్ ఖాతాలో జమ చేశారు. కాంగ్రెస్ తీసుకున్న రూ.6,115 కోట్లను రూ.4,32,614 నుంచి తీసివేస్తే రూ.4,26,499 కోట్ల అప్పు మిగులుతుంది. అంటే తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,26, 499 కోట్ల మాత్రమేనని, కానీ పదేపదే రూ.6,71,757 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఈ రూ.4.26 లక్షల కోట్లలో ఉదయ్ స్కీం కింద రూ.9 వేల కోట్లు, 2019-20లో 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో అప్పు రూపంగా రూ.2,459 కోట్లు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. కొవిడ్ సమయంలో గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలను ఆదుకోకుండా అప్పులు తీసుకునే స్థితికి కేంద్రం నెట్టిందని, అందువల్ల రూ.17,558 కోట్ల అప్పు చేయాల్సిన అనివార్యత ఏర్పడిందని వివరించారు.
- కొవిడ్ కారణంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీలో 1%అధికంగా అప్పు చేయాల్సి వచ్చిందని, ఆ మొత్తం రూ.10,784 కోట్లు అని వివరించారు. ఇలా రాష్ట్రం అనివార్యంగా రూ.41,159 కోట్ల అప్పు తీసుకోవాల్సిన పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు, కొవిడ్ కారణమయ్యాయని, ఇది ఏ ప్రభుత్వం ఉన్నా అనివార్యంగా చేయాల్సిన అప్పు అని తేల్చి చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాపాలనంతా అప్పుల కుప్ప

- కాంగ్రెస్ ప్రభుత్వ అప్పు రూ.71,495 కోట్లు
- రుణ లక్ష్యం దాటేసి ముందుకు పరుగులు
- 285 రోజుల్లో ఆర్బీఐ నుంచి రూ.46,618 కోట్లు
- కార్పొరేషన్లకు రూ.24,877 కోట్ల గ్యారెంటీలు
- ప్రతి తెలంగాణ బిడ్డపై రూ.17,873 అప్పు భారం



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పు ఎంతో తెలుసా? ఇప్పటికి రూ.71,495 కోట్లు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందంటూ విషప్రచారం చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో అడ్డగోలుగా అప్పులు చేస్తున్నది. నిరుడు డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంగళవారం వరకు 285 రోజుల్లో రూ.71,495 కోట్లు అప్పు చేసింది. అంటే ప్రతి రోజూ రాష్ట్ర ప్రజలపై రూ.250 కోట్ల అప్పుల భారం మోపింది. ఆగస్టు 13వ తేదీ వరకే ఒక్క ఆర్బీఐ నుంచి 42,118 కోట్ల రుణం సేకరించింది. ఈ నెల 3న రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు.. ఇలా వారం రోజుల్లోనే రూ.4,000 కోట్లు రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మంగళవారం మరోసారి రూ.500 కోట్లు అప్పు తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్బీఐ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారమే.. గత తొమ్మిది నెలల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ.46,618 కోట్ల మేర రుణాలు సేకరించింది. వివిధ కార్పొరేషన్లకు రూ.24,877 కోట్ల గ్యారంటీలు ఇచ్చింది. మొత్తంగా.. రాష్ట్రంలోని నాలుగు కోట్ల జనాభాలో ప్రతి ఒక్కరిపై గత తొమ్మిది నెలల్లోనే రూ.17,873 భారం పడింది.

నాలుగున్నర నెలల్లోనే.. సగం అప్పు

బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాది రూ.52,576 కోట్ల రుణం సమీకరించనున్నట్టు 2023-24 బడ్జెట్‌లో ప్రతిపాదించింది. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచుతున్నారంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఈ ఏడాది అప్పుల లక్ష్యాన్ని రూ.62,012 కోట్లకు పెంచింది. అంటే నిరుటి కన్నా దాదాపు రూ.10 వేల కోట్లు ఎక్కువ. ఇందులో బహిరంగ మార్కెట్ నుంచి రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి లెక్కించినా.. ఆగస్టు 13వ తేదీనాటికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.27వేల కోట్లు రుణాలు సమీకరించింది. అంటే ఏడాది లక్ష్యంలో దాదాపు సగాన్ని కేవలం నాలుగున్నర నెల్లలోనే చేరుకుంది. గ్యారెంటీలు కూడా కలుపుకొంటే ఈ ఏడాది లక్ష్యాన్ని దాటిపోయిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి అప్పులు ఏ స్థాయిలో పెరుగుతాయో చెప్పడం కష్టమని చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.71,495 కోట్లు అప్పు తెచ్చి ఏం చేసిందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు తెచ్చిన అప్పులను ఒక ప్రజోపయోగ ప్రాజెక్టు కోసమో, విప్లవాత్మక పథకం కోసమో ఖర్చు చేస్తాయని చెప్తున్నారు. మరి కాంగ్రెస్ ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో తెచ్చిన నిధులతో ఏ ప్రాజెక్టు చేపట్టిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేషన్లకు అడ్డగోలుగా గ్యారంటీలు

వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు ప్రభుత్వం అడ్డగోలుగా గ్యారంటీలు ఇస్తున్నది. అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిదిన్నర నెలల్లోనే రూ.25 వేల కోట్ల మేర గ్యారంటీలు ఇచ్చింది. ఈ అప్పులను కార్పొరేషన్లు రెండు విధాలుగా చెల్లించాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. మొదటిది.. పన్నులు, చార్జీల రూపంలో ప్రజల నుంచి వసూలు చేయడం, రెండోది.. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని చెల్లించడం. ఎలా చూసినా ప్రజలకే నష్టమని స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ గ్యారెంటీతో కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలు తీసుకున్న రుణాలు

కార్పొరేషన్	గ్యారెంటీ ఇచ్చిన సంస్థ	తీసుకున్న రుణం (రూ.కోట్లలో)	తేదీ	కారణం
ఎస్పీడీసీఎల్	ఆర్ఈసీ	1000	23.1.2024	విద్యుత్ కొనుగోలు, ఇతర అప్పులు
ఎన్పీడీసీఎల్	ఎస్‌బీఐ	1000	04.03.2024	విద్యుత్ కొనుగోలు, ఇతర అప్పులు
టీజీసీఎస్‌సీఎల్	పీఎన్‌బీ	1000	22.03.2024	ధాన్యం కొనుగోలు
టీజీటీఎస్‌సీఎల్	నాబార్డ్	3000	01.06.2024	ధాన్యం కొనుగోలు
హౌసింగ్ బోర్డ్	హడ్కో	3000	12.03.2024	ఇందిరమ్మ ఇండ్లు
టీయూఎఫ్ఐడీసీ	ఐఓబీ	1000	07.05.20	మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు
మార్క్‌ఫెడ్	ఎన్‌సీడీసీ	12000	18.04.2024	ధాన్యం కొనుగోలు
మార్క్‌ఫెడ్	బీవోఐ,పీఎన్‌బీ	327.92	08.05.2024	మక్కల కొనుగోలు
మార్క్‌ఫెడ్	పీఎన్‌బీ	65.34	08.05.2024	పొద్దు తిరుగుడు పంట కొనుగోలు
మార్క్‌ఫెడ్	పీఎన్‌బీ	400.74	05.06.2024	మక్కల కొనుగోలు
మార్క్‌ఫెడ్	ఎన్‌సీడీసీ	1733.71	02.07.2024	మక్కల కొనుగోలు
మార్క్‌ఫెడ్	ఐఓబీ	350	03.07.2024	ఎరువుల కొనుగోలు
మొత్తం		24,877.71		

బాండ్ల వేలం ద్వారా పొందిన నిధులు.. (ఆర్బీఐ నివేదిక ఆధారంగా..)

తేదీ	సేకరించిన మొత్తం (రూ.కోట్లలో)
డిసెంబర్ 12	500
డిసెంబర్ 19	900
జనవరి 16	2,000
జనవరి 23	1,000
ఫిబ్రవరి 6	2,000
ఫిబ్రవరి 13	1,000
మార్చి 5	2,000
మార్చి 12	2,000
మార్చి 19	2,000
మార్చి 26	1,718
ఏప్రిల్ 2	1,000
ఏప్రిల్ 8	1,500
ఏప్రిల్ 23	1,500
మే 7	3,000
మే 14	1,000
జూన్ 4	2,000
జూన్ 18	2,000
జూన్ 25	1,000
జూలై 2	2,000
జూలై 16	2,000
జూలై 23	3,000
జూలై 30	1,000
ఆగస్టు 6	3,000
ఆగస్టు 13	3,000
సెప్టెంబర్ 3	2,500
సెప్టెంబర్ 10	1,500
సెప్టెంబర్ 17	500
మొత్తం	46,618

ఆర్బీఐ నుంచి రోజూ 163 కోట్ల అప్పు

రిజర్వు బ్యాంకు నుంచి తొమ్మిది నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.46,618 కోట్లు తీసుకున్నది. అంటే ప్రతిరోజూ సగటున రూ.163 కోట్ల మేర కేంద్ర బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకుంటున్నది. గత ఏడాది డిసెంబర్ 12న రూ.500 కోట్లతో అప్పుల వేట మొదలు పెట్టి.. సగటున నెలకు రూ.5 వేల కోట్ల చొప్పున ఆర్బీఐ నుంచి రుణాలు సేకరించింది. ఇంకా సేకరిస్తూనే ఉన్నది.

రాజస్థాన్‌లో సింగరేణి సోలార్ ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): వ్యాపార విస్తరణ దిశలో భాగంగా రానున్న రోజుల్లో రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. సింగరేణి భవన్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న ఐదేండ్లల్లో రూ.60వేల కోట్ల టర్నోవర్‌ను సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. సింగరేణిలో మూసివేసిన ఉపరితల గనుల్లో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, ఎన్టీపీసీలో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు, ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్, మరో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్‌ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్ వంటి వినూత్న ప్రాజెక్ట్‌లతో సింగరేణి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్‌డీఎం సుబానీ, డీ రవిప్రసాద్ పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగ ఫలితాలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్‌లో 272 ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలకు జూలై 20, 21వ తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను scclmines.comలో అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

రైతులకు రేవంత్ బాకీ 25వేల కోట్లు!

- అన్నదాతలకు భారీ స్థాయిలో బకాయిపడ్డ సర్కారు
- ఇచ్చిన హామీల మేరకు రైతు భరోసా 11,475 కోట్లు
- 2 లక్షల రైతు రుణమాఫీకి రూ. 13వేల కోట్లు
- పంట నష్టపరిహారం రూ. 500 కోట్లు
- పంటకోతకొస్తున్నా అందని పెట్టుబడిసాయం



హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): 'ఒక్క సంవత్సరం మేం కడుపుకట్టుకుని పని చేస్తే.. రైతులకు చెల్లించాల్సిన 40 వేల కోట్ల రుణాలను ఎడుమ చేత్తో చెల్లిస్తాను..' ఇదీ ఓ సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే 9 నెలలు కావస్తున్నది. కానీ రైతులను బాకీలను మాత్రం తీర్చలేదు. ఇప్పటివరకు వివిధ హామీల ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు వంద కాదు రెండువందలు కాదు ఏకంగా రూ.25వేల కోట్లకు పైగా బాకీ పడింది. ఇందులో వానకాలం రైతు భరోసా పెట్టుబడి సాయం కింద రూ.11,475 కోట్లు, రైతు రుణమాఫీ కింద రూ.13 వేల కోట్లు, పంట నష్టపరిహారం కింద రూ.428 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉన్నది. ఈ బాకీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడు చెల్లిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

సీజన్ పూర్తయినా దక్కని భరోసా

ఓవైపు వానకాలం పంటల సాగు పూర్తయి. పంటలు కోతకు వచ్చే సమయం వచ్చినా ప్రభుత్వం రైతులకు పెట్టుబడిసాయం అందించలేదు. కేసీఆర్ ప్రభుత్వం పంట సాగు సమయానికి పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో టంచనుగా జమ చేసేది. గత వానకాలం పెట్టుబడి సాయాన్ని జూన్ 26న మొదలుపెట్టి ఆగస్టు 23నాటికి పూర్తి చేసింది. 70లక్షల మంది రైతులకు చెందిన 1.53కోట్ల ఎకరాలకు రూ.7624 కోట్లు పంపిణీ చేసింది. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీజన్‌కు ఎకరానికి రూ.7500 చొప్పున పెట్టుబడిసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు పెంచిన పెట్టుబడి సాయాన్ని రైతులకు ఇవ్వలేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ. 7500 చొప్పున 1.53కోట్ల ఎకరాలకు రూ.11,475 కోట్లు పెట్టుబడి సాయంగా పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు నయాపైసా ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పంటనష్ట పరిహారమేదీ ?

రైతు భరోసాను ఎగ్గొట్టి అరకొర రుణమాఫీ చేసిన సర్కారు కనీసం పంట నష్టపరిహారం ఇచ్చినా రైతులను ఆదుకుంటుందని ఆశిస్తే నిరాశే ఎదురైంది. కుండపోత వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా సమాచారం. ప్రభుత్వం మాత్రం ప్రాథమిక అంచనా ప్రకారం 4.25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా గుర్తించింది. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 10వేల పరిహారం ప్రకటించింది. పుట్టెడు కష్టాల్లో ఉన్న రైతులకు తక్షణ సాయం అందించి ఆదుకోవాల్సిన సర్కారు పంటల సర్వే పేరుతో కాలయాపన చేస్తుందని రైతులు విమర్శిస్తున్నారు. ఈ వానకాలం పంటలే కాకుండా యాసంగిలో అంటే ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు సుమారు 4వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆ పంటలకు కూడా పంటనష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ లెక్కన ఎకరాకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం పరిహారం అందిస్తే రైతులకు రూ. 500 కోట్ల బాకీ పడింది.

ఉరికొయ్యపై రైతన్న..!

రుణమాఫీ చేయకపోవడంతో మేడ్చల్‌లో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు చేసి పంటలు వేసిన రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. కానీ కాంగ్రెస్ సర్కారు మాటలు మాత్రమే చెప్పి చేతులెత్తేసింది. దీంతో రైతుకు భరోసా రాక, రుణమాఫీలేక.. పంటనష్టపరిహారం అందక పుట్టెడు కష్టాల్లో ఉన్నాడు.

అరకొరగానే రుణమాఫీ

ఎన్నికల సమయంలో ఒకే దఫాలో రైతులకు రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక మూడు దఫాల్లో అరకొరగానే మాఫీ చేశారు. రుణమాఫీ కింద రైతులకు రూ.31వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.18వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి చేతులు దులిపేసుకున్నది. ఇంకా రూ.13 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. ఈ మొత్తం ప్రభుత్వం రైతులకు బాకీ పడినట్టే. ప్రభుత్వం రుణమాఫీ పూర్తి చేయకపోవడంతో రైతులకు కొత్త రుణాలు అందడంలేదు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.18వేల కోట్లు మాఫీ చేస్తే.. బ్యాంకులు ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు మాత్రమే తిరిగి రుణాలు ఇచ్చినట్టు మంత్రులే స్వయంగా వెల్లడించారు. ఇటు ప్రభుత్వం, అటు బ్యాంకులు రైతుల రుణాలపై దృష్టి పెట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎన్నిసార్లైనా ఢిల్లీ వెళ్తా

- మనకు రావాల్సిన నిధుల కోసమే వెళ్తున్నా
- ప్రజల ఆకాంక్ష మేరకే ప్రజాపాలన దినోత్సవం
- 'ప్రజాపాలన' వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసా తెచ్చుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో భేషజాలకు పోకుండా తానే స్వయంగా పలుమార్లు ఢిల్లీ వెళ్లానని తెలిపారు. దీనిపైనా కొందరు విమర్శలు చేస్తున్నారని, హక్కుల సాధన కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళ్తానని చెప్పారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష, ఆలోచన మేరకే సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ అంటేనే త్యాగమని, ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. సాయుధ పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన వారందరికీ ఘన నివాళి అర్పించారు. సెప్టెంబర్ 17ను కొందరు విలీన దినోత్సవమని, కొందరు విమోచన దినోత్సవమని సంబోధిస్తున్నారని.. తాము ప్రజా కోణాన్ని జోడిస్తూ 'ప్రజా పాలన దినోత్సవం'గా నామకరణం చేశామని చెప్పారు.

తెలంగాణ పునరుజ్జీవనం దిశగా..

తెలంగాణ పునరుజ్జీవనం దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని సీఎం రేవంత్ చెప్పారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరపబోతున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై 'ఫ్యూచర్ స్టేట్'గా బ్రాండ్ చేస్తున్నామని, పెట్టుబడుల ఆకర్షణలో ఇదొక వ్యూహాత్మక ప్రయత్నమని చెప్పారు. ఒకప్పుడు లేక్ సిటీగా పేరుపొందిన హైదరాబాద్ ఫ్లడ్స్ సిటీగా దిగజారిందని, దాని ప్రక్షాళన కోసమే హైడ్రా ఏర్పాటు చేశామని తెలిపారు. హైడ్రా వెనుక రాజకీయ కోణం, స్వార్థం లేవన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా ఆగదని స్పష్టం చేశారు. ఈ ఏడాది 4.50 లక్షల ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. సీఎస్ శాంతికుమారి, మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆలోచన మేరకే 'ప్రజాపాలనా'?

- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై విస్మయం
- ఢిల్లీ పర్యటనలను సమర్థించుకోవడంపైనా మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): నాలుగు కోట్ల ప్రజల ఆలోచన మేరకే సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతున్నది. నాంపల్లిలో జరిగిన ప్రజాపాలన వేడుకల్లో సీఎం మాట్లాడుతూ.. అధికారికంగా మొదటిసారి వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అయితే నిజాం సంస్థానం భారత ప్రభుత్వంలో కలిసి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం 'జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు' పేరుతో ఏడాది పాటు నిర్వహించలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ఆ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నదని గుర్తుచేశారు. కాబట్టి మొదటిసారి అధికారికంగా చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదం అవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ప్రజల ఆకాంక్ష, ఆలోచనమేరకే ప్రజాపాలన అనే పేరు పెట్టామని చెప్పడంపైనా ఎద్దేవా చేస్తున్నారు. ఫలానా పేరు పెడతామని నాలుగు కోట్ల మంది ప్రజల నుంచి ఎప్పుడు అభిప్రాయ సేకరణ చేశారని ప్రశ్నిస్తున్నారు. కనీసం మంత్రివర్గంలో కూడా చర్చించకుండా.. ప్రజలకు ముందుగా తెలిసేలా ఒక ప్రకటన కూడా చేయకుండా ఇష్టం వచ్చినట్టు పేరు పెట్టుకొని, మళ్లీ ప్రజలపై రుద్దుతారా? అంటూ మండిపడుతున్నారు. పథకాల అమలుకు ఆమోదం కోసం, పీసీసీ అధ్యక్ష పదవి కోసం, మంత్రివర్గ విస్తరణ కోసం.. ఇలా ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ హక్కుల పేరు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తూతూమంత్రంగా కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినంత మాత్రాన రాజకీయ పర్యటనలు అధికారిక పర్యటనలుగా మారవని స్పష్టం చేస్తున్నారు.



జటప్రోల్‌లో మంత్రి జూపల్లికి సమస్య విన్నవిస్తున్న దళితులను అడ్డుకుంటున్న సెక్యూరిటీ

దళితులపై మంత్రి జూపల్లి చిర్రుబుర్రు

- నోరుమూయండి అంటూ ఆగ్రహం

పెంట్లవెల్లి, సెప్టెంబర్ 17: ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దళితులపై చిర్రుబుర్రుమన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోల్ గ్రామంలోని సమీకృత గురుకుల పాఠశాల భవనం కోసం దళితుల భూమిని ఎంచుకున్నారు. మంగళవారం సదరు స్థలాన్ని పరిశీలించేందుకు మంత్రి రాగా, సర్వే నంబర్ 508లో ఎనిమిది ఎకరాల భూమిని నాటి జటప్రోల్ సంస్థానాధీశులు రాజాజగన్నాథరావు తమకు ఇచ్చారని దళితులు కిష్టన్న, పెంటయ్య, బాలయ్య, బాలపీరు, సంగమయ్య, శేషమ్మ, శాలయ్య, బాలయ్య తెలిపారు. దీంతో మంత్రి.. నోరు మూయండని బాధితులను బెదిరించారు. సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. న్యాయం కోసం వస్తే పట్టించుకోలేదని దళితులు ఆవేదన వ్యక్తంచేశారు.

మంత్రి సీతక్క కాన్వాయ్ అడ్డగింత

- సాగు నీరివ్వాలని గిరిజన రైతుల డిమాండ్

వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 17: సాగు నీరివ్వాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లాలో గిరిజన రైతులు మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డగించారు. మంగళవారం ఆమె వెంకటాపురం (నూగూరు) మండలంలో పర్యటనను ముగించుకొని వెళ్తున్న క్రమంలో ఆరుగుంటపల్లి గ్రామంలో గిరిజన రైతులు ఆమె కాన్వాయిని అడ్డగించారు. కారు దిగి వచ్చిన ఆమె రైతులతో మాట్లాడారు. పాలెంవాగు ప్రాజెక్టు నీళ్లు బర్లగూడెం పరిధిలోని తమకు అందడం లేదని, ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు సాగు నీరు అందకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చెర్లకాలనీ, ఆరుగుంటపల్లి మధ్య ప్రధాన రహదారిపై బ్రిడ్జి కట్టకపోవడంతో సాగు నీరు అందడం లేదని వారు తెలిపారు. బ్రిడ్జి మంజూరైనా పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారని వారు పేర్కొన్నారు. వానకాలంలో కురిసిన వర్షాలకు ప్రధాన కాల్వకు అనేక చోట్ల గండ్లు పడ్డాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఎలాంటి ఆందోళన చెందవద్దని, సాగునీళ్లు సకాలంలో అందేలా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు.



ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం ఆరుగుంటపల్లి వద్ద గిరిజన రైతులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తెలంగాణ ఈసీగా రాణికుముదిని

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని రాణికుముదినిని ప్రభుత్వం నియమించింది. ఆమె బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేండ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఇప్పటివరకు కమిషనర్‌గా ఉన్న పార్థసారథి పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో రాణికుముదినిని ప్రభుత్వం నియమించింది. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణికుముదిని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కార్మికశాఖలో పనిచేసి గతేడాది జూన్‌లో పదవీవిరమణ చేశారు. ఆమె గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గానే కాకుండా వివిధ శాఖల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర వ్యవసాయ శాఖలోనూ ఆమె పనిచేశారు.

'విజిలెన్స్' కమిషనర్‌గా గోపాల్ బాధ్యతలు



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్ బుధవారం కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గోపాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పంపిన ఉత్తర్వులు జారీచేసింది. గవర్నర్ నుంచి ఆమోదం లభించగానే రాష్ట్ర సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో మొదట 17.09.2022 అని తప్పుడు తేదీతో ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తప్పును సవరిస్తూ మరో కాపీని విడుదల చేసింది. ఈమేరకు గోపాల్ విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

కొత్తగా తొమ్మిది ఇంజినీరింగ్ కాలేజీలు

- ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అప్‌గ్రేడ్‌కు కసరత్తు
- వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే ఒక కాలేజీ ఏర్పాటు కాగా, కొత్తగా మరో 9 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇవి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు కాగా, వీటిని ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్‌చేస్తారు. వీటిల్లో పాలిటెక్నిక్ కోర్సులతో పాటు ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహిస్తారు. మాసాబ్‌ట్యాంక్, రామంతాపూర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కొత్తగూడెం, సికింద్రాబాద్(మారేడ్‌పల్లి), కులీకుతుబ్‌షా పాలిటెక్నిక్ ఓల్డ్‌సిటీ కాలేజీలను ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్‌చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో విద్యారంగ సంస్కరణలపై చర్చ జరిగింది. ఆయా కాలేజీల ఏర్పాటును వేగవంతం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. సమావేశాల అనంతరం ఫైలును సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలనకు పంపిస్తారు. ఈ తొమ్మిది ఇంజినీరింగ్ కాలేజీలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్నాయి.

కొత్తగా రెండు ఆర్జీయూకేటీలు

ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో ఏర్పాటుకు యత్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా మరో రెండు ఆర్జీయూకేటీలు ఏర్పాటుకానున్నాయి. వీటిని ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. విద్యాశాఖ అధికారులు విద్యాసంస్కరణ క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదనలు ఉంచారు. వెయ్యి సీట్లతో ఒక్కో కాలేజీని ప్రారంభించేందుకు అనుమతించాలని నివేదించారు. రాష్ట్రంలో ప్రస్తుతం బాసరలో ఆర్జీయూకేటీని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో మూడు ఆర్జీయూకేటీలుండగా, రాష్ట్ర విభజనతో రెండు ఏపీకి వెళ్లడంతో ఉన్న ఒక్క ఆర్జేయూకేటీపై అధిక ఒత్తిడిపడుతున్నది. సీట్ల కోసం తీవ్రమైన డిమాండ్ ఉంటుంది. దీంతో కొత్తగా రెండు ఆర్జీయూకేటీలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే ఉత్తర తెలంగాణలో ఈ ఆర్జీయూకేటీ ఉండగా, దక్షిణంలో మహబూబ్‌నగర్, తూర్పున ఖమ్మంలో కొత్తగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ ఆర్జీయూకేటీలు బాసర ఆర్జీయూకేటీ కిందే నడుస్తాయి. ఆ వైస్‌చాన్స్‌లరే ఈ రెండింటిని పర్యవేక్షిస్తారు. ఒక్కో ఆర్జీయూకేటీ నిర్మాణానికి రూ.400కోట్లు అవసరమవుతాయని, ఏడాదికి రూ.100కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని అధికారులు ప్రతిపాదించారు. వీటిలోనూ ఆరేండ్ల బీటెక్ కోర్సులను నిర్వహించనుండగా, 10 జీపీఏ ఆధారంగా సీట్లను భర్తీచేస్తారు.

చాక్‌పీసులకూ డబ్బుల్లేవ్!

- రాష్ట్రంలో గాడి తప్పిన పాఠశాలల నిర్వహణ
- మూడు నెలలైనా విడుదల కాని నిధులు
- హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి
- పారిశుద్ధ్య కార్మికులకూ జీతాలు ఇవ్వలేక అవస్థలు



మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులైన్ ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 17: 'చాక్‌పీసులు, డస్టర్లు కొనలేకపోతున్నాం.. పిల్లలకు అవసరమైన చార్టులు, పుస్తకాలు తెద్దామంటే డబ్బులు లేవు.. సమావేశాలకు వచ్చే టీచర్లకు టీ, స్నాక్స్ ఇవ్వలేకపోతున్నాం.. మొత్తంగా పాఠశాలల నిర్వహణ ఇబ్బందిగా మారింది..' అంటూ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలకు రావాల్సిన గ్రాంట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడమే ఇందుకు కారణం. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా గ్రాంట్లు విడుదల కాలేదు.

- ప్రభుత్వం ఆయా పాఠశాలల నిర్వహణకు ఏడాదికి రెండుసార్లు నిధులు మంజూరు చేస్తుంది. దీంతో సౌకర్యాలు కల్పించేందుకు పెద్దగా ఇబ్బంది ఉండదు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా.. పాఠశాలలకు ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి, సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 3,215 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మూడు లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో చాక్‌పీసులు మొదలుకొని హాజరు రిజిస్టర్లు, ఏ-4 సైజు పేపర్లు, చీపుర్లు, మరుగుదొడ్ల క్లీనింగ్ రసాయనాలు, విరిగిపోయిన వస్తువుల స్థానంలో కొత్తవి కొనడం, ప్లాస్టిక్ బకెట్లు, సబ్బులు ఇతర అవసరమైన సామగ్రి, ప్రయోగశాల రసాయనాలను పాఠశాల గ్రాంట్ నుంచి కొనుగోలు చేయాలి.

క్రీడా పరికరాలకు నిధుల్లేవు

ఇటీవల పీఈటీలకు పీడీలుగా పదోన్నతి కల్పించారు. విద్యార్థులకు పలు పాఠశాలల్లో క్రీడా పరికరాలు లేవు. క్రీడల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారు. ఈసారి నిధులు మంజూరు చేస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు విడుతల్లో మంజూరు కావాల్సిన నిధులు (రూపాయిల్లో)..

విద్యార్థుల సంఖ్య	మొత్తం
1 నుంచి 30 మంది	10,000
31 నుంచి 100	25,000
101 నుంచి 250	50,000
251 నుంచి 1000	75,000
1000కి పైన ఉంటే	1,00,000

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	859	72,124
నాగర్‌కర్నూల్	825	69,517
వనపర్తి	536	47,806
నారాయణపేట	512	59,870
జోగుళాంబ-గద్వాల	483	52,509

సొంతంగా ఖర్చు చేస్తున్నాం



పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలైనా నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. దీంతో పాఠశాలలో రోజూవారి నిర్వహణ ఖర్చులు, సుద్దముక్కలు, స్టేషనరీ, ఇతరత్రా ఖర్చులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

- అబ్దుల్‌హక్, తెలంగాణ రాష్ట్ర జీహెచ్‌ఎం సంఘం మహబూబ్‌నగర్ ప్రధాన కార్యదర్శి

చాలా ఇబ్బందికరంగా ఉంది



పాఠశాలల నిర్వహణ నిధులు లేవు. పాఠశాలల్లో పరిశుభ్రత పనులు చేసే వారికి సైతం చెల్లించేందుకు నిధులు లేవు. అమ్మా డబ్బులు ఇస్తారా? ఎప్పుడిస్తారు? అని స్కావెంజర్లు అడుగుతున్నారు. వారికి ఏమీ చెప్పలేకపోతున్నాం.

- పీఆర్ మాలినీదేవి, జీహెచ్‌ఎం, కరివెన, భూత్పూరు మండలం, మహబూబ్‌నగర్

క్రీడలపై నిర్లక్ష్యం



పాఠశాలలు తెరిచిన వెంబడే పుస్తకాలు, యూనిఫాంలు ఇస్తారు. క్రీడా సామగ్రి మాత్రం ఇవ్వరు. ఈ రోజు స్కూల్‌గేమ్స్ ప్రారంభం అయ్యాయి. పాఠశాలల ప్రారంభం రోజునే క్రీడాసామగ్రి ఇవ్వడంతోపాటు క్రీడల నిర్వహణకు నిధులు కేటాయించాలి.

- వడ్డెన్న, పీఈటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

త్వరలోనే నిధులు విడుదల

పాఠశాలల నిర్వహణకు అవసరమైన నిధులు త్వరలో విడుదల కానున్నాయి. హెచ్‌ఎంలు తాము పెట్టిన ఖర్చు వివరాల దస్త్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. నిధులు వచ్చిన తర్వాత వాటినుంచి ఖర్చుల లెక్కలు సరిచూసుకుని మిగిలిన డబ్బులు నిర్వహణ నిధుల కింద వాడుకోవాలని సూచించాం.

- రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్



మహబూబాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆటో ట్రాలీలో కుక్కి విద్యార్థుల తరలింపు

బడి పిల్లలా.. కోడిపిల్లలా?

- విద్యార్థులను తరలించేది ఇలాగేనా?
- పశువుల్లాగా డీసీఎం, ఆటో ట్రాలీల్లో తరలింపు
- మండిపడుతున్న ప్రజలు, విద్యార్థి సంఘాలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 17: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం అధికారిక కార్యక్రమానికి స్కూల్ పిల్లలను వాహనాల్లో కోడిపిల్లల్లా కుక్కి తరలించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ జాతీయ జెండా ఆవిష్కరణకు ప్రజలు, రైతులు రాకపోవడంతో విద్యార్థులను డీసీఎం వాహనం, ఆటోల్లో తరలించిన తీరు చర్చనీయాంశమైంది. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ రామచంద్రూ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధికారులు మినహా ప్రజలు, రైతులు హాజరుకాలేదు. ఎక్కువ సంఖ్యలో జనం ఉండాలని భావించిన అధికారులు విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పశువుల్లాగా డీసీఎం వాహనంలో తరలించారు. మీడియా వారు చూసి ఫొటోలు తీసే ప్రయత్నం చేయడంతో డీసీఎం వాహనాన్ని మధ్యలో ఆపి ప్యాసింజర్ ఆటోలు, ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. డీసీఎం, ఆటో ట్రాలీలో తరలించడాన్ని రోడ్డు వెంట చూసిన పలువురు విద్యార్థుల జీవితాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని, వారికి ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని చర్చించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పశువుల్లా డీసీఎం వాహనంలో తరలించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సూర్యప్రకాశ్, కేలోత్ సాయి ఖండించారు.



మహబూబాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి జనం లేకపోవడంతో డీసీఎంలో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో 990 సీట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): లా పీజీ కోర్సు అయిన ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ఈ ఏడాది 990 సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. ఆయా సీట్ల భర్తీ షెడ్యూల్‌లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. ఎల్‌ఎల్‌బీ బ్యాక్‌లాగ్ ఫలితాలు ఇటీవలే విడుదల కావడంతో అభ్యర్థుల కోరిక మేరకు షెడ్యూల్‌ను సవరించారు. 24 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశముండగా, ఇప్పటి వరకు 2వేల మంది చేసుకున్నారు. 25న అర్హుల జాబితాను ప్రదర్శిస్తారు. 26, 27న వెబ్ ఆప్షన్లు, 28న సవరణ, 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందినవారు అక్టోబర్ 1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని, ఫీజు చెల్లించి రిపోర్ట్‌చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు.

టాపర్ల చూపు.. బాంబే ఐఐటీ వైపు

ఆ తర్వాత ఢిల్లీ, మద్రాస్ ఐఐటీలు • ఆ మూడింటివైపే ప్రతిభావంతుల చూపు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌లో సత్తాచాటిన టాపర్లు మొదటి జనరేషన్ ఐఐటీల్లోనే చేరుతున్నారు. ఐఐటీ బాంబేనే తమ మొదటి ఛాయిస్‌గా ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత ఐఐటీ ఢిల్లీ, మద్రాస్‌ను ఎంచుకుంటున్నారు. సీట్లు రాని వారు మాత్రమే రెండోతరం ఐఐటీల్లో చేరుతున్నారు. ఇదే విషయం జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 జాయింట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ రిపోర్ట్‌లో వెల్లడైంది. ఇటీవలే ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది ఐఐటీల్లో 17,695 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అత్యధికంగా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 1,915 మంది చేరగా, ఆ తర్వాత ఐఐటీ వారణాసిలో 1,572, ఐఐటీ బాంబేలో 1,371, ఐఐటీ రూర్కీలో 1,351 మంది చొప్పున ప్రవేశాలు పొందారు. ఐఐటీ హైదరాబాద్‌లో 595 సీట్లుండగా, 597 మంది చేరారు.



ఓపీ విభాగానికి తాళం వేడయంతో లోపల చిక్కుకుపోయిన రోగులకు అభివాదం చేస్తున్న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ

ఇది జైలు కాదు దవాఖాన!

- వరంగల్ ఎంజీఎంలో రోగులు ఉండగానే ఓపీ విభాగం గేట్లకు పోలీసుల తాళం
- అభివాదం చేసుకుంటూ వెళ్లిన మంత్రులు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 17: నూతన యంత్రాన్ని ప్రారంభించడానికి ఇద్దరు మంత్రులు ఎంజీఎం దవాఖానకు రావడంతో ఓపీ విభాగంలో రోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మంగళవారం ఎంజీఎం బ్లడ్ బ్యాంకులో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ) యంత్రాన్ని ప్రారంభించడానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండాసురేఖ దవాఖానకు చేరుకున్నారు. మంత్రులకు రోగులు ఎదురుపడకుండా ఉండాలని భావించిన పోలీసులు... వారిని ఓపీ విభాగానికి ఉన్న నాలుగు ద్వారాల్లో మూడింటికి తాళాలు వేశారు. ఓపీ సేవల కోసం వచ్చి పరీక్షలు నిర్వహించుకున్న రోగులు తిరిగి బయటకు వెళ్లడానికి వీలు లేకుండా అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. దీనికితోడు ఓపీ విభాగంలో మందులు అందించే నాలుగు కౌంటర్లను సైతం మూసివేసి ఓపీ విభాగంలోనే తాత్కాలికంగా ఏర్పాటు చేయడంతో మందులు తీసుకోవడానికి, తిరిగి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు, నడవలేని వారు చేసేదేమీ లేక అక్కడే వేచి ఉండాల్సి వచ్చింది. ఇదిలావుండగా తాళాలు వేయడంతో గేటు లోపలే ఉన్న రోగులకు మంత్రులు అభివాదం చేసుకుంటూ వెళ్లడం కొసమెరుపు.

ఇద్దరు బాలికలపై లైంగికదాడులు

మేడిపల్లి, ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఘటనలు

పీర్జాదిగూడ/రామచంద్రాపురం, సెప్టెంబర్ 17: రెండు వేర్వేరు చోట్ల ఇద్దరు బాలికలపై లైంగిక దాడులు జరిగాయి. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలో మంగళవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ మైనర్ బాలిక స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతూ బంధువుల వద్ద ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన కేశవరెడ్డి అనే యువకుడు వారి ఇంట్లోకి దూరి గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్టు సదరు బాలిక తమ బంధువులకు తెలిపింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సదరు యువకుడు పరారీలో ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

ఆర్సీపురం పరిధిలో..

సంగారెడ్డి జిల్లా ఆర్సీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉండే 17 ఏండ్ల బాలుడు ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఏడేండ్ల బాలిక ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆర్సీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శశికాంత్‌రెడ్డి బాలుడిని అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల అన్నం మాకొద్దు

- కుక్కల కన్నా హీనంగా చూస్తున్నరు
- హాలియా బీసీ గురుకులం విద్యార్థినుల ఆందోళన



హాలియాలో ఆందోళనకు దిగిన బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు

హాలియా, సెప్టెంబర్ 17: సరైన భోజనం అందడంలేదని, చదువు సరిగా చెప్పడంలేదని, పట్టించుకునే వారులేరని, తమను కుక్కల కన్నా హీనంగా చూస్తున్నారంటూ నల్లగొండ జిల్లా హాలియాలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. 'పురుగుల అన్నం మాకొద్దు.. ఈ ప్రిన్సిపాల్, చదువు చెప్పరాని టీచర్లు వద్దు' అంటూ మంగళవారం మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి మంజూరైన బీసీ గురుకుల పాఠశాలను అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో హాలియాలోని నిర్మల ఉన్నత పాఠశాల భవనంలో ఏర్పాటుచేశారు. మూడేండ్ల నుంచి ఇక్కడే నిర్వహిస్తున్నారు. నిరుటి వరకు చదువు బాగానే ఉంది. భోజనం కూడా మెనూ ప్రకారం అందేది. పదో తరగతిలో మంచి రిజల్ట్ కూడా వచ్చాయి. కాగా, గత నెలలో ప్రభుత్వం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. ఇక్కడి ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో క్రాంతి వచ్చారు. అప్పటి నుంచి మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, భోజనం, టిఫిన్‌లో పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు సక్రమంగా బోధించడం లేదని ఆందోళనకు దిగారు. తాము చెప్పిన ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని, అన్నింటికీ అడ్జెస్ట్ కావాలని టీచర్లు చెబుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మూకుమ్మడిగా టీసీలు తీసుకుని పాఠశాల విడిచి వెళ్లిపోతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, వంట మాస్టర్ మారడం వల్ల భోజనంలో పురుగులు వస్తున్నాయని, సమస్యను పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ క్రాంతి చెప్పుకొచ్చారు.

అన్నంలో పురుగులు వస్తున్నాయి



కొత్త ప్రిన్సిపాల్ వచ్చిన దగ్గరి నుంచి స్కూల్‌లో సమస్యలు మొదలయ్యాయి. స్టూడెంట్స్ చెప్పిన ఏ సమస్యనూ పట్టించుకోవడం లేదు. చదువు బాగాలేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని చాలా మంది విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారు.

-దుర్గ, ఇంటర్మీడియట్ విద్యార్థిని


పాఠాలు అర్థమవడం లేదు



మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. అన్నంలో పురుగులు వస్తున్నాయి. సమస్యలను టీచర్ల దృష్టికి తీసుకెళ్తే సర్దుకుపోవాలంటున్నారు. సబ్జెక్టులు కూడా బాగా చెప్పడం లేదు. పాఠాలు అర్థమవడం లేదు. మమ్ముల్ని ఇక్కడ కుక్కల కంటే హీనంగా చూస్తున్నారు.

-సుప్రజ, పదో తరగతి విద్యార్థిని

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో మెనూ ప్రకారం భోజనం, చక్కటి విద్యాబోధన అందేది. ప్రస్తుతం రాష్ట్రంలో గురుకులాల నిర్వహణ అధ్వానంగా మారింది. గురుకుల పాఠశాలలను బాగా నడిపిస్తే కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నది. పేద విద్యార్థుల చదువుపై కక్ష గట్టడం దుర్మార్గం. హాలియా బీసీ గురుకుల పాఠశాలలో సమస్యలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి.

-నోముల భగత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

లీటరు పల్లీ నూనె 170!

పామాయిల్ లీటరుపై రూ.15-20 పెంపు • పెరిగిన వంటనూనెల ధరలు • దిగుమతి సుంకాన్ని పెంచడమే కారణం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం పండుగల వేళ ప్రజలకు భారీ షాక్ ఇచ్చింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు పెంచేసింది. దీంతో సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్‌పై ఇంపోర్ట్ టాక్స్ 12.5 శాతం నుంచి 32.5 శాతానికి చేరింది. దేశంలో నూనె గింజల ధరలు క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఇంపోర్ట్ టాక్స్ పెంపుతో వంట నూనెల ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. మొత్తంగా ముడి నూనెలపై సుంకం 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, రిఫైన్డ్ నూనెలపై సుంకం 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెరిగింది.

> ఈ సారి దసరా, దీపావళికి బూరలు, గారెలు చేసుకోవడం కష్టంగానేకనిపిస్తున్నది. కిలో వంటనూనె ధర రూ.15 నుంచి రూ.20వరకు పెరిగింది. ఇప్పటికే ఓ వైపు కూరగాయల ధరలు మండిపోతుండటం.. మరోవైపు వంటనూనెల ధరలు భగ్గుమంటుండటంతో సామాన్యుడు లబోదిబోమంటున్నాడు.

అన్ని నూనెలూ భారమే

కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసారిగా రూ.15-20 వరకు పెరిగాయి. పామాయిల్ ధర రూ.100 నుంచి రూ.115-120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి రూ.130-140, వేరుశనగ నూనె రూ.155 నుంచి రూ.165-170కు చేరింది. పూజలకు ఉపయోగించే నూనెలనూ రూ.110 నుంచి రూ.120-125కి పెంచి అమ్ముతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారు. స్టాక్ లేదంటూ బోర్డులు పెట్టి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మరికొందరు పాత స్టాక్‌ను కూడా అధిక ధరలకు అమ్ముతున్నారు. కేవలం రెండు రోజుల్లోనే లీటరు నూనె ధర రూ.20 పెరుగడంతో వినియోగదారుడు నోరెళ్లబెడుతున్నాడు. ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.



రకం	గత ధర	ఇప్పుడు
పామాయిల్	రూ.100	రూ.115-120
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ.115	రూ.130-140
వేరుశనగ నూనె	రూ.155	రూ.165-170
పూజలకువాడే నూనె	రూ.110	రూ.120-125

గత నెలలో 16 శాతం తగ్గిన దిగుమతులు: ఎస్‌ఈఏ

దేశంలో 2023 ఆగస్టుతో పోలిస్తే గత నెలలో వంట నూనె దిగుమతులు 16 శాతం తగ్గినట్టు సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఈఏ) నివేదిక వెల్లడించింది. నిరుడు ఆగస్టులో 18.66 లక్షల టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకుంటే.. గతనెలలో 15.63 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్టు తెలిపింది. దిగుమతుల తగ్గుదల ఉన్నప్పటికీ 2023-24లో భారత్ వంట నూనె దిగుమతులు 160 నుంచి 165 లక్షల మెట్రిక్ టన్నుల మధ్య ఉంటాయని ఎస్‌ఈఏ అంచనా వేస్తున్నది. ఇది గత ఏడాది సంఖ్యలకు దగ్గరగా ఉన్నది.

లెబనాన్‌లో పేజర్ల పేలుళ్లు

9 మంది హెజ్బొల్లా ఉగ్రవాదుల మృతి

- 3,000 మందికిపైగా తీవ్రగాయాలు
- సిరియాలోనూ కొన్ని చోట్ల పేలుళ్లు
- ఇజ్రాయెల్ పనేనని అనుమానాలు
- ప్రతీకారం తప్పదని హెజ్బొల్లా హెచ్చరిక

న్యూఢిల్లీ: లెబనాన్, సిరియాల్లో కమ్యూనికేషన్ కోసం ఉపయోగించే పేజర్లు వందలాదిగా పేలిపోవడం కలకలం రేపింది. మంగళవారం దాదాపు ఒకే సమయంలో అనేక చోట్ల జరిగిన ఈ సంఘటనల్లో హెజ్బొల్లా ఉగ్రవాదులు, మెడిక్స్ 9 మంది మరణించారు. దాదాపు 3,000 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో లెబనాన్ పార్లమెంటులో హెజ్బొల్లా సభ్యుని కుమారుడు, మరో ఉగ్రవాది కుమార్తె (10) కూడా ఉన్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇంత పెద్ద ఎత్తున జరిగిన భద్రతా ఉల్లంఘన ఇదేనని హెజ్బొల్లా వర్గాలు చెప్తున్నాయి. ఈ పేలుళ్లకు కారణాలను గుర్తించేందుకు విస్తృత స్థాయిలో భద్రత, శాస్త్రీయ దర్యాప్తు జరుగుతున్నట్టు హెజ్బొల్లా ఒక ప్రకటనలో తెలిపింది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఉపయోగించి, వ్యక్తులు కమ్యూనికేషన్ కోసం ఉపయోగించే పేజర్లను పేల్చేశారని పేర్కొన్నది. ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపిన వివరాల ప్రకారం, లెబనాన్‌లోని ఇరాన్ రాయబారి మొజ్తబ అమని ఉపయోగించే పేజర్ కూడా పేలడంతో ఆయన స్వల్పంగా గాయపడినట్లు తెలుస్తున్నది.

సిరియాలోనూ..

లెబనాన్ రాజధాని బీరుట్ శివారు ప్రాంతాల్లో పేజర్ల పేలుళ్లలో వందలాది మంది గాయపడ్డారు. వీరిని వేర్వేరు దవాఖానల్లో చేర్పించారు. దక్షిణ లెబనాన్‌లో కూడా పేజర్లు పేలాయని, అనేక మంది గాయపడ్డారని వార్తా సంస్థలు చెప్తున్నాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఇజ్రాయెల్ రిమోట్ దాడికి పాల్పడిందని లెబనాన్ అధికారులు ఆరోపించారు. సిరియాలో కూడా కొన్ని చోట్ల పేజర్లు పేలి, కొందరు గాయపడినట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది.

గంటపాటు కొనసాగిన పేలుళ్లు


లెబనాన్ స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రారంభమైన ఈ పేజర్ల పేలుళ్లు వరుసగా ఓ గంట సేపు కొనసాగాయి. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఈ సంఘటనలు జరిగాయి. 50కిపైగా అంబులెన్స్‌లను, 300 మంది ఎమర్జెన్సీ మెడికల్ స్టాఫ్‌ను రంగంలోకి దించినట్లు లెబనీస్ రెడ్ క్రాస్ తెలిపింది. ఇటీవలి షిప్‌మెంట్‌లో వచ్చిన కొత్త పేజర్లను విసిరికొట్టాలని హెజ్బొల్లా తన సభ్యులను మంగళవారం ఆదేశించింది. మునుపెన్నడూ లేనివిధంగా శత్రువు అనేక ప్రాంతాల్లో భద్రత ఉల్లంఘనకు పాల్పడినట్లు తెలిపింది.

స్పందించని ఇజ్రాయెల్

ఈ దాడులకు కారణం ఇజ్రాయెల్ అని హెజ్బొల్లా ఆరోపిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ సైన్యం తక్షణం స్పందించలేదు. అయితే, గత ఏడాది అక్టోబరు 7 దాడుల అనంతరం ప్రారంభమైన యుద్ధ లక్ష్యాలను విస్తృతం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన కొద్ది గంటల తర్వాత ఈ దాడులు జరగడం గమనార్హం. ఈ నేరపూరిత దాడులకు పూర్తి బాధ్యత ఇజ్రాయెల్‌దేనని హెజ్బొల్లా ఓ ప్రకటనలో ఆరోపించింది. ఈ దాడికి తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని, తగిన శిక్షను అనుభవించవలసి ఉంటుందని హెచ్చరించింది.

లిథియం బ్యాటరీలే కారణం

కొత్తగా వచ్చిన పేజర్లలోని లిథియం బ్యాటరీలే పేలి ఉంటాయని ఓ వార్తా సంస్థ తెలిపింది. వీటిని కొద్ది నెలల క్రితం హెజ్బొల్లా స్మగ్లింగ్ చేసి, తీసుకొచ్చినట్లు పేర్కొంది. లిథియం బ్యాటరీలు అతిగా వేడెక్కితే, పొగలు వస్తాయి, కరిగిపోతాయి. ఆ తర్వాత మండిపోయే అవకాశం కూడా ఉంటుంది. రీఛార్జబుల్ లిథియం బ్యాటరీలను సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ కార్లు వంటి కన్జ్యూమర్ ప్రొడక్ట్స్‌లో ఉపయోగిస్తారు. లిథియం బ్యాటరీ మండితే 590 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు మండుతుంది. కాగా, పేజర్లనే ఈ విధంగా పేల్చగలిగినప్పుడు స్మార్ట్‌ఫోన్లను పేల్చితే పరిస్థితి చాలా తీవ్రంగా ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



పేజర్ పేలడం వల్ల బీరుట్‌లో నడి రోడ్డుపై గాయపడ్డ ఇద్దరు వ్యక్తులు

బాల నేరస్థుల పట్ల మితిమీరిన దయ

నిర్భయ కేసు నుంచి గుణపాఠం నేర్చుకోవడం లేదు: మధ్య ప్రదేశ్ హైకోర్టు

ఇండోర్: మన దేశంలో బాల నేరస్థుల పట్ల అతి దయతో వ్యవహరిస్తున్నట్లు మధ్య ప్రదేశ్ హైకోర్టు ఇండోర్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2012నాటి నిర్భయ గ్యాంగ్ రేప్ కేసు నుంచి చట్ట సభలు గుణపాఠం నేర్చుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. 2017లో అప్పటికి 17 ఏళ్ల వయసుగల బాలుడు నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు కేసు నమోదైంది. ఇండోర్‌లోని అదనపు సెషన్స్ జడ్జి అతనిని దోషిగా నిర్ధారించి, 2019 మే 8న పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ తీర్పు వెలువడిన ఆరు నెలల తర్వాత ఆ బాల నేరస్థుడు మరో ఏడుగురు బాలలతో కలిసి జువెనైల్ కరెక్షన్ హోమ్ నుంచి పారిపోయాడు. క్రింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఈ బాల నేరస్థుని తరపున మధ్య ప్రదేశ్ హైకోర్టులో అపీలు దాఖలైంది. విచారణ జరిపిన హైకోర్టు అపీలును డిస్మిస్ చేసింది. పరారైన అపీలుదారుపై వారంట్ జారీ చేయాలని ఈ నెల 11న ఆదేశించింది. మిగిలిన శిక్ష అమలుకు అతడిని అరెస్ట్ చేయాలని ఆదేశించింది.

ఎంబీబీఎస్ సీట్ల కోసం మతం మార్పు

మీరట్: ఎంబీబీఎస్ సీట్లు పొందేందుకు పలువురు అభ్యర్థులు అడ్డదారులు తొక్కారు. ఎలాగైనా సీట్లు సంపాదించాలన్న లక్ష్యంతో ఏకంగా మతాన్నే అడ్డగోలుగా మార్చుకున్నారు. యూపీలో మైనారిటీ కాలేజీల్లో సీట్లు పొందేందుకు 12 మందికిపైగా అభ్యర్థులు మతం మారినట్టు అధికారుల దర్యాప్తులో తేలింది. వీరందరూ మతమార్పిడి చట్టం 2021ని ఉల్లంఘించినట్టు అధికారులు గుర్తించారు. ఇలా వెలుగులోకి వచ్చిన 20 అడ్మిషన్లను అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. అభ్యర్థులు సమర్పించిన సర్టిఫికెట్లపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశించింది. అలాగే, ఉత్తరప్రదేశ్ హోం మంత్రిత్వశాఖకు ఈ విషయాన్ని తెలియజేసింది. మొత్తం 20 మంది అభ్యర్థుల్లో ఏడుగురి అడ్మిషన్లను రద్దు చేయగా, మరో ఏడుగురు స్వచ్ఛందంగా దరఖాస్తులను వెనక్కి తీసుకున్నారు.

న్యూయార్క్‌లో హిందూ ఆలయంపై దాడి

న్యూయార్క్: అమెరికాలోని మెల్విల్లేలో ఉన్న బీఏపీఎస్ స్వామి నారాయణ్ దేవాలయంపై దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది ఆమోదనీయం కాదని, అత్యంత హేయమైన చర్య అని న్యూయార్క్‌లోని ఇండియన్ కాన్సులేట్ స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్న వీడియోలను బట్టి ఈ దేవాలయానికి వెళ్లే మార్గంలోఅర్థరహితమైన రాతలు రాసినట్లు తెలుస్తున్నది. ప్రధాని మోదీ ఈ నెల 22న ప్రసంగించబోతున్న వేదికకు 28 కి.మీ దూరంలో ఈ దేవాలయం ఉంది.

ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ

- ఆప్ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవం
- 26 లేదా 27న ప్రమాణ స్వీకారం
- పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్
- ఢిల్లీకి యంగెస్ట్ సీఎంగా ఆతిశీ రికార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. తన మంత్రివర్గ సహచరులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలుసుకున్న కేజ్రీవాల్ తన రాజీనామా పత్రాన్ని అందించారు. కేజ్రీవాల్ స్థానంలో ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిశీని పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ నెల 26 లేదా 27న ఆమె సీఎంగా ప్రమాణం చేయనున్నట్టు సమాచారం. ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ఇటీవల బెయిల్‌పై విడుదలైన సందర్భంగా సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రజలు తాను నిజాయితీపరుడినని సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిని చేపట్టబోనని ఆయన ప్రతినబూనారు. ఎల్జీని కలుసుకున్న అనంతరం ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ.. మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఎల్జీకి తెలిపామని, ఢిల్లీ ప్రజల ప్రయోజనాలను తాను పరిరక్షిస్తానని పేర్కొన్నారు. మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. అతిశీ నేతృత్వంలో కొత్త మంత్రివర్గం ప్రమాణం చేసేందుకు తేదీ ఖరారు చేయాల్సిందిగా ఎల్జీని కోరామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకొని తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నాయని ఆతిశీ ఆరోపించారు. కేజ్రీవాల్ కాకుండా మరొక నాయకుడైతే సీఎం కుర్చీని వదిలిపెట్టేవారు కాదని అన్నారు. కేజ్రీవాల్ ప్రజాకోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని, అందుకే రాజీనామా చేశారని చెప్పారు. ఇది తమకు ఎంతో బాధాకరమైన సమయం అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను తమ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని రాష్ట్ర ప్రజలు ప్రతినబూనారని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే మహారాష్ట్రతోపాటే నవంబర్‌లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలని కేజ్రీవాల్ కోరుతున్నారు.



మూడో మహిళా సీఎం

'ఢిల్లీ సీఎంగా అతిపెద్ద బాధ్యతను తనపై మోపిన 'గురువు' కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు' అని ఆప్ నాయకురాలు ఆతిశీ పేర్కొన్నారు. కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌కు చెందిన షీలాదీక్షిత్, బీజేపీకి చెందిన సుష్మా స్వరాజ్ తరువాత ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా ఆతిశీ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం దేశంలో మమతా బెనర్జీ ఒక్కరే మహిళా సీఎం కాగా, రెండో సీఎంగా ఆతిశీ నిలవనున్నారు. ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న అతి పిన్న వయస్కురాలు (43)గా కూడా ఆతిశీ నిలవనున్నారు. ఆప్ శాసనసభాపక్ష సమావేశంలో ఆతిశీ పేరును కేజ్రీవాల్ ప్రతిపాదించగా పార్టీ ఎమ్మెల్యేలందరూ మద్దతు తెలిపారు. ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికవడంపై ఆతిశీ స్పందిస్తూ.. ఇది ఒకవైపు తనకు ఆనందాన్ని, మరోవైపు తీవ్ర ఆవేదనను కలిగించే సందర్భమని వ్యాఖ్యానించారు. మొదటిసారి రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి నేరుగా సీఎం పదవిని పొందడం కేవలం ఆమ్ ఆద్మీ పార్టీలోనే సాధ్యమని అన్నారు. తనపై నమ్మకముంచిన కేజ్రీవాల్ తనను తొలుత ఎమ్మెల్యేను చేశారని, ఆపై మంత్రి పదవినిచ్చారని, ఇప్పుడు ముఖ్యమంత్రిని చేస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిగిలిన కొద్ది నెలలు.. తాను మళ్లీ ఢిల్లీ సీఎం కుర్చీపై కేజ్రీవాల్‌ను కూర్చోబెట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.

అత్యధిక శాఖలు ఆమె చేతిలోనే

సలహాదారు పదవి నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన ఆతిశీ అతి చిన్న వయసులోనే అత్యధిక శాఖలు నిర్వహించిన మహిళగా ఖ్యాతి పొందారు. ఆప్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరిగా పార్టీ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 2013లో ఆప్‌లో చేరిన ఆతిశీ అదే ఏడాది పార్టీ ప్రణాళిక ముసాయిదా కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. 2020లో కల్కాజీ నుంచి గెలుపొందారు. గత ఏడాది ఫిబ్రవరిలో డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అరెస్టయిన సంక్షోభ పరిస్థితుల్లో ఆమె మంత్రి పదవిని చేపట్టారు. అత్యంత కీలకమైన మంత్రిత్వ శాఖలను చేపట్టిన ఆతిశీ.. సీఎం జైలుకెళ్లినప్పుడు అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని ఏకతాటిపై నిలిపారు.

కదులుతున్న కారులో బాలికపై గ్యాంగ్‌రేప్

సహర్సా, సెప్టెంబర్ 17: బీహార్‌లోని సహర్సా జిల్లాలో కదులుతున్న కారులో ముగ్గురు వ్యక్తులు ఒక టీనేజీ బాలికపై సామూహిక లైంగిక దాడి చేశారని, ఈ ఘటనలో ఒక నిందితుడిని అరెస్ట్ చేసామని పోలీసులు మంగళవారం తెలిపారు. 'ఈ నెల 14న ముగ్గురు తుపాకీతో చంపేస్తామని బెదిరించి కదులుతున్న కారులో తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు మాకు ఫిర్యాదు చేసింది' అని ఎస్పీ హిమాన్షు తెలిపారు. ఆమెను వైద్య పరీక్షలకు పంపామని, నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. దర్యాప్తుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. లైంగిక దాడి జరిగిందని చెప్తున్న కారును సీజ్ చేశామని తెలిపారు.

మలప్పురంలో మంకీపాక్స్!

తిరువనంతపురం, సెప్టెంబర్ 17: నిఫా వైరస్‌తో పరిస్థితి ఆందోళనకరగా ఉన్న కేరళలోని మలప్పురంలో మంకీపాక్స్ కూడా వెలుగులోకి వచ్చింది. తాజాగా అనుమానిత కేసు ఒకటి నమోదైంది. నిఫా వైరస్ బారిన పడి 24 ఏండ్ల వ్యక్తి ఒకరు ఈనెల 9న చనిపోగా, దీనికి తోడు మంకీపాక్స్ కూడా జిల్లాలో వెలుగు చూడటం తీవ్ర కలకలం రేపుతున్నది. కొద్ది రోజుల క్రితం విదేశాలకు వెళ్లి వచ్చి అనారోగ్యంతో ఇక్కడి ఓ ప్రైవేట్ దవాఖానలో చేరగా, రోగ లక్షణాలను బట్టి అతడికి మంకీపాక్స్ సోకినట్టు అనుమానిస్తున్నామని జిల్లా వైద్య అధికారి ఒకరు చెప్పారు. అతడి నుంచి సేకరించిన నమూనాలను కోజికోడ్ మెడికల్ కాలేజీకి పంపామని, ఫలితం కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. అయితే మనదేశంలో 2022 జూలై నుంచి ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి.

యూరప్‌లో వేగంగా వ్యాపిస్తున్న

'ఎక్స్ఈసీ' వేరియంట్

బెర్లిన్, సెప్టెంబర్ 17: యూరప్‌లో కొత్త రకం కొవిడ్ వేరియంట్ 'ఎక్స్ఈసీ' వేగంగా విస్తరిస్తున్నది. రెండు ఒమిక్రాన్ సబ్ వేరియెంట్స్ నుంచి పుట్టుకొచ్చిన హైబ్రిడ్ రకంగా 'ఎక్స్ఈసీ'ని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఒమిక్రాన్ రోగుల్లో కనపడిన జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, వంటి లక్షణాలే ఇందులోనూ కనపడుతున్నాయని తెలిసింది. 'ఎక్స్ఈసీ' తొలి కేసు జర్మనీలో ఈ ఏడాది జూన్‌లో బయటపడగా, ఇప్పటివరకు 13 దేశాలకు వైరస్ వ్యాప్తి చెందింది. దీనిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ లేదా బూస్టర్ డోస్ తీసుకోవటం చాలా అవసరమని వైద్య నిపుణులు అంటున్నారు.. డెన్మార్క్, జర్మనీల్లో 'ఎక్స్ఈసీ' వేగంగా విస్తరిస్తున్నదని డాటా విశ్లేషకుడు మైక్ హనీ చెప్పారు.

బీహార్ గ్రాడ్యుయేట్‌కి రూ.2 కోట్ల ప్యాకేజీ

పాట్నా: బీహార్ యువకుడు అభిషేక్ కుమార్‌కు గూగుల్ లండన్ కార్యాలయంలో రూ.2 కోట్ల వార్షిక ప్యాకేజీ లభించింది. ఆయన వచ్చే నెలలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరిస్తారు. ఆయన పాట్నాలోని ఎన్ఐటీలో బీటెక్ చేశారు. 'ఇది నా అతి గొప్ప విజయం. చాలా మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు గూగుల్‌లో పని చేయడం ఓ స్వప్నం. ఇంపాక్ట్‌ఫుల్ ప్రాజెక్టులపై పని చేసే అవకాశం దక్కడం చాలా సంతోషంగా ఉంది' అని అభిషేక్ చెప్పారు. అభిషేక్ 2022లో అమెజాన్‌లో రూ.1.08 కోట్ల ప్యాకేజీ పొందారు. అక్కడ ఆయన 2023 మార్చి వరకు పని చేశారు. ఆ తర్వాత జర్మన్‌కు చెందిన ఫారిన్ ఎక్స్చేంజ్ ట్రేడింగ్ యూనిట్‌లో జాయిన్ అయ్యారు.



25 ఏండ్లలో 4 కోట్ల మందిని

బలి తీసుకోనున్న సూపర్‌బగ్స్

తాజా అధ్యయనం హెచ్చరిక

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ఔషధాలకు లొంగని సూపర్‌బగ్స్ లేదా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) వల్ల రానున్న 25 ఏండ్లలో దాదాపు 4 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉన్నదని ఓ అధ్యయనం హెచ్చరించింది. ఈ పరిస్థితిని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టకపోతే మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని స్పష్టం చేసింది. సూపర్‌బగ్స్ వల్ల తలెత్తే పర్యవసానాలను అంచనా వేసేందుకు జరిపిన ఈ అధ్యయన వివరాలు సోమవారం 'లాన్సెట్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. వైద్య రంగంలో ప్రపంచం ఎంతో పురోగతి సాధించినప్పటికీ, గత 3 దశాబ్దాల్లో ఐదేండ్లలోపు వయసున్న పిల్లల మరణాలను 50 శాతానికిపైగా తగ్గించగలిగినప్పటికీ 1990-2021 మధ్య కాలంలో సూపర్‌బగ్స్ వల్ల ఏటా 10 లక్షల మందికిపైగా మరణించినట్టు పరిశోధకులు ఈ అధ్యయనంలో తేల్చారు. వైద్య రంగంలో సాధించిన విజయాలు ఇన్ఫెక్షన్ల నియంత్రణకు, నివారణకు తోడ్పడినప్పటికీ సూపర్‌బగ్స్ ఎప్పటికప్పుడు శక్తిసామర్థ్యాలను పెంచుకుంటూ మానవాళికి సవాళ్లు విసురుతూనే ఉన్నాయని తెలిపారు.

బుల్డోజర్ జస్టిస్‌కు బ్రేకులు

వచ్చే నెల 1 వరకు కూల్చివేతలు ఆపండి

అన్ని రాష్ర్టాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు





న్యూఢిల్లీ: కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దుందుడుకుగా బుల్డోజర్లతో కూల్చివేతలకు పాల్పడుతుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆక్రమణల తొలగింపు పేరుతో సాగిస్తున్న ఈ బుల్డోజర్ జస్టిస్‌ను వచ్చే నెల 1 వరకు ఆపాలని అన్ని రాష్ర్టాలను మంగళవారం ఆదేశించింది. నిందితుల ఆస్తులతో సహా ఎటువంటి ఆస్తినీ తన అనుమతి లేకుండా కూల్చవద్దని స్పష్టం చేసింది. చట్టవిరుద్ధంగా కనీసం ఒక ఇంటిని కూల్చివేయడమైనా అది రాజ్యాంగ ఆత్మ, లక్షణాలకు వ్యతిరేకమని స్పష్టంచేసింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లు, చెరువులు వంటి బహిరంగ ప్రదేశాల్లోని అనధికారిక నిర్మాణాలకు ఈ ఆదేశాలు వర్తించబోవని తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ఈ ఆదేశాలను ఇచ్చింది. చాలా రాష్ర్టాల్లో ఇళ్లు, ఇతర భవనాలను చట్టవిరుద్ధంగా కూల్చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను జారీ చేసింది. మరోవైపు వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ వాదనను కోర్టు కొట్టివేసింది. 'వచ్చే విచారణ వరకు మీ చర్యలను ఆపాలని మేం కోరినంత మాత్రాన మిన్ను విరిగి మీద పడదు' అని కోర్టు వ్యాఖ్యానించింది.

ఇదే అంశంపై ఈ నెల 2న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై వచ్చిన స్పందనలను మంగళవారం ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా అమలు చేయదగిన మార్గదర్శకాలను జారీ చేస్తామని ఈ నెల 2న చెప్పింది. దీనిపై స్పందిస్తూ వచ్చిన స్టేట్‌మెంట్లలో, బుల్డోజర్ కొనసాగుతుందని, స్టీరింగ్ ఎవరి చేతుల్లో ఉందనే దానిపై అది ఆధారపడుతుందని అన్నారని గుర్తు చేసింది. సొలిసిటర్ జనరల్ మెహతాను ఉద్దేశించి న్యాయమూర్తులు మాట్లాడుతూ, 'ఈ మార్గదర్శకాలను జారీ చేసిన తర్వాత, ఈ ప్రాక్టీస్‌ను ఘనత చాటుకోవడం, హీరోయిజంగా చూపే యత్నంపై మీ సహాయం కోరుతాం. దీనిని ఎలా ఆపాలో మీరు మాకు సహాయపడుదురుగాని. అవసరమైతే, ఎన్నికల కమిషన్‌ను కూడా అడుగుతాం'' అని చెప్పారు. ఆ సమయంలో పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది ఒకరు మాట్లాడుతూ, ఈ నెల 2న విచారణ సందర్భంగా ఆదేశాలను ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత కూడా దేశంలో కూల్చివేతలు కొనసాగాయని చెప్పారు.

చట్టప్రకారమే కూల్చివేతలు: కేంద్రం

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, నిర్మాణాల కూల్చివేతలపై ఓ కథనాన్ని రూపొందిస్తున్నారని అన్నారు. ఓ మతానికి చెందిన వాడైనందువల్ల అతని ఇంటిని కూల్చేశారని ఆరోపిస్తున్న పిటిషన్ సుప్రీంకోర్టు ముందు ఉందన్నారు. చట్టాన్ని పాటించకుండా కూల్చివేసిన ఒక ఉదాహరణను కోర్ట్ దృష్టికి తీసుకురమ్మనండి అని అన్నారు. ప్రభావిత వ్యక్తులకు తమ నిర్మాణాలు చట్టవిరుద్ధమని, తమకు నోటీసులు వచ్చాయని తెలుసునని, అందుకే వారు కోర్టును ఆశ్రయించడం లేదని చెప్పారు. ఓ భావాన్ని రూపొందిస్తున్నారని మెహతా చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం స్పందిస్తూ, 'బయటి గలాభా మమ్మల్ని ప్రభావితం చేయజాలదని హామీ ఇస్తున్నాం' అని స్పష్టం చేసింది.

మహిళలు నైట్ డ్యూటీ చేయరని

మీరెలా చెబుతారు?

- వారికి ఎందుకు ఈ పరిమితులు?
- రక్షణ కల్పించడం మీ బాధ్యత
- బెంగాల్ సర్కారుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: మహిళా వైద్యులకు నైట్ షిఫ్ట్ డ్యూటీలు వేయరాదంటూ ప్రభుత్వ ఆధ్వర్యంలోని దవాఖానలకు ఆదేశాలు ఇస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు మంగళవారం తప్పుబట్టింది. వారికి రక్షణ కల్పించాల్సి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖానలో పీజీ ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసును సుప్రీం కోర్టు విచారించింది. బెంగాల్ ప్రభుత్వం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదేశించారు. 'మహిళలు రాత్రి వేళ పనిచేయరని మీరెలా చెబుతారు? మహిళా వైద్యులకు ఎందుకు ఈ పరిమితులు? వారేమీ తమకు మినహాయింపు కావాలని కోరడం లేదు. రాత్రి షిఫ్టులలో కూడా పని చేయడానికి వారు సిద్ధం' అని న్యాయస్థానం పేర్కొంది. వారికి భద్రతా చర్యలు కల్పించడంలోనే ఈ సమస్యకు పరిష్కారం ఉంది. రాత్రి షిఫ్టుల్లో పనిచేయకుండా వారిని మీరు నిరోధించ లేరు. రాత్రి విధుల్లో ఉన్నప్పుడు వారికి భద్రత, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చంద్రచూడ్ స్పష్టం చేశారు. కాగా, సోమవారం బెంగాల్ సీఎంతో జరిపిన చర్చల మేరకు చర్యలు తీసుకుంటే విధులకు హాజరవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జూనియర్ డాక్టర్లు కోర్టుకు స్పష్టం చేశారు.

పోలీస్ కమిషనర్ బదిలీ



గత నెల రోజులకు పైగా ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లకు సోమవారం సీఎం మమతా బెనర్జీ ఇచ్చిన ప్రధాన హామీ మేరకు ప్రభుత్వం మంగళవారం కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో మనోజ్ కుమార్ వర్మను నియమించారు. 1998 బ్యాచ్ అధికారి అయిన మనోజ్ కుమార్ ప్రస్తుతం అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్నారు. అలాగే మనోజ్ స్థానంలో చాలానాళ్లుగా కోల్‌కతా పోలీస్ కమిషనర్ స్థానం కోసం వేచి చూస్తున్న జావెద్ షమీమ్‌ను నియమించారు.

సీబీఐ నివేదిక దిగ్భ్రాంతి కలిగించింది

సీబీఐ మధ్యంతర రిపోర్టులో పేర్కొన్న అంశాలు దిగ్భ్రాంతి గొలిపేవిగా ఉన్నాయని, అవి తమను కలవరపరిచాయని న్యాయస్థానం పేర్కొంది. అయితే అందులోని అంశాలను వెల్లడించడం సబబుగా ఉండదని, అది సీబీఐ దర్యాప్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. కీలక అంశాలపై ఇప్పుడే ఒక అభిప్రాయానికి రాలేమని పేర్కొంది.

కొత్త బ్లడ్ గ్రూప్ 'మాల్'

- 50 ఏండ్ల మిస్టరీని ఛేదించిన శాస్త్రవేత్తలు
- క్లిష్టమైన చికిత్సల నిర్వహణ ఇకపై సులభం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ఇంగ్లండ్ శాస్త్రవేత్తల బృందం కొత్త బ్లడ్ గ్రూప్‌ను కనిపెట్టింది. దీనిని 'మాల్'గా వ్యవహరిస్తున్నది. 1972లో గుర్తించిన ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్ ప్రొటీన్‌కు కారణం ఈ బ్లడ్ గ్రూపేనని ఇంగ్లండ్‌లోని ఎన్‌హెచ్‌ఎస్, యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ శాస్త్రవేత్తలు తెలిపారు. తాజా పరిశోధనతో 50 ఏండ్ల మిస్టరీని ఛేదించామన్న పరిశోధకులు.. క్లిష్టమైన చికిత్సలు, రక్త మార్పిడిలో ఏర్పడే సమస్యలకు ఈ కొత్త బ్లడ్ గ్రూప్ సులభంగా పరిష్కారం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏమిటీ ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్?

ఏ, బీ, ఏబీ, వో, ఆర్‌హెచ్.. ఇలా ప్రపంచంలో ఇప్పటివరకూ 47 రకాల బ్లడ్ గ్రూప్‌లను శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతీ బ్లడ్ గ్రూప్‌లో ఏదో ఒక యాంటిజెన్ ఉంటుంది. ఈ ప్రొటీన్‌ను బట్టే వ్యక్తి రక్తం ఏ రకానిదన్న విషయం తెలుస్తుంది. అయితే, 1972లో తొలిసారిగా ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్ అనే కొత్త ప్రొటీన్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, అప్పటికే ఉన్న బ్లడ్ గ్రూప్‌లలో ఏ గ్రూప్‌నకూ ఈ ప్రొటీన్ సరిపోలలేదు. దీంతో ఈ యాంటిజెన్ ఉన్న వేలాది మందికి అత్యవసరమైన చికిత్స చేయడం సాధ్యపడలేదు. రక్తమార్పిడి చేసే సమయంలో సమస్యలు ఎదురయ్యేవి. అయితే, తాజా పరిశోధనలో ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్ ప్రొటీన్ 'మాల్' అనే కొత్త బ్లడ్ గ్రూప్‌నకు చెందినదని శాస్త్రవేత్తలు గుర్తించారు.

పసిఫిక్‌పై 'ఐరన్' పందిరి!

- *భూతాపాన్ని తగ్గించడానికే..*
- *3,800 చదరపు మైళ్ల పరిధిలో ఐరన్ సల్ఫేట్ పౌడర్‌తో ప్రయోగం*

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): పెరుగుతున్న భూతాపాన్ని కట్టడి చేయడానికి శాస్త్రవేత్తలు ఓ బృహత్తర ప్రయోగానికి సమాయత్తమయ్యారు. పసిఫిక్ మహా సముద్రం ఉపరితలంపై ఐరన్ సల్ఫేట్‌ను పరిచి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించేందుకు ఓషన్ ఐరన్ ఫర్టిలైజేషన్ (ఓఐఎఫ్) అనే ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పసిఫిక్ మహా సముద్రానికి ఆగ్నేయ ప్రాంతంలో 3,800 చదరపు మైళ్ల పరిధిలో ఐరన్ సల్ఫేట్ పౌడర్‌ను పడవల ద్వారా వెదజల్లనున్నారు. ఐరన్ సల్ఫేట్‌కు సీవో2ను పీల్చుకొనే స్వభావం ఉండటంతో తమ ప్రయోగం ద్వారా భూతాపాన్ని 2.7 డిగ్రీల ఫారన్‌హీట్ మేర తగ్గించవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2026నాటికి ఈ ప్రయోగం తొలిదఫా పూర్తి చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారు.


సముద్రంపైనే ఎందుకు?

40 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఏటా వాతావరణంలోకి విడుదల అవుతున్నది. దీంట్లో 30 శాతాన్ని సముద్రాలే పీల్చుకొంటున్నాయి. దీంతో భూతాపాన్ని తగ్గించడానికి సముద్ర జలాల్లోని సీవో2 స్థాయిలను తగ్గించాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. సముద్రం నీటిలో సీవో2ను వేగంగా పీల్చుకొనే పైటోప్లాంక్టన్ అనే ఒకరకమైన నాచును ఐరన్ సల్ఫేట్ సాయంతో పెంచడానికి సిద్ధమయ్యారు.

ఆందోళనలు కూడా..

తాజా ప్రయోగంతో సముద్ర జీవాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర జలాల్లో ఐరన్ సల్ఫేట్ మోతాదు పెరగడంతో సముద్ర జీవుల ఆహారగొలుసుపై ప్రభావం పడొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భూతాపాన్ని తగ్గించే ఓఐఎఫ్ ప్రయోగం సాగేది ఇలా..



విశిష్ట సేవలకు రాష్ట్రస్థాయి అవార్డులు

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): వృద్ధులకు విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలకు వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ రాష్ట్రస్థాయి అవార్డులు అందించనున్నది. అర్హులైన వారు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం 5గంటల్లోపు హైదరాబాద్‌లోని వికలాంగుల సంక్షేమ భవన్ డైరెక్టరేట్‌లో దరఖాస్తును సమర్పించాలని తెలిపారు.

ఏపీజీవీబీ సిబ్బంది వరదసాయం

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ) : వరద బాధితుల సహాయం కోసం ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది తెలంగాణ సీఎం సహాయ నిధికి 65 లక్షల విరాళం అందించారు.



• గంగమ్మ ఒడిలో మహా గణపతి

హుస్సేన్‌సాగర్‌లో నిష్క్రమిస్తున్న ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతి

బైబై గణేశా!

హైదరాబాద్ సహా రాష్ట్రంలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతం

- రాష్ట్రవ్యాప్తంగా 35 వేల మందితో బందోబస్త్: డీజీపీ
- ట్రై కమిషనరేట్ల పరిధిలోనే లక్ష విగ్రహాల నిమజ్జనం
- మధ్యాహ్నం 1.37 గంటలకే గంగ ఒడికి మహాగణపతి
- కీర్తి రిచ్‌మండ్, బాలాపూర్ లడ్డూలకు రికార్డు వేలం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలో మంగళవారం గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. డప్పు చప్పుళ్లు, కోలాటం, భజనలు, యువకుల నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ వినాయకుడి శోభాయాత్ర అంతటా సందడిగా సాగింది. హైదరాబాద్ నగరంలోని రోడ్లు జాతరను తపలించాయి. భైంసా, ముథోల్, నారాయణపేట్, ఉట్కూర్, కరీంనగర్, మహబూబ్‌నగర్ పరిధిలో మధ్యాహ్నానికే విగ్రహాల నిమజ్జనం పూర్తయింది. జడ్చర్ల, తాండూర్, మక్తల్, నిర్మల్‌లో కూడా ప్రశాంతంగానే ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జన శోభాయాత్రకు 35 వేల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించినట్టు డీజీపీ జితేందర్ చెప్పారు. రాజధానిలో ట్రై కమిషనరేట్లకు 25 వేల మంది సిబ్బందిని కేటాయించినట్టు తెలిపారు. ట్రై కమిషనరేట్ల పరిధిలో సుమారు లక్ష వరకు విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతి శోభాయాత్ర ఉదయం 6.32 గంటలకు ప్రారంభంకాగా, భక్త జనసందోహం నడుమ నగర వీధుల గుండా 8 గంటలపాటు యాత్ర సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పర్యటించేందుకు రావడంతో పాత సచివాలయం గేటు వరకు వచ్చిన మహాగణపతి శోభాయాత్ర గంటసేపు నిలిచిపోయింది. సీఎం పర్యటన ముగిసిన తర్వాత శోభాయాత్ర ముందుకు సాగింది. సుమారు గంటసేపు భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వలంటీర్లు రోడ్లపైనే నిలబడిపోయారు. అనంతరం మధ్యాహ్నం 1.37 గంటలకు మహా గణపతి గంగమ్మ ఒడికి చేరడంతో 'మహా' ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనానికి అగ్నిమాపశాఖ నుంచి మొత్తం 1,317 మంది సిబ్బందితో మోహరించినట్టు ఆ శాఖ అడిషనల్ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 126 వాటర్ టెండర్లు, 11 బోట్లు, 19 చిన్న అగ్నిమాపక వాహనాలు, 66 మిస్ట్ బుల్లెట్లు, 30 రెస్క్యూ రెస్పాన్స్ బృందాలతో విధులు చేపట్టినట్టు తెలిపారు. అత్యధికంగా హైదరాబాద్ నగరంలో 19 పెద్ద అగ్నిమాపక వాహనాలు, 16 మిస్ట్ బుల్లెట్లు, మూడు బోట్లు, 4 మినీ రెస్క్యూ టెండర్లు, 305 మంది సిబ్బందిని కేటాయించినట్టు చెప్పారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్దకు వేలాదికి తరలివచ్చిన భక్తుల తోపులాటతో పలువురు మహిళలు, వృద్ధులు గాయాలపాలయ్యారు. ఈ సమయంలో పోలీసులు లాఠీచార్జి చేశారు.

వేలం జరిగిన ప్రాంతం	లడ్డూలకు పలికిన ధర (రూ.లక్షల్లో)
బండ్లగూడ జాగీర్ కీర్తి రీచ్‌మౌండ్ విల్లా	187
బాలాపూర్	30.01
మాదాపూర్‌లోని మై హోం భుజ	29
కర్మన్‌ఘాట్ మాధవరం సెరినిటీ గేటెడ్ కమ్యూనిటీ	16.01
బడంగ్‌పేట	11.90
అత్తాపూర్ న్యూ స్టార్స్ భక్తసమాజ్	11.16
ఉప్పరిపల్లి వీరాంజనేయ భక్తసమాజ్ వినాయక మండపం	10
న్యూ నాగోల్ కాలనీ	6.81
రామంతాపూర్ లక్ష్మిగణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్	6.80

గణనాథుడి లడ్డూ @ 1.87 కోట్లు

కీర్తి రిచ్‌మౌండ్ విల్లా లడ్డూ వేలంలో ఆల్ టైం రికార్డ్

30.01 లక్షల రికార్డు ధర పలికిన బాలాపూర్ లడ్డూ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో లంబోధరుడి లడ్డూలకు ఏటేటా విలువ పెరుగుతున్నది. భక్తులు పోటీలు పడి మరీ వేలంలో లక్షలకు లడ్డూలను దక్కించుకుంటున్నారు. ఈసారి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీర్తి రిచ్‌మౌండ్ విల్లాస్‌లో నిర్వహించిన వేలంలో గణనాథుడి లడ్డూని ఆల్‌టైం రికార్డ్ ధరకు సొసైటీ సభ్యులే సొంతం చేసుకున్నారు. రూ.1.87 కోట్లకు ఆ లడ్డూను వారు దక్కించుకున్నారు. నిరుడి కంటే రూ.62 లక్షల అధిక ధర పలికింది. బాలాపూర్ లడ్డూ నిరుడి కంటే రూ.3.01 లక్షల అధిక ధరతో రూ.30.01 లక్షలతో బాలాపూర్‌కు చెందిన కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. నగరవ్యాప్తంగా పలుచోట్ల లడ్డూల వేలం పోటాపోటీగా సాగి లక్షల ధర పలికింది.



జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్‌లో ఖాళీగా ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను చూపుతున్న రైతులు

కరెంట్ లేక ఎండుతున్న పొలాలు

- పక్షం రోజులైనా మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న అన్నదాతలు
- జనగామ జిల్లా కొండాపూర్‌లో రైతుల దీనస్థితి

చిల్పూరు, సెప్టెంబర్ 17: కరెంట్ లేకపోవడంతో నీరందక పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామంలో ఎస్‌ఎస్10 ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పదిహేను రోజులు కావస్తున్నా పట్టించుకోవడం లేదని జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్ గ్రామ రైతులు మంగళవారం 'నమస్తే తెలంగాణ' ఎదుట గోడువెళ్లబోసుకున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా మరమ్మతులు చేపట్టడం లేదని, కరెంటు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని, చివరికి తమకు అత్మహత్యలే దిక్కంటున్నారు. ఇప్పటికే 40 ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో మక్క పంట ఎండిపోయిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు స్పందించి సత్వరమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే ప్రభుత్వమే బాధ్యతవహించాలని వారు హెచ్చరించారు.

విషజ్వరంతో మహిళ మృతి



సారమ్మ(ఫైల్)

టేకుమట్ల, సెప్టెంబర్ 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన రేణుకుంట్ల సారమ్మ (56) జ్వరంతో మరణించారు. సారమ్మకు శుక్రవారం జ్వరం రావడంతో పరకాలలోని ఓ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉన్నదని అక్కడి వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

'అంగన్‌వాడీ'లకు సకాలంలో అందని జీతాలు

- ఇబ్బందుల్లో టీచర్లు, ఆయాలు
- ఇలా అయితే కేంద్రాల నిర్వహణ ఎలా అంటూ ఆవేదన



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్రాల నిర్వహణపై ప్రభావం పడుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు ఇబ్బందులెక్కువయ్యాయని వాపోతున్నారు. తమకు కూడా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఆగస్టు వరకు ఐదు నెలలకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆగస్టులో వీటిని ప్రభుత్వం చెల్లించింది. ఇక సెప్టెంబర్‌లో రావాల్సిన జీతాన్ని మాత్రం ఇప్పటివరకూ చెల్లించలేదు. ఇవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ జీతాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30వేల మందికిపైగా సిబ్బంది కోరుతున్నారు.

పండిట్లను పట్టించుకునే వారేరీ?

- తమను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని పండిట్ల ఆగ్రహం
- సమస్యలు పట్టించుకోవడం లేదని తీవ్ర ఆవేదన
- హామీల అమలులో మోదీ సర్కారు విఫలమైందని మండిపాటు



శ్రీనగర్, సెప్టెంబర్ 17: రాజకీయ పార్టీలు తమను కేవలం ఓటుబ్యాంకుగానే పరిగణిస్తున్నారని, తమ సమస్యలను పట్టించుకోవడం లేదని కశ్మీరీ పండిట్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న నిరుద్యోగం, గృహ నిర్మాణ సమస్యలను తక్షణం తీర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికలు బుధవారం జరుగనున్నాయి. ఈ క్రమంలో 1990లో జమ్ముకశ్మీర్ నుంచి మూకుమ్మడిగా వలస వెళ్లిపోయిన కశ్మీర్ పండిట్లు సుమారు 35 ఏండ్ల తర్వాత కూడా తాము అదే దుస్థితిలో ఉండటం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలు తమ సమస్యలను తీర్చడంలో విఫలమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న అసాధ్య వాగ్దానాల పట్ల కశ్మీర్ పండిట్ల ప్రతినిధి బబ్లూ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు కేవలం తమను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, వారిచ్చిన వాగ్దానాలలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రిక్తహస్తాలు చూపుతున్నాయని అన్నారు. అదే సమయంలో ముస్లింలతో తమ సంబంధాలు పటిష్ఠంగా ఉన్నాయని తెలిపారు.

కేంద్రం హామీలు గాలికి..

కేంద్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని బబ్లూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వలసపోయిన కశ్మీర్ పండిట్లకు 6 వేల ఉద్యోగాలు, ఇళ్లు నిర్మించి ఇస్తామని మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే 2,500 గృహాలు మాత్రమే నిర్మించారని చెప్పారు. నాలుగేండ్లయినా మరో 2,500 ఇళ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని అన్నారు. తమను వెనక్కి రప్పించాలని ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఏడాదిలో దానిని పూర్తి చేసి ఉండేదని బబ్లూ పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయ నేతలకు కశ్మీరీ పండిట్లు గుర్తుకు వస్తారని సునీతా భాన్ అనే కశ్మీరీ పండిట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన అవకాశాలను వెతుక్కుంటూ అనేకమంది కశ్మీరీ పండిట్ల పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారని గుర్తుచేశారు.



• మయన్మార్‌లో

'యాగి' కల్లోలం.. 236 మంది మృతి

నైపేయీ, సెప్టెంబర్ 17: 'యాగి' టైఫూన్ తాకిడికి మయన్మార్ విలవిల్లాడుతున్నది. భారీ వర్షాలు, వరదల కారణంగా కొండచరియలు విరిగి పడి.. ఇప్పటివరకు కనీసం 236మంది మరణించారు. సైనిక తిరుగుబాటుతో సంక్షోభంలో కూరుకుపోయిన మయన్మార్‌ను 'యాగి' టైఫూన్ మరింత దెబ్బతీసింది. రాజధాని నైపేయీ సహా పలు రాష్ట్రాల్ని వరదలు ముంచెత్తాయి. వరదల్లో దాదాపు 77 మంది గల్లంతయ్యారని ఆ దేశ ప్రభుత్వ మీడియా 'గ్లోబల్ న్యూ లైట్ ఆఫ్ మయన్మార్' మంగళవారం పేర్కొన్నది. వరదల కారణంగా 6,31,000 మంది నిరాశ్రయలయ్యారని తెలిపింది. వారం రోజుల క్రితం 'యాగి' టైఫూన్ ఫిలిప్పీన్స్‌లో తీరాన్ని తాకింది. దీంతో దక్షిణ చైనా, వియత్నాం, లావోస్, మయన్మార్, బంగ్లాదేశ్‌లలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. యాగి టైఫూన్ వియత్నాంలో అల్లకల్లోలం సృష్టించింది. పలు చోట్ల కొండచరియలు విరిగిపడగా.. కనీసం 59 మంది చనిపోయారు. బంగ్లాదేశ్‌లో మునుపెన్నడూ లేనంతగా లక్షలాది మంది వరదల్లో చిక్కుకుపోయారు. ఫిలిప్పీన్స్‌లో 11 మంది మృతిచెందారు.

పూరీ జగన్నాథ ఆలయంలో ఎన్జీఆర్ఐ అధ్యయనం

- రత్న భండార్ ప్రాథమిక పరీక్షలో పాల్గొననున్న సంస్థ శాస్త్రవేత్తలు
- ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులతో కలిసి నేడు పరిశీలన



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయంలోని రహస్య భాండాగారాన్ని హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తల బృందం పరిశోధించనుంది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులు కూడా రత్నా భండాగారంలో ఉన్న గదులు, ఆభరణాలు, డిజైన్లను పరిశీలించనున్నారు. అయితే రత్నా భాండాగారంలో అదనంగా రహస్య నేల మాళిగలు ఉన్నాయని, ఇందులో భారీ మొత్తంలో నిధినిక్షేపాలతో నిండి ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో.. వీటన్నింటిని సాంకేతికత ఆధారంగా అధ్యయనం చేయనున్నారు. అనంతరం పూరీ జగన్నాథ్ కమిటీకి నివేదికను అందజేయనున్నారు. సెప్టెంబర్ 18న జరిగే సమీక్షలో పలు అంశాలను పరిశీలించనున్నారు. ఆలయ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాదే సమక్షంలో.. ఏఎస్ఐ, ఎన్జీఆర్ఐ టెక్నికల్ బృందం రత్న భాండార్ నిర్మాణాన్నీ అంచనా వేయనుంది. జియో ఫిజికల్, లైటింగ్ పరికరాలను వినియోగించనుంది. జీపీఆర్(గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్) సర్వే ద్వారా అధ్యయనం చేసేందుకు కమిటీ బృందం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని రూపొందించింది.

నిర్మాణాల నాణ్యతను తెలుసుకునేలా...

రత్న భండార్ నిర్మాణ నాణ్యతను తెలుసుకునేందుకు పరిశోధకులు అధ్యయనం చేయనున్నారు. నేల మాళిగల నిర్మాణం, ఐరన్ బీమ్స్ నాణ్యత, పై కప్పు, ప్రవేశ ద్వారాలు, స్టెయిన్‌లెస్ స్టీల్ బీమ్స్, గోడలపై ఉన్న పగుళ్లను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. దీని ఆధారంగా రత్న భండార్‌ల వినియోగం, ఆధునీకరణ వంటి అంశాలపై ఆలయ కమిటీ నిర్ణయం తీసుకోనుంది.

ఊహాగానాలకు చెక్...

పూరీ జగన్నాథ్ ఆలయంలో ఉన్న రత్న భండార్ విషయంలో ఎన్నో ఊహాగానాలు ఉన్నాయి. ఈ ఈ నేపథ్యంలో రత్న భండార్ గుట్టును సాంకేతికత ఆధారంగా తెలుసుకునేందుకు ఈ అధ్యయనం సాయపడనుంది. అదే విధంగా రత్న భండార్‌లోనే ఉన్న రహస్య గదులను కూడా తెలుసుకోవడం కోసం ఈ అధ్యయనం చేస్తున్నట్లుగా తెలిసింది. దీనికోసం ఇప్పటికే రత్న భండార్‌ను తెరిచిన బృందం... అందులో ఉన్న నిధులు, ఆభరణాలు, సంపద మొత్తాన్ని తాత్కాలిక గదుల్లోకి తరలించారు. కానీ రహస్య గదుల విషయంలో ఇప్పటికీ చర్చలు సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే వాటన్నింటికి చెక్ పెట్టేలా ఈ అధ్యయనం చేయనున్నారు.

దళితులపై మునిరత్న దుర్భాషలు

- ఆడియో టేప్స్ బయటకి
- చిక్కుల్లో కర్ణాటక బీజేపీ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్‌లో ఒకవైపు కాంగ్రెస్ సర్కారు పీకల్లోతు మునిగిపోయి ఉంటే, బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న దళితులపై దుర్భాషలాడిన ఆడియో టేపులు తాజాగా బయటపడటం కన్నడ రాజకీయాలను కుదిపేస్తున్నది. మునిరత్న తనను, తన కుటుంబంలోని మహిళలను కులం పేరిట దూషించినట్టు బృహత్ బెంగళూరు మహానగర పాలికకు చెందిన చెలువరాజు అనే కాంట్రాక్టర్ ఇటీవల ఆరోపించారు. కాంట్రాక్ట్ పనులకు లంచం ఇవ్వనందుకే మునిరత్న ఇలా చేసినట్టు ఆరోపించిన చెలువరాజు.. దుర్భాషలకు సంబంధించిన ఆడియో క్లిప్స్‌ను విడుదల చేశారు. మునిరత్న తనపై దాడి చేసినట్టు కూడా ఆరోపించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలుసుకొన్న మునిరత్న గత శనివారం ఏపీకి వెళ్లేందుకు యత్నించారు. పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం మునిరత్నను 14 రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీలో అంతర్మథనం

దళితులపై మునిరత్న చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీ నేతలు ఆచితూచి మాట్లాడుతున్నారు. ఈ విషయంపై కేంద్ర నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చిచెప్తున్నారు. 'మునిరత్నపై ఏ నిర్ణయాన్నైనా కేంద్ర నాయకత్వమే తీసుకోవాలి' అని కర్ణాటక బీజేపీ క్రమశిక్షణ కమిటీ ప్రెసిడెంట్ లింగరాజ్ పాటిల్ అన్నారు. వాల్మీకి స్కామ్ పేరిట కాంగ్రెస్ సర్కారును చిక్కుల్లో పెట్టాలనుకొన్న బీజేపీ పరివారానికి మునిరత్న వ్యవహారం కొత్త చిక్కులను తీసుకొచ్చినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

బీజేపీ మెడకూ 'ముడా' స్కామ్!

- బీజేపీ చీఫ్‌కు ముడా భూములు
- బినామీల పేరిట భూ ఫలహారం
- బీసీ ఫోరమ్ అధ్యక్షుడు శివరాము

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్న ముడా స్కామ్ బీజేపీ మెడకూ చుట్టుకొన్నట్టు కనిపిస్తున్నది. ముడా భూములను బినామీల పేరిట బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర చేజిక్కించుకొన్నట్టు కర్ణాటక బీసీ అవేర్‌నెస్ ఫోరమ్ ప్రెసిడెంట్ కేఎస్ శివరాము సంచలన ఆరోపణలు చేశారు. ఈ తతంగంలో బీజేపీ మైసూరు అధ్యక్షుడు ఎల్ఆర్ మహదేవస్వామి, ముడా మాజీ కమిషనర్ డీబీ నటేశ్ హస్తం కూడా ఉన్నట్టు తెలిపారు. రూ.7 కోట్ల విలువైన భూములను రూ. 5.36 లక్షలకే బినామీల పేరిట విజయేంద్ర కొనుగోలు చేసినట్టు ఆరోపించారు.



నాకూ సీఎం కావాలని ఉంది: అజిత్‌పవార్

పుణే, సెప్టెంబర్ 17: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి నేతల్లో పదవుల కోసం ఆరాటం మొదలైంది. కూటమి నుంచి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ తొలిసారి తనకు ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న మక్కువను బహిరంగంగా వ్యక్తం చేశారు. తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలని ఆసక్తిగా ఉన్నట్టు చెప్పారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక దగ్డుషేఠ్ హల్వాయ్ గణపతి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రతి వారు తమ నేత ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటారు. నేను కూడా ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నాను. అలా అని అందరి కోరికా నెరవేరదు. సీఎం కావాలంటే మెజారిటీ సీట్లు రావాలి. అదంతా ప్రజల చేతుల్లో ఉంది. ముఖ్యంగా 145 మ్యాజిక్ ఫిగర్ పొందడం చాలా అవసరం' అని అన్నారు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

21 నుంచి మోదీ అమెరికా పర్యటన



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన క్వాడ్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. నాలుగో క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశం విల్మింగ్టన్‌లో 21న ప్రారంభమవుతుందని, దీనికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా విచ్చేస్తారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ ఏడాది క్వాడ్ సమ్మిట్‌ను నిర్వహించే బాధ్యత భారత్‌దని, అయితే తామే ఈసారి దానిని నిర్వహిస్తామంటూ అమెరికా చేసిన అభ్యర్థన మేరకు ఈ సమావేశాన్ని 2025లో నిర్వహించడానికి భారత్ అంగీకరించినట్టు ఆ శాఖ ప్రతినిధి చెప్పారు. పర్యటనలో భాగంగా 22న న్యూయార్క్‌లో మోదీ స్థానిక భారతీయులను కలిసి మాట్లాడుతారు. 23న సమావేశం ఆఖరి రోజు న్యూయార్క్‌లోని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్'పై ప్రసంగిస్తారు. ఈ పర్యటనలో ప్రధాని పలు యూఎస్ కంపెనీల సీఈవోలతో సమావేశమై సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించనున్నారు.



దుబ్బాక చేనేత వస్త్రాల అలంకరణలో అయోధ్య బాలరాముడు

అయోధ్య రాముడికి దుబ్బాక చేనేత వస్త్రాలు

దుబ్బాక, సెప్టెంబర్ 17: అయోధ్య బాలరాముడికి మరోసారి సిద్దిపేట జిల్లా దుబ్బాక చేనేత వస్త్రాలను అలంకరించారు. దుబ్బాక పట్టణంలోని హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు తయారు చేసిన చేనేత వస్త్రాల్లో సోమవారం బాల రాముడు మెరిసిపోయారు. చేనేత మగ్గాలపై 80/100 లియా లెనిని ఫ్యాబ్రిక్‌తో గల 16 మీటర్ల తెలుపు రంగు వస్త్రాన్ని తయారు చేసి అందజేసినట్టు ఆ కంపెనీ వ్యవస్థాపకుడు బోడ శ్రీనివాస్ తెలిపారు. అయోధ్య బాలరాముడి విగ్రహానికి దుబ్బాక చేనేత వస్త్రాలు మరోసారి అలంకరించడంపై స్థానిక నేతన్నలు సంతోషం వ్యక్తంచేశారు.

నేడే శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదల

- **23న అంగప్రదక్షిణ టోకెన్లు జారీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి డిసెంబర్ నెల కోటా టికెట్లు నేడు(బుధవారం) విడుదల కానున్నాయి. ఉదయం 10గంటలకు ఆన్‌లైన్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేయనున్నది. ఈ-సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 18న ఉదయం10గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని టీటీడీ పేర్కొన్నది. 21న ఉదయం 10గంటలకు ఊంజల్ సేవ, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్ల కోటాను విడుదల చేయనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే అంగప్రదక్షిణ టోకెన్లను 23న ఉదయం 10గంటలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. శ్రీవాణి ట్రస్టు టికెట్లను ఉదయం 11 గంటలకు, వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్లను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. 24న ఉదయం 11గంటలకు రూ.300 శ్రీవారి ప్రత్యేక దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3గంటలకు తిరుపతి, తిరుమలలో గదుల కోటాను విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. శ్రీవారి సేవ కోటా టికెట్లను ఈనెల 27వ తేదీ ఉదయం గంటలకు విడుదల చేయనున్నారు.

పెన్షన్ చెల్లించకపోతే విచారణకు హాజరుకండి

- **కోర్టు ధిక్కార కేసులో ఐఏఎస్‌లకు హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): మలేరియా కేంద్రాల్లో ఫీల్డ్ వర్కర్లుగా పనిచేసి పదవీ విరమణ చేసినవారికి విధుల్లో చేరిన తేదీ నుంచి సర్వీసును లెక్కించి, పెన్షన్ చెల్లించాలని 2022 నవంబర్‌లో ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిందేనని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. లేని పక్షంలో సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మలేరియా ఫీల్డ్ వర్కర్లకు పెన్షన్ చెల్లింపుపై హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులు అమలు కావడం లేదంటూ నల్లగొండ జిల్లాకు చెందిన 10 మంది దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేశారు. ఈ లోగా ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేయాలని, లేకుంటే వైద్యారోగ్య, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులతోపాటు ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆగ్నేయ దిశగా వాయుగుండం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది. బుధ, గురు, శుక్రవారాల్లో ఉత్తర, దక్షిణ కోస్తాలో వానలు పడతాయని ప్రకటించింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తెలంగాణలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

డిసెంబర్ 1న సీటెట్ ఎగ్జామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ, ఉద్యోగార్థులకు నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్(సీ టెట్) నోటిఫికేషన్ విడుదలైంది. డిసెంబర్ 1న ఉదయం పేపర్ -2, మధ్యాహ్నం పేపర్ -1 పరీక్షను నిర్వహించనున్నట్టు సీబీఎస్ఈ ప్రకటించింది. దరఖాస్తులు అధికంగా వస్తే నవంబర్ 30న సైతం పరీక్షను నిర్వహిస్తామని వెల్లడించింది. వరంగల్, హైదరాబాద్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచే ప్రారంభంకాగా, అక్టోబర్ 16వరకు గడువు ఉంది.

కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కార్మికుల పిల్లలకు అందజేసే స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర కార్మికశాఖ అసిస్టెంట్ వెల్ఫేర్ కమిషనర్ అభినవ్ తివారి ప్రకటనలో తెలిపారు. బీడీకార్మికులు, లైమ్ స్టోన్, డోలమైట్ మైన్, మైకా, ఇనుపఖనిజం గనుల్లో పనిచేసే కార్మికులు, సినీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రీ మెట్రిక్ (1 -10తరగతులు) వారు 30లోపు, పోస్ట్‌మెట్రిక్ (11వ తరగతి నుంచి డిగ్రీ, ప్రొఫెషనల్‌కోర్సులు) స్కాలర్‌షిప్స్ కోసం అక్టోబర్ 31 వరకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గురుకుల పీఈటీలుగా 53 మంది ఎంపిక

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): గురుకులాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీలో భాగంగా మరో 53 మందిని టీజీపీఎస్సీ ఎంపికచేసింది. రీలింక్విష్‌మెంట్ ద్వారా వారిని ఎంపికచేసింది. వివరాలను https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

'డైరెక్టర్ త్రివిక్రమ్‌నూ ప్రశ్నించండి'

- **ఎక్స్‌లో నటి పూనమ్ కౌర్ డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): సినీ పరిశ్రమలో లైంగిక వేధింపుల అంశం మళ్లీ తెరపైకి రావడంతో ఒకప్పటి బాధితురాలు, నటి పూనమ్‌కౌర్ ఎక్స్‌లో స్పందించారు. ఓ లైంగిక వేధింపుల కేసులో డాన్స్ మాస్టర్ జానీపై తాజాగా సినీపెద్దలు స్పందించడంతో ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను సైతం ప్రశ్నించాలని ఆమె కోరింది. గతంలో తనపై వేధింపులు జరిగిన నేపథ్యంలో సినీపెద్దలకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, ఎవరూ సహకరించలేదని చెప్పుకొచ్చింది. రాజకీయంగా కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ట్వీట్‌లో పేర్కొన్నది. డైరెక్టర్ త్రివిక్రమ్, ఓ ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు తనను లైంగికంగా వేధించారంటూ గతంలో పూనమ్ కౌర్ ఆరోపించిన విషయం తెల్సిందే.


చట్టవిరుద్ధ సోదాలను ఆపండి

హైకోర్టులో పిల్ దాఖలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): మురికివాడల్లో పోలీసులు వివిధ రకాల పేర్లతో చట్టవిరుద్ధంగా సోదాలు నిర్వహిస్తున్నారని, వాటిని నిలిపివేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. మిషన్ ఛబుత్రా, ఆపరేషన్ రోమియో తదితర పేర్లతో జరుగుతున్న ఈ సోదాలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని హైదరాబాద్‌లోని బషరత్‌నగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఎస్క్యూ మసూద్ ఆ పిల్‌లో విజ్ఞప్తి చేశారు. చిన్న వ్యాపారాలు, ఫుట్‌పాత్ వ్యాపారాలను రాత్రి 11 గంటల్లోపే మూసివేయిస్తున్నారని, ఇలా చేయడం 2015లో జారీ అయిన జీవో 15కు విరుద్ధమని పేర్కొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లను ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటలకు వరకు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. అయినప్పటికీ వ్యాపారులను పోలీసులు వేధిస్తున్నారని, ఏ చట్టం కింద సోదాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించినా సమాధానం చెప్పడం లేదని వివరించారు. పోలీసుల చర్య రాజ్యాంగంలోని 19, 21 అధికరణలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొంటూ.. రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్ సీపీలను ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ జరుపనున్నది.


నేటి నుంచి 'ఆరోగ్యమిత్ర'ల సమ్మె

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దవాఖానల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ప్రభుత్వానికి సమ్మె నోటీసును అందజేశారు. వైద్యారోగ్య శాఖ స్పందించకపోవడంతో ఈ నెల మొదట్లోనే సమ్మెకు వెళ్లాలని భావించారు. వరదల నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని, విధులను బహిష్కరిస్తామని చెప్పారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కార్యాలయాన్నీ ముట్టడించనున్నట్టు వారు పేర్కొన్నారు.
















దేశ ఎగుమతి అధోగతి



ఆగస్టులో 13 నెలల కనిష్ఠానికి క్షీణత
34.71 బిలియన్ డాలర్లకు పరిమితం
10 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు
రెండింతలైన బంగారం దిగుమతులు



గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలోకి బంగారం దిగుమతులు 30 శాతం పెరిగి 45.54 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-ఆగస్టులోనే 22.70 బిలియన్ డాలర్లకు చేరిక.

దేశంలోకి జరుగుతున్న పసిడి దిగుమతుల్లో దాదాపు 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే. తర్వాతి స్థానాల్లో యూఏఈ (16 శాతానికిపైగా), దక్షిణాఫ్రికా (10 శాతం).

భారతీయ దిగుమతుల్లో బంగారం వాటానే 5 శాతానికిపైగా ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా బంగారం వినియోగంలో చైనా తర్వాత భారత్‌దే రెండో స్థానం. ఆభరణాల పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున ఆదరణ కనిపిస్తున్నది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: దేశీయ ఎగుమతులు దారుణంగా పడిపోయాయి. గత నెలలో ఏకంగా 9.3 శాతం క్షీణించాయి. గడిచిన 13 నెలల్లో ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ 34.71 బిలియన్ డాలర్లకే పరిమితమైంది. మరోవైపు వివిధ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగిసింది. ఇది రికార్డుస్థాయి కావడం గమనార్హం. దీంతోనే వాణిజ్య లోటు సైతం 10 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 29.65 బిలియన్ డాలర్లను తాకింది. ఈ మేరకు మంగళవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వెల్లువలా పసిడి-వెండి

ఆగస్టులో దేశంలోకి పసిడి, వెండి దిగుమతులు పెద్ద ఎత్తున జరిగాయి. వీటిలో బంగారం విలువ 10.06 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలలో 4.93 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. అలాగే వెండి దిగుమతులు 727 మిలియన్ డాలర్లకు ఎగిశాయి. నిరుడు 159 మిలియన్ డాలర్లే. దీంతో దేశీయ దిగుమతులు మొత్తంగా పెరగడానికీ ఇవి దోహదం చేశాయి. నిజానికి దేశీయ దిగుమతుల్లో క్రూడాయిల్ వాటానే ఎక్కువ. దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. కానీ పెట్రోలియం ధరలు తక్కువగా ఉండటంతో ముడి చమురు దిగుమతులు ఈ ఆగస్టులో 11 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. క్రిందటి ఏడాది ఆగస్టుతో చూస్తే ఇది 32.38 తక్కువ. కానీ ఇదే స్థాయిలో బంగారం, వెండి దిగుమతులుండటం.. ఈసారి వాణిజ్య లోటును ఎగదోసింది. అయితే కస్టమ్స్ సుంకాల కోత, పండుగ సీజన్ డిమాండ్ వల్లే ఈ స్థాయిలో గోల్డ్, సిల్వర్ ఇంపోర్ట్స్ జరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అంటున్నది. కస్టమ్స్ సుంకాల తగ్గింపు.. స్మగ్లింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను తగ్గుముఖం పట్టేలా చేసిందని వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ చెప్తున్నారు. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి దించిన సంగతి విదితమే.

సరిహద్దుల్లో కుస్తీ.. వాణిజ్యంలో దోస్తీ అన్నట్టుగా చైనాతో కేంద్ర ప్రభుత్వం వైఖరి సాగుతున్నది. గత నెల చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 22.44 శాతం పతనమై 1 బిలియన్ డాలర్లకు పరిమితమైతే.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 15.55 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య చైనాకు భారతీయ ఎగుమతులు గతంతో చూస్తే 8.3 శాతం దిగజారి 5.8 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. కానీ చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 10.96 శాతం ఎగబాకి 46.65 బిలియన్ డాలర్లను తాకాయి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు 35.85 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 2013-14 నుంచి 2017-18 వరకు అలాగే 2020-21లో

చైనాతో చెట్టాపట్టాల్

భారత్‌కు చైనానే అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక అమెరికా, యూఏఈ, సింగపూర్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, నేపాల్, బెల్జియం, టర్కీ దేశాలకూ భారత్ నుంచి ఎగుమతులు గత నెల పడిపోయాయి. ఇదే సమయంలో యూఏఈ, స్విట్జర్లాండ్, కొరియా, జపాన్, థాయిలాండ్, వియత్నాం, తైవాన్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరిగాయి. మొత్తానికి అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, ఎర్ర సముద్రం సంక్షోభం.. భారతీ ఎగుమతుల్ని దెబ్బతీశాయని కేంద్రం తాజా పరిస్థితులను వెనకేసుకొస్తున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరగడం.. దేశీయ తయారీ రంగాన్ని వెక్కిరిస్తోందని పలువురు ఆర్థిక నిపుణులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ట్రయంఫ్ సరికొత్త బైకులు

ధరల శ్రేణి రూ.2.17-2.40 లక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ప్రముఖ వాహన సంస్థ బజాజ్ ఆటో..ప్రీమియం మోటార్‌సైకిళ్ల బ్రాండ్ ట్రయంఫ్‌ను మరింత బలోపేతం చేయడానికి మరో రెండు మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 400 సీసీ సెగ్మెంట్‌లో విడుదల చేసిన స్పీడ్ టీ4 మాడల్ ధర రూ.2.17 లక్షలుగాను, మై25 స్పీడ్ 400 మాడల్ ధర రూ.2.40 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. స్టైలిష్, పనితీరు, టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..యువతను దృష్టిలో పెట్టుకొని ఈ బైకు వేగాన్ని మరింత పెంచినట్లు బజాజ్ ఆటో ప్రెసిడెంట్ ఉనిత్ సుమీత్ నారంగ్ తెలిపారు. ట్రయంఫ్ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడానికి డీలర్ల సంఖ్యను ఈ ఏడాది చివరినాటికి 170కి, అలాగే వచ్చే ఏడాది 200కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. బ్రిటన్‌కు చెందిన మోటార్‌సైకిల్ బ్రాండ్ ట్రయంఫ్‌తో గతేడాది జతకట్టిన విషయం తెలిసిందే. చిన్నస్థాయి నగరాలు, పట్టణాల్లో కూడా డీలర్లను నెలకొల్పనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం 75 నగరాల్లో 120 డీలర్లు ఉన్నారు.

రిలయన్స్ డిజిటల్‌లో ఐఫోన్ 16



హైదరాబాద్, సెప్టెంబర్ 17: రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో ఐఫోన్ 16 అన్ని రకాల మాడళ్లు లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్టోర్లతోపాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో కూడా ఈ ఫోన్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. ఈ ఫోన్లను ముందస్తు బుకింగ్ చేసుకున్నవారికి రిఫండ్ రెండుసార్లు అందిస్తున్నట్లు వెల్లడించింది. గతేడాది వచ్చిన ముందస్తు బుకింగ్‌లతో పోలిస్తే ఈసారి ఐఫోన్ 16కి విశేష స్పందన లభించిందని, రెండింతలు బుకింగ్‌లు వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. పలు క్రెడిట్ కార్డులపై రాయితీ కూడా ఇస్తున్నట్లు తెలిపింది.

వే2న్యూస్ 117 కోట్ల సేకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 17: ప్రాంతీయ వార్తలు అందించే వే2న్యూస్ మరోసారి భారీ స్థాయిలో నిధులను సమీకరించింది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ నుంచి 14 మిలియన్ డాలర్లు(రూ.117 కోట్లు) సేకరించినట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో రాజు వనపాల తెలిపారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, బ్రాండ్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా ఈ నిధులను సేకరించినట్లు చెప్పారు. అలాగే వెంచర్ క్యాపిటలిస్ట్ శశి రెడ్డి కూడా పెట్టుబడులు పెట్టారు కూడా. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ర్టాల్లో సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.

నాలుగు నెలల కనిష్ఠానికి టోకు ధరల సూచీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: టోకు ధరల సూచీ శాంతించింది. వరుసగా రెండో నెల ఆగస్టులోనూ టోకు ధరల సూచీ నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 1.31 శాతానికి పడిపోయింది. కూరగాయలు, ఆహార, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే ధరల సూచీ తగ్గిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జూలై నెలలో 2.04 శాతంగా ఉన్న ధరల సూచీ..ఏడాది క్రితం మైనస్ 0.46 శాతంగా ఉన్నది. ఆహారపదార్థాల ధరల సూచీ 3.11 శాతంగా ఉన్నది.


పారదర్శకంగా ఉండాలి

ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్‌కు ఐబీబీఐ చీఫ్ సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: దివాలా ప్రక్రియలో ఇన్సాల్వెన్సీ ప్రొఫెనల్స్ వీలైనంత పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చైర్మన్ రవీ మిట్టల్ అభిప్రాయపడ్డారు. అప్పుడే మొండి బకాయిల పరిష్కార బిడ్డింగ్‌లో ఎక్కువ మంది పాల్గొంటారని, దాంతో రుణాలిచ్చినవారికి మరింత సొమ్మును ఇప్పించగలమని చెప్పారు. మంగళవారం ఇక్కడ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ ఆఫ్ ఐసీఏఐ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఇన్సాల్వెన్సీ వ్యవస్థకు ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్, ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ సంస్థలే ఆధారం అన్నారు. దివాలా ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్‌కు సూచించారు. సమయాన్ని దృష్టిలో పెట్టుకొని జాప్యం లేకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దాంతో ఐబీబీఐపై విశ్వాసం పెరుగుతుందన్నారు.

కదం తొక్కుతున్న మార్కెట్లు

తొలిసారి 83 వేలపైన సెన్సెక్స్ • చారిత్రక గరిష్ఠ స్థాయికి సూచీలు



ముంబై, సెప్టెంబర్ 17: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సెన్సెక్స్ మంగళవారం 83 వేల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇంతటిస్థాయికి చేరుకోవడం ఇదేతొలిసారి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలకు తోడు వడ్డీరేట్ల తగ్గింపునకు అమెరికా ఫెడరల్ మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు గ్లోబల్ మార్కెట్లు భారీగా లాభపడటంతో దేశీయ సూచీలు ఎగిశాయి. ఇంట్రాడేలో 160 పాయింట్లకు పైగా లాభపడి 83,152.41 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 90.88 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 83,079.66 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం లైఫ్‌టైం హై 25,400 పాయింట్ల పైన ముగిసింది. చివరకు 34.80 పాయింట్లు ఎగబాకి 25,418.55 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లు పాజిటివ్‌లోనే కదలాడుతున్నాయని, ఫెడ్ వడ్డీరేట్లను పావుశాతం తగ్గించే అవకాశాలుండటం సూచీల్లో జోష్ పెంచిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అలాగే కూరగాయల ధరలు శాంతించడంతో ఆగస్టు నెలకుగాను టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడం కూడా కలిసొచ్చిందన్నారు.

- భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, మహీంద్రా షేర్లు లాభపడ్డాయి.
- అలాగే టైటాన్, ఎల్అండ్‌టీ, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్‌ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు బలపడ్డాయి.
- టాటా మోటర్స్ షేరు 1.33 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు అదానీపోర్ట్స్, ఐటీసీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, మారుతి, ఎస్బీఐ, టీసీఎస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టపోయాయి.

బజాజ్ హౌజింగ్ మరో 10 శాతం

నూతనంగా స్టాక్ మార్కెట్లో లిస్టైన బజాజ్ హౌజింగ్ షేరు కదంతొక్కుతున్నది. వరుసగా రెండోరోజు కూడా కంపెనీ షేరు 10 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో కంపెనీ షేరు 10 శాతం లాభపడి రూ.181.48 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ మరో రూ.13,733.12 కోట్లు పెరిగి రూ.1,51,139.21 కోట్లకు చేరుకున్నది. ఇష్యూ ధర రూ.70తో పోలిస్తే గత రెండు రోజుల్లో షేరు ధర 159.28 శాతం ఎగబాకింది. రూ.150 వద్ద బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వద్ద లిస్టైనది తెలిసిందే.

ఈ ఏడాదంతా ప్రీప్రొడక్షనే



మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం అప్‌డేట్ కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. కానీ రాజమౌళి మాత్రం అవేం పట్టించుకోకుండా కామ్‌గా తన పనితాను చేసుకుంటూ పోతున్నారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు గప్‌చుప్‌గా జరిగిపోతున్నాయట. ఫిల్మ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం రాజమౌళి ఈ ఏడాది మొత్తాన్నీ ప్రీప్రొడక్షన్ వర్క్‌కే కేటాయిస్తున్నారట. ఈ సినిమా షూటింగ్ మొదలయ్యేది వచ్చే ఏడాదే అని తెలుస్తున్నది. తొలి షెడ్యూల్ జర్మనీలో ఉండబోతున్నదట. ఈ షెడ్యూల్‌లోనే కొందరు విదేశీ నటులు కూడా భాగం కానున్నారని వినికిడి. 18వ శతాబ్దానికి చెందిన పీరియాడికల్ ఎపిసోడ్ ఈ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. అమెజాన్ ఫారెస్ట్ నేపథ్యం అంతా ఆ ఎపిసోడ్‌లోనే ఉంటుందట. దీనికోసం రాజమౌళి ప్రత్యేకమైన స్కెచ్‌లు గీయిస్తున్నారని వినికిడి. అరుదైన గిరిజన జాతికి సంబంధించిన రిఫరెన్స్‌లు ఈ సినిమాలో ఉంటాయట. త్వరలోనే వీటికి సంబంధించిన స్కెచ్‌లు, కాస్ట్యూమ్స్ ఫైనలైజ్ చేయనున్నారు. దీనికోసం వందలమంది జూనియర్ ఆర్టిస్టులకు ముందే ట్రైనింగ్ ఇచ్చి, వారిని సిద్ధం చేయనున్నారట. దాదాపు వెయ్యికోట్ల భారీ వ్యయంతో రూపొందనున్న ఈ సినిమాను దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

చిత్రం

బంగ్లాను అమ్మక తప్పలేదు



'ఆస్తులు అంటే మనకు అవసరమైనప్పుడు అమ్ముకునేవి అని అర్థం. ముంబయి బాంద్రాలోని పాలి హిల్‌లో ఉన్న నా బంగ్లాను నేను అమ్మేసిన మాట నిజం. 32కోట్లకు దాన్ని అమ్మేశాను. అది నా వ్యక్తిగత విషయం. అదేం దేశ సమస్య కాదు' అంటూ నిర్మొహమాటంగా చెప్పేసింది బాలీవుడ్ భామ కంగనా రనౌత్. గత కొన్ని రోజులుగా తన బంగ్లా అమ్మేసినట్లు వస్తున్న వార్తలపై తాజా ఇంటర్వ్యూలో కంగనా స్పందించింది. 'నా 'ఎమర్జన్సీ' సినిమా విడుదల కావాల్సివుంది. ఆ సినిమా నిర్మాణం కోసం నా ఆస్తుల్ని తనఖా పెట్టాను. కానీ అది విడుదల కాలేదు. దాంతో 2017లో కొన్న ఆ బంగ్లాను అమ్మక తప్పలేదు' అంటూ వివరణ ఇచ్చింది కంగనా. ఈ ఇంటర్వ్యూలోనే వివాదాస్పద వెబ్ సిరీస్ 'ఐసీ 814:ది కాందహార్ హైజాక్' గురించి కంగనా మాట్లాడుతూ 'ఈ మధ్య ఓటీటీ కంటెంట్ చాలా దారుణంగా ఉంటుంది. వాటిని పిల్లలు చూస్తున్నారు. వారి మనసులు విషతుల్యం అయితే.. ఆ ప్రభావం భావిభారతం మీద పడుతుంది. అందుకే.. ఓటీటీలో విడుదలయ్యే సినిమాలు, సిరీస్‌లకు కూడా సెన్సార్‌షిప్ అవసరం. దాన్ని సాధించే దాకా నా పోరాటం ఆగదు' అంటూ చెప్పుకొచ్చింది.

కమర్షియల్ పంథాకు భిన్నంగా..



సూపర్‌స్టార్ రజనీకాంత్ తాజా చిత్రం 'వేట్టైయాన్' దసరాకు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే దక్షిణాదిన భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ సినిమా గురించి చిత్ర సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. కమర్షియల్ పంథాకు భిన్నంగా సామాజికాంశాలను చర్చిస్తూ దర్శకుడు జ్ఞానవేల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడని, 'జై భీమ్' తరహాలో సమాజాన్ని ప్రభావితం చేసే సినిమా ఇదని అన్నారు. 'ఈ కథ నన్ను ఆలోచింపజేసింది. సమకాలీన అంశాలను తనదైన శైలిలో చర్చిస్తూ వాటికి పరిష్కార మార్గాల్ని సూచిస్తూ దర్శకుడు ఈ కథ రాసుకున్నాడు. రజనీకాంత్ కెరీర్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. కమర్షియల్ అంశాలకు దూరంగా ఓ బలమైన సందేశాన్ని అందించే ఉద్దేశ్యంతో రజనీకాంత్ ఈ సినిమాలో నటించారు' అని చెప్పారు. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, మంజు వారియర్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది.

మల్టీస్టారర్ జీబ్రా



సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనంజయ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మల్టీస్టారర్ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. అక్టోబర్ 31న దీపావళి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ మంగళవారం మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. సత్యరాజ్, సత్య అక్కల, జెన్నిఫర్ పిసినాటో, సునీల్, ప్రియా భవానీశంకర్, డాలీ ధనంజయ, సత్యదేవ్‌లను ఈ పోస్టర్ పరిచయం చేసింది. కాయిన్ తిప్పడం, కరెన్సీ నోట్లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి కారు దూకడం వంటి డైనమిక్ ఎలిమెంట్స్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్, సహనిర్మాత: ఎస్.శ్రీలక్ష్మిరెడ్డి, నిర్మాణం: పద్మజ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్, ఓల్డ్‌టౌన్ పిక్చర్స్.

నాలుగోసారి దర్శకత్వం



స్వీయ దర్శకత్వంలో ధనుష్ నటించిన 'రాయన్' చిత్రం ఇటీవలే విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. నటుడిగా, దర్శకుడిగా ధనుష్ అద్భుతమైన ప్రతిభతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ప్రస్తుతం ఆయన తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇదిలావుండగా ధనుష్ మరోమారు మెగాఫోన్ పట్టబోతున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందబోతున్న నాలుగో చిత్రమిది కావడం విశేషం. నూతన నిర్మాణ సంస్థ డాన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. మంగళవారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. తనదైన శైలి యాక్షన్, ఎమోషనల్ అంశాలతో ధనుష్ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని, దర్శకుడిగా ఆయనకు మరో విజయం ఖాయమని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది. ప్రస్తుతం ధనుష్ 'కుబేర' చిత్రంలో నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున, రష్మిక మందన్న ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో త్వరలో విడుదలకానుంది.



ఆలోచించి అడుగు వేయండి

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ మలయాళ సినీరంగాన్ని కుదిపేస్తున్నది. ఈ కమిటీ ప్రభావంతో ఇతర భాషల్లో కూడా లైంగిక వేధింపులపై విచారణ చేపట్టాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. డ్యాన్స్ మాస్టర్ జానీపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం తెలుగు ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. సినీ రంగంలో ఈ పరిణామాలపై కథానాయిక కృతిశెట్టి ఆందోళన వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'ఈ తరహా సంఘటనలు జరగడం దురదృష్టకరం.బాధితులు అనుభవించిన మానసిక క్షోభను తలచుకుంటే భయమేస్తున్నది. అయితే ఇలాంటి సంఘటనల గురించి ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చేవారు ముందే తెలుసుకోవడం చాలా మంచిది. అప్పుడు వారికి ఇండస్ట్రీ పట్ల ఓ అవగాహన ఏర్పడుతుంది. దీనివల్ల భవిష్యత్తులో సానుకూల మార్పులు వస్తాయి' అని చెప్పింది. వ్యక్తిగతంగా ఇలాంటి విషయాలు తనను బాగా డిస్టర్బ్ చేస్తాయని, వేధింపుల వార్తలు విన్నప్పుడు ఆందోళన కలుగుతుందని కృతిశెట్టి చెప్పింది. ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చే మహిళలు ఆలోచించి అడుగులు వేయాలని ఆమె సలహా ఇచ్చింది. కృతిశెట్టి నటించిన తాజా చిత్రం 'ఏఆర్ఎమ్' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధిస్తున్నది.



భక్తిప్రధానంగా కాశీనగర్

డీకే దిలీప్ రాథోడ్, ఆరోహి జంటగా రూపొందిన భక్తిప్రధాన చిత్రం 'కాశీనగర్-1947'. చిత్తజల్లు ప్రసాద్ దర్శకుడు. కదిరి రమాదేవిరెడ్డి నిర్మాత. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్, దర్శక,నిర్మాత సాయివెంకట్, సుప్రీం కోర్ట్ న్యాయవాది ఎన్.రామచంద్రరావు, రిటైర్డ్ డీజీపీ సి.ఎన్.గోపీనాథరెడ్డి, కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కుటుంబసమేతంగా చూడదగ్గ గొప్ప సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. దైవసంకల్పం వల్లే ఈ సినిమా చేయగలిగామని నిర్మాత పేర్కొన్నారు.

బాధితురాలికి అండగా ఉంటాం



'పని ప్రదేశాల్లో వేధింపులు ఉన్నాయంటూ బాధితురాలు ఛాంబర్‌ని ఆశ్రయించింది. మీడియాలో విషయం వెలుగుచూడగానే, లైంగిక వేధింపుల గురించి బయట పెట్టింది. మా పరిధిలో మేం విచారణ పూర్తి చేశాం. ఇద్దరి వాదనలు విన్నాం. 90రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రిపోర్ట్ చేస్తాం. ఇలాంటి వ్యవహారాలపై పరిశ్రమకు చెందిన ఎవరు కంప్లైంట్ చేసినా.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం' అని టాలీవుడ్‌కి చెందిన లైంగిక వేధింపుల పరిష్కార ప్యానల్ అధ్యక్షురాలు ఝాన్సీ తెలిపారు. ప్రముఖ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైన విషయం విదితమే. ప్రస్తుతం నార్సింగ్ పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై టాలీవుడ్‌కు చెందిన లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఝాన్సీ మాట్లాడుతూ 'బాధితురాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధిపులకు ఎదుర్కొన్నానని పేర్కొన్నది. ఈ ఒక్క విషయాన్నే కాకుండా, ఈ వ్యవహారంలో మరికొన్ని అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అందుకు వైద్యపరంగా, న్యాయపరంగా ఆ అమ్మాయి సహకరించాలి. ఆ అమ్మాయికి అండగా నిలవడానికి మా కమిటీ సిద్ధంగా ఉంది. అంతేకాదు, 'భూమిక హెల్ప్‌లైన్' అనే ఎన్జీవో సంస్థ కూడా ఆమెకు సపోర్ట్‌గా నిలిచింది' అని ఝాన్సీ చెప్పారు. సినీపరిశ్రమలో మహిళల క్షేమానికి ఢోకాలేదని తెలియజేసేందుకే ఈ ప్రెస్‌మీట్ పెట్టామని, 90రోజుల్లో దీనికి పరిష్కారం ఆలోచించి, మీడియాకు వివరిస్తామని ప్యానెల్ సభ్యుడు తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ వద్ద ఉదయం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ కంప్లయింట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని, లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఈ బాక్స్ ద్వారా తమ సమస్యను తెలియజేయవచ్చునని విజ్ఞప్తి చేస్తూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



టర్మ్.. టర్న్ అయ్యింది!

ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న పేరు.. 'టర్మ్ ఇన్సూరెన్స్'. ఒకవేళ కుటుంబ పెద్ద మరణిస్తే.. తనపై ఆధారపడిన కుటుంబానికి దీనిద్వారా పెద్దమొత్తంలో డబ్బులు అందుతాయి. అందుకే, ఇన్నాళ్లూ మగవాళ్లే ఎక్కువగా ఈ పాలసీలను తీసుకుంటూ వస్తున్నారు. కానీ, ఇప్పుడు 'టర్మ్ ఇన్సూరెన్స్' ఆడవాళ్లవైపు టర్న్ తీసుకుంది. తాజాగా 'పాలసీబజార్' నిర్వహించిన సర్వేలో.. 'టర్మ్ ఇన్సూరెన్స్' తీసుకుంటున్న మహిళల సంఖ్య గత రెండేళ్లలో 80 శాతం పెరిగినట్టు వెల్లడైంది. అంతేకాదు.. పెద్దమొత్తంలో బీమా పరిహారం అందేలా పాలసీలను ఎంచుకుంటున్న మహిళలు 120 శాతం పెరిగారు కూడా. వీరిలో ఉద్యోగాలు – వ్యాపారాల ద్వారా డబ్బు సంపాదించే మహిళలు 55 నుంచి 60 శాతం ఉన్నట్లు తెలిసింది. గృహిణులు 40 శాతం ఉన్నారట. వర్కింగ్ ఉమెన్ తీసుకుంటున్న పాలసీలు కూడా రూ.రెండు కోట్లు, ఆపై కవర్ చేసేవే ఎక్కువ. ఇందులోనూ 30 ఏళ్లకు అటూ ఇటుగా ఉన్నవారే పాలసీలు తీసుకోవడానికి ఎక్కువ ఉత్సాహం చూపుతున్నారు.

పల్లీలే.. పరమౌషధం!

పల్లీలు.. 'పేదవాళ్ల బాదం'గా గుర్తింపు పొందాయి. ఖరీదైన బాదం గింజల్లో లభించే అన్ని రకాల పోషకాలు.. ఈ పేదోళ్ల పల్లీల్లోనూ దొరుకుతాయి. ఒకరకంగా చూస్తే.. తక్కువ ధరలో, ఎక్కువ లాభాలు అందించేవి.. పల్లీలే! బాదం, పల్లీలు.. రెండిటిలోనూ క్యాలరీలు అధికంగా ఉంటాయి. 100 గ్రా. బాదం గింజల్లో 579 క్యాలరీలు లభిస్తే.. అదే 100 గ్రా. పల్లీలు తింటే 587 క్యాలరీలు శరీరానికి అందుతాయి. పల్లీల్లో 16% ప్రొటీన్లు ఉంటే.. బాదంలో 14% కనిపిస్తాయి. కొలెస్ట్రాల్.. పల్లీల్లో 71% ఉంటే బాదంలో 73% ఉంటుంది. ఇక కార్బొహైడ్రేట్ల విషయానికి వస్తే.. రెండిటిలోనూ సమానంగా 13 శాతం లభిస్తాయి. ప్రొటీన్లు, పిండిపదార్థాలు, కొవ్వులు.. పల్లీలు, బాదం రెండిట్లోనూ ఇంచుమించు సమానంగానే లభిస్తాయి. అన్నీ సమానంగా ఉన్నా.. ధరలో మాత్రం బాదంతో పోలిస్తే పల్లీలు అగ్గువకు దొరుకుతాయి. కాబట్టి, రోజూ బాదం తినలేనివారు.. దాని స్థానంలో నానబెట్టిన పల్లీలు తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతోనే.. బాదంతో సమానమైన లాభాలను పొందొచ్చు.



నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | బుధవారం 18 సెప్టెంబర్ 2024 www.ntnews.com



ఇంటిని ఇలా శుభ్రం చేద్దాం!

వాన కురిస్తే.. బయటి వాతావరణం ఎంత ఆహ్లాదంగా ఉంటుందో, ఇంటి లోపల అంత అపరిశుభ్రంగా తయారవుతుంది. ఎప్పుడూ తడితడిగా.. చిరాకుగా అనిపిస్తుంది. అంతేకాదు.. తేమ ఎక్కువుంటే బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్ లాంటివి పెరిగిపోతాయి. వీటిని నివారించాలంటే.. వానకాలంలో 'ఇంటి శుభ్రత'పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందే!



గదుల్లో డీ హ్యూమిడిఫయర్లను వాడుకోవాలి. ఇవి గదుల్లో ఎక్కువగా ఉండే తేమను తొలగిస్తాయి. ఎక్కడైనా తడి ఎక్కువగా ఉందనిపిస్తే.. పొడివస్త్రంతో ఒకసారి తుడిచేస్తే సరి.

మార్బుల్, గ్రానైట్ తరహా ఫ్లోర్‌లపై ఏదైనా మరకపడితే.. వెంటనే గట్టిపడుతుంది. దాన్ని వదిలించడం కష్టమవుతుంది. అందుకే వీటిపై మార్బుల్ సీలర్ వేయడం మంచిది. లేకుంటే, ఫ్లోర్ పాలిషింగ్ చేసినా మెరుగైన ఫలితం ఉంటుంది.

వర్షకాలంలో బాత్‌రూములు, టాయిలెట్లలో క్రిమికీటకాలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. కాబట్టి వాటి శుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. టాయిలెట్ క్లీనర్, బాత్రూమ్ క్లీనర్‌తోపాటు టాయిలెట్, సింక్ షవర్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి.

ఇంట్లో అన్ని గదులనూ క్లీన్ చేయడం ఒకెత్తయితే.. కిచెన్ ఫ్లోర్‌ను శుభ్రం చేయడం మరో ఎత్తు! వంట చేసేటప్పుడు నూనె చిందడం వల్ల.. గోడలకు ఉండే టైల్స్‌తో పాటు ఫ్లోర్ కూడా జిడ్డుగా మారుతుంది. అది తొలగిపోవాలి అంటే.. వేడినీటిలో వెనిగర్, కొంచెం ఉప్పు వేసి.. మాప్‌తో శుభ్రం చేయాలి. తర్వాత పొడివస్త్రంతో తుడిస్తే సరిపోతుంది.

వేగం వీళ్ల ఫార్ములా!

'మా అమ్మాయ్ ఎంత చెప్పినా తక్కువే.. క్షణాల్లో 100 మందికైనా వంట రెడీ చేసేస్తుంది.. చిటికెలో ఇంటిని అద్దంలా మార్చేస్తుంది.. అన్ని పనుల్లోనూ స్పీడ్ ఎక్కువే!!' అని చెప్పడం వినే ఉంటారు. ఇప్పుడు ట్రెండు మారింది... అతివలు వారి చుట్టూ ఉన్న చట్రాన్ని రేస్ ట్రాక్‌లా మార్చేస్తున్నారు. స్టీరింగ్ కేవలం అబ్బాయిలు మాత్రమే తగిలించుకునే రింగ్ కాదనీ.. ధైర్యంగా వారి చేతుల్లోకి తీసుకుంటున్నారు. స్టీరింగ్‌ని స్టడీగా తిప్పేస్తూ.. మెరుపువేగంతో దూసుకెళ్తున్నారు. అబ్బాయిలు కూడా వాళ్ల వేగాన్ని అందుకోవడం కష్టమేమో!!

అవకాశం ఇస్తే.. మహిళలు అద్భుతాలు చేస్తారన్నది పాతమాట. ఇప్పుడు తమకు నచ్చిన రంగంలో అవకాశాలు సృష్టించుకొని మరీ రాణిస్తున్నారు. ఫార్ములా వన్ రేసులు, మోటో జీపీ లాంటి అంతర్జాతీయ రేసింగ్ పోటీల్లో మహిళలు మచ్చుకైనా కనిపించే వారు కాదు. ముఖ్యంగా మనదేశంలో అయితే అది అత్యంత అరుదు. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి మారింది. మిగతా క్రీడల మాదిరిగా మోటార్ స్పోర్ట్స్‌లోనూ మహిళలు తనదైన ముద్ర వేస్తున్నారు. ప్రస్తుతం సంఖ్యాపరంగా వీళ్ల తక్కువగా ఉన్నప్పటికీ.. మగవాళ్లతో సమానంగా తమ డైనమిజాన్ని చూపిస్తున్నారు. అలా.. మోటార్ స్పోర్ట్స్‌లో దూసుకెళ్తున్న భారత టాప్ మహిళలు వీళ్లు! లెట్స్ రేస్ అంటూ ట్రాక్‌పై దుమ్మురేపుతున్న 'చోదక శక్తు'లు ఎందరికో ఆదర్శం.

ఫార్ములా 1 లక్ష్యంగా..

సాల్వా మార్జన్... ఈ పేరుతో గూగుల్ చేయండి. కళ్ల నిండా ధైర్యాన్ని నింపుకొన్న ఓ రేసర్ కనిపిస్తుంది. ఆమె లక్ష్యం ఒక్కటే ఫార్ములా 1 రేసింగ్‌లో అడుగుపెట్టడం, దేశంలో తనలాంటి అమ్మాయిలకు ప్రేరణగా నిలవడం. కేరళలోని పెరాంబ్ర పట్టణంలో పుట్టిన సాల్వాకు చిన్నప్పటినుంచి మోటార్ రేసింగ్ అంటే మక్కువ. మైకెల్ షూమాకర్, లూయిస్ హామిల్టన్.. లాంటి ప్రపంచ ప్రఖ్యాత ఫార్ములా 1 రేసర్లే ఆమెకు ప్రేరణ. రేసర్ అవ్వాలంటే ఏం చేయాలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన సాల్వాకి తెలుసు! అందుకే ఓ వైపు చక్కగా చదువుకుంటూనే ప్రణాళికతో రేసింగ్ వైపు అడుగులు వేసింది. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి పలు ఉద్యోగాలు చేసింది. తను సంపాదించే డబ్బుతో ఎఫ్4 రేసింగ్ శిక్షణకు వెళ్లింది. ఈ రేసింగ్ గురించి ఆమె తల్లిదండ్రులకు కనీస అవగాహన లేదు. వాళ్లకు.. సాల్వా తన శిక్షణ వీడియోలు చూపిస్తే షాక్ అయ్యారట. 'అమ్మాయిలకు ఈ రేస్‌లు సూట్ అవ్వవు.. సురక్షితమూ కాదని అందరిలాగే మా అమ్మానాన్నా చెప్పారు. అదే సమయంలో 'నీ సంకల్పం అదే అయితే ముందుకు వెళ్లు' అని ప్రోత్సహించారు. వాళ్ల మద్దతుతోనే నేను ఇక్కడికి వచ్చాను' అని చెబుతుంది సాల్వా. 2018లోనే తన రేసింగ్ కెరీర్‌ని స్టార్ట్ చేసిందామె. క్రమశిక్షణ, పట్టుదలతో 2023 ఎఫ్4 యూఏఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నది. 40 డిగ్రీల వేడి పుట్టే కారులో మెరుపువేగంతో ప్రయాణించడం పెద్ద చాలెంజ్ అంటుంది సాల్వా. ఇప్పుడు అమె దృష్టంతా ఫార్ములా 1 పైనే. 2025 జనవరిలో జరగనున్న ఈ రేస్ కోసం అకాడమీలో శిక్షణకు సిద్ధమవుతున్నది. భారత్ తరపున ఫార్ములా 1లో ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యం అంటున్న సాల్వాకు మనమూ ఆల్ ద బెస్ట్ చెబుదాం!!

ట్రాక్‌పైనే కాదు.. గాల్లోనూ..

స్నేహ శర్మ.. రేస్ ట్రాక్ పైనే కాదు.. గాల్లోకి వెళ్లి తన వేగానికి ఆకాశమే హద్దు అని చాటింది. 'ఒక్కసారి తలకి హెల్మెట్ పెట్టాక.. ఆడ, మగ అనే తేడా ఉండదు. జస్ట్ రేస్ కార్ డ్రైవర్‌లా మారిపోవాలంతే!!' అని చెబుత్నుది. ముంబయికి చెందిన స్నేహ శర్మ 16 ఏండ్ల వయసునుంచి రేసింగ్ చేస్తున్నది. వరుస ఈవెంట్లలో రికార్డులు నెలకొల్పుతున్నది. రోటాక్స్ కార్టింగ్ చాంపియన్‌షిప్‌లో తరచూ కనిపించే 29 ఏండ్ల స్నేహ.. 'వోక్స్‌వాగెన్ డీ పోలో కప్' విజేతగా నిలిచింది. అంతేకాకుండా టొయోటా ఇటియోస్ మోటార్ రేసింగ్, రోటాక్స్ రూకీ రేసింగ్, జేకే టైర్ ఫోర్ స్ట్రయికింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ సత్తాచాటింది. అయితే ఇప్పుడు స్నేహ రేసర్‌గా కొనసాగడం లేదు. ప్రస్తుతం ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా పనిచేస్తున్నది.

మా తాతకు అంకితం!

మీరా ఎర్దా.. నేటితరం వారికి సుపరిచితమైన పేరే. రేసింగ్ రంగంలో అడుగుపెట్టిన పిన్న వయస్కురాలు. 2010లో మోటార్ స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్న మీరా అప్పటినుంచి ఈ క్రీడలో చురుగ్గా పాల్గొంటున్నది. జేకే టైర్ ఎంఎస్ సీఐ నేషనల్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. 2017లో యూరో జేకే సిరీస్‌లో పాల్గొని ఈ ఘనత దక్కించుకున్న తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించింది. మోటార్ స్పోర్ట్స్‌లో ఆసక్తి ఉన్న బాలికలకు డ్రైవర్ కోచ్‌గానూ వ్యవహరిస్తుంది. తండ్రి ప్రోత్సాహంతో 8 ఏండ్ల వయసులో రేసింగ్ ట్రాక్‌పై అడుగుపెట్టింది మీరా. డచ్ ఫార్ములా వన్ రేసర్ మాక్స్ ఎమిలియన్ ఆమెకు స్ఫూర్తి. ఈ ఏడాది తాను గెలిచిన ఇండియన్ నేషనల్ కార్ రేసింగ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని తన తాతకు అంకితం ఇచ్చింది. మగవాళ్లతో పోటీపడి గెలిచిన ఈ రేస్ తనకెంతో స్పెషల్ అంటున్నది మీరా. 'మనం కనే కలలపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధ్యమే! ఈ తరం అమ్మాయిలు అదే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి' అని చెబుతున్నదామె.


రేసింగ్ గరిమా

ఆసక్తి, శక్తి ఉండాలేగానీ.. ఏ రంగంలోనైనా దూసుకెళ్లొచ్చు అని నిరూపిస్తున్నది గరిమా అవతార్. దిల్లీకి చెందిన గరిమా పెండ్లి అయ్యి, పిల్లలు పుట్టాక కూడా రేసింగ్ కొనసాగిస్తున్నది. ర్యాలీ రేసింగ్ డ్రైవర్‌గా గుర్తింపు తెచ్చుకున్న గరిమా ఎన్నో మెడల్స్ గెలుచుకుంది. 2011లో తొలిసారిగా ర్యాలీ రేసులో పాల్గొన్నది. ఈ మధ్యే 'డీఎన్ఏ విమెన్ అచీవర్స్ అవార్డు'ని అందుకుంది. గరిమా కేవలం రేసర్ మాత్రమే కాదు.. ఫ్రీలాన్స్ ఆటోమొబైల్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నది. టెడెక్స్ స్పీకర్ కూడా. అంతేకాదు.. 'ద గరిమా అవతార్ షో' పేరుతో వెబ్ పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్నది. ఇందులో స్పోర్ట్స్ సైకాలజీ, మోటివేషన్ పాఠాలు చెబుతుంటుంది.

ఇక అందరూ ఇస్మార్ట్ శంకర్లే!

అదెట్టా ?

బుర్రలో చిప్ పెట్టుకుని తిరిగే ఇస్మార్ట్ శంకర్లను ఇప్పటివరకూ తెలుగు సినిమాల్లో చూశాం. ఇకపై మన చుట్టూనే ఉండొచ్చు! ఎందుకంటే.. బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌లు (బీసీఐ) వచ్చేస్తున్నాయ్. ఓ చిన్న చిప్‌ని మెదడులో పెట్టేస్తారు. ఇక అన్నీ అదే చూసుకుంటుంది. సమాచారాన్ని అదే ట్రాన్స్‌ఫర్ చేసేస్తుంది. కనీసం కదిలే అవసరం కూడా లేదు. మెదడులో ఆలోచన రాగానే బుర్రలోని చిప్ దాన్ని గ్రహించి.. కమాండ్‌లా తీసుకుంటుంది. ప్రాసెస్ చేసి కమాండ్ రూపంలో కనెక్ట్ చేసి డివైజ్‌లకు పంపేస్తుంది. ఆస్ట్రేలియాకు చెందిన సింకోన్ అనే సంస్థ అలాంటి చిప్‌ని తయారుచేసింది.



కదల్లేని స్థితిలో ఉన్న ఓ 64 ఏళ్ల వయసు పెద్దాయన బుర్రలో దీనిని పెట్టింది. చిప్‌ని అమెజాన్ వాయిస్ అసిస్టెంట్ 'అలెక్సా'కి అనుసంధానం చేశారు. దీంతో ఆ పెద్దాయన కంప్యూటర్ ముందు కూర్చుని తన ఆలోచనలతోనే సిస్టమ్‌ను యాక్సెస్ చేయగలిగాడు. తనకు కావాల్సిన వాటిని అమెజాన్‌లో షాపింగ్ చేయగలిగాడు కూడా. అంతేకాదు.. ట్రయల్ రన్‌లో భాగంగా బీసీఐ టెక్నాలజీని ఐఫోన్, ఐప్యాడ్ పైనా ప్రయత్నించారు. దీంతో పక్షవాతానికి గురైన రోగులు ఈ గ్యాడ్జెట్స్‌ను తాకకుండా కేవలం ఆలోచనలతోనే వాటిని ఉపయోగించగలిగారు. బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ను ఇలా వాయిస్ అసిస్టెంట్‌లకు అనుసంధానించి వాడటం ఇదే తొలిసారి అని రూపకర్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌లు త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయట. దీంతో శరీరంలో చలనం కోల్పోయిన ఎంతో మందికి ఈ బీసీఐ తోడుగా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

అంధులు.. అద్భుతాలు!

కళ్లు లేవని వాళ్లు కలత చెందలేదు! తమకున్న అసాధారణ స్పర్శ జ్ఞానంతో.. అద్భుతాలు చేస్తున్నారు. 'రొమ్ము క్యాన్సర్'ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తూ.. వేల మరణాలను ఆపుతున్నారు. ప్రాణాంతక వ్యాధిని పసిగట్టడంలో.. అంధ మహిళలు ప్రధానపాత్ర పోషిస్తున్నారు.

మనదేశంలో ఏటా సుమారు 75,000 మంది రొమ్ము క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. ఇందుకు కారణాలు అనేకం.. భారతీయ మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం ఒక కారణమైతే.. ఈ వ్యాధిని గుర్తించే 'మమోగ్రఫీ పరీక్ష' చేయడానికి కావాల్సిన పరికరాల కొరత ఇంకోటి! ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఈ సమస్య మరీ ఎక్కువ! ఫలితంగా.. రొమ్ము క్యాన్సర్‌ను మూడు లేదా నాలుగో దశలోనే గుర్తిస్తున్నారు. దాంతో సరైన చికిత్స అందకపోవడంతో వేలమంది మరణిస్తున్నారు. ఈ సమస్యకు అంధ మహిళలు అద్భుతమైన పరిష్కారం చూపుతున్నారు.

ఆ చేతుల్లోనే అంతా!

'రొమ్ము క్యాన్సర్ కణితిని ఎంత త్వరగా గుర్తిస్తే.. అంత మంచి చికిత్స అందించవచ్చు!'.. జర్మనీకి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్.ఫ్రాంక్ హాఫ్‌మన్ చెప్పేమాట. ఆయన ఆలోచనల్లోంచి పురుడుపోసుకున్నదే.. 'డిస్కవరింగ్ హ్యాండ్స్'. ఎలాంటి లాభాపేక్ష లేని ఈ సంస్థ.. జర్మనీతోపాటు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న రొమ్ము క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించడంలో సాయపడుతున్నది. ఇందుకోసం వైద్యులకు సహాయక సిబ్బందిగా అంధ మహిళలకు ప్రత్యేక్ష శిక్షణ ఇప్పిస్తున్నది. వారే ఎందుకంటే.. సాధారణ వ్యక్తులతో పోలిస్తే దృష్టిలోపం ఉన్నవారిలో 'స్పర్శ జ్ఞానం' ఎక్కువ. అంతేకాకుండా.. వారి విద్యాభ్యాసం అంతా 'బ్రెయిలీ'లోనే సాగుతుంది. ఈ చుక్కల లిపిని చేతులతో తడుముతూ.. పదాలను గుర్తించగలుగుతారు. అలా వారిలో 'స్పర్శ జ్ఞానం' ఎక్కువగా అభివృద్ధి చెంది ఉంటుంది. ఈ అనుభవాన్నే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడానికి వాడుతున్నారు. తమ చేతి స్పర్శ ద్వారా.. ప్రారంభ దశలలో ఉన్న సూక్ష్మ కణతులను కూడా వీరు స్పష్టంగా గుర్తిస్తున్నారు. వైద్యులు 1 నుంచి 2 సెం.మీ. గడ్డలను కనుగొంటే.. దృష్టి లోపం ఉన్న మహిళలు 0.5 సెం.మీ. కణతులనూ గుర్తించగలుగుతున్నారు.

వందలమందికి శిక్షణ..

'డిస్కవరింగ్ హ్యాండ్స్' సంస్థ ద్వారా భారతదేశంలోని పలు నగరాల్లో 'రొమ్ము క్యాన్సర్'ను గుర్తించడంపై అంధ మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. తొమ్మిది నెలల శిక్షణలో.. ఆరు నెలలు స్టడీకోర్స్‌తోపాటు మూడు నెలలు ఇంటర్న్‌షిప్ అందిస్తున్నారు. ఇందులో భాగంగా.. వీరు మహిళల శరీరం గురించి ముఖ్యంగా రొమ్ము అనాటమీపై ప్రత్యేక శిక్షణ తీసుకుంటారు. ట్రైనింగ్ తర్వాత ప్రముఖ ఆసుపత్రుల్లో వైద్యులకు సహాయకులుగా, లేదా ఫ్రీలాన్స్ మెడికల్ టాక్టయిల్ ఎగ్జామినర్‌గా పనిచేస్తున్నారు. వీరు చర్మానికి అనుకూలమైన టేప్‌ను ఉపయోగిస్తూ.. రోగి ప్రతి రొమ్మునూ నాలుగు జోన్లుగా విభజిస్తారు. చేతివేళ్లతో సున్నితంగా పరిశీలించడం, వివిధ రకాల పద్ధతులను ఉపయోగించి రొమ్ములో ప్రతి అంగుళాన్నీ నిశితంగా పరిశీలిస్తారు. అక్కడి కణజాలాల్లో జరుగుతున్న మార్పులను వైద్యులకన్నా 30% మెరుగ్గా గుర్తిస్తున్నారు. కేవలం 35 నుంచి 40 నిమిషాల్లోనే రోగిని పరీక్షించి.. రొమ్ము క్యాన్సర్ కణతులను కనిపెడతారు. 2023 రికార్డుల ప్రకారం.. భారత్‌లో నిర్వహించిన 'డిస్కవరీ హ్యాండ్స్' ప్రోగ్రాం ద్వారా 1,338 మంది మహిళల్లో ఈ ప్రాణాంతక క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే కనుగొన్నారు.



ఎఫ్ఐహెచ్ అవార్డు రేసులో హర్మన్‌ప్రీత్, శ్రీజేశ

లాసానే(స్విట్జర్లాండ్): ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్(ఎఫ్ఐహెచ్) అవార్డు రేసులో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్‌తో పాటు మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ పోటీపడుతున్నారు. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్య పతకం గెలువడంలో హర్మన్‌ప్రీత్‌తో పాటు శ్రీజేశ్ కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా హర్మన్‌ప్రీత్ ఏకంగా 10 గోల్స్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ నేపథ్యంలో ఎఫ్ఐహెచ్ మంగళవారం అవార్డుల కుదింపు జాబితాను విడుదల చేసింది. ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రేసు కోసం థియరీ బ్రింక్‌మన్, జోప్ డీ మోల్(నెదర్లాండ్స్), హన్నెస్ ముల్లర్(జర్మనీ), జాచ్ వాలెస్(ఇంగ్లండ్)తో హర్మన్‌ప్రీత్ పోటీలో ఉన్నాడు. మరోవైపు గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాగా పేరొందిన శ్రీజేశ్..గోల్‌కీపర్ అవార్డు కోసం రేసులో ఉన్నాడు. 2024లో జరిగిన అన్ని మ్యాచ్‌ల్లో ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటూ చేపట్టనున్న ఓటింగ్ ప్రక్రియ అక్టోబర్ 11 వరకు కొనసాగనుంది.

వేరే వ్యూహాలు అవసరం లేదు

బంగ్లాతో సిరీస్‌పై రోహిత్‌శర్మ వ్యాఖ్య



చెన్నై: బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ కోసం తమకు ప్రత్యేకమైన వ్యూహాలు ఏం అవసరం లేదని టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ స్పష్టం చేశాడు. మిగతా జట్ల లాగే బంగ్లాను ప్రత్యర్థిగా ఎదుర్కొంటామని అన్నాడు. తొలి టెస్టు పోరు కోసం సిద్ధమవుతున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా భేటీలో రోహిత్ పలు అంశాలపై మాట్లాడాడు. 'ప్రతీ జట్టు భారత్‌ను ఓడించాలనుకుంటున్నది. తద్వారా ఘనత సాధించేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ ఉత్సాహాన్ని వాళ్లు అస్వాదించని. కానీ మా వరకు మ్యాచ్‌లు ఎలా గెలువాలన్నదే దానిపై మా దృష్టంతా. మా గురించి ప్రత్యర్థి ఏం ఆలోచిస్తుందన్న దానిపై మేము ఆలోచించం. ఇప్పటికే ప్రపంచంలోఇని ప్రతీ జట్టుతో భారత్ మ్యాచ్‌లు ఆడింది. ఇప్పటికిప్పుడు బంగ్లా కోసం ప్రత్యేకమైన వ్యూహం అవసరం లేదు. కొంతమంది కొత్త క్రికెటర్లు బాగా రాణిస్తున్నారు. వారిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మా గేమ్‌ప్లాన్ మాకుంది. కీలకమైన బౌలర్ల పని ఒత్తిడిని నిరంతరం పరిశీలిస్తూనే ఉంటాం. రానున్న సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని విశ్రాంతి కల్పిస్తాం. టెస్టు సిరీస్‌లకు ముందు దులీప్ ట్రోఫీ ఏర్పాటు చేయడం బాగుంది. దీని ద్వారా చాలా మంది క్రికెటర్లకు మంచి మ్యాచ్ ప్రాక్టీస్ దొరికింది' అని అన్నాడు.

సిద్ధార్థ్ సెంచరీ

ఫ్రీడమ్ అకాడమీ టీమ్ భారీ గెలుపు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: నల్లగొండ ఫ్రీడమ్ అకాడమీ టీమ్ ఓపెనర్లు సిద్ధార్థ్ (121), సూర్య(86) విజృంభణతో ఎమ్మెస్కే రాకెట్స్ జట్టుపై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో జరిగిన వన్డే మ్యాచ్‌లో మొదట ఎమ్మెస్కే టీమ్ నిర్ణీత 50 ఓవర్లలో నక్ష్(52), హర్ష్(61) అర్ధసెంచరీలతో 260/5 స్కోరు చేసింది. లక్ష్యఛేదనలో సిద్ధార్థ్, సూర్య అదరగొట్టడంతో ఫ్రీడమ్ జట్టు 43.1 ఓవర్లలో 262/1 స్కోరు చేసింది. సెంచరీతో జట్టు విజయంలో కీలకమైన సిద్ధార్థ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఆసియా విజేత భారత్

ఫైనల్లో చైనాపై విజయం.. భారత్ ఖాతాలో ఐదో టైటిల్.. ఆకట్టుకున్న ఆతిథ్య జట్టు పోరాటం.. ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీ

విశ్వక్రీడల్లో వరుసగా రెండోసారి కంచు మోత మోగించిన భారత హాకీ జట్టు ఆసియాలో తమకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. చైనా వేదికగా జరిగిన ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ వరుసగా రెండోసారి టైటిల్ దక్కించుకుంది. ఫైనల్‌లో 1-0తో చైనాను చిత్తు చేసి జయకేతనం ఎగురవేసింది. ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరిన చైనా.. తుదిపోరులో భారత్‌కు గట్టి పోటీనిచ్చినా ఆట ఆఖర్లో జుగ్‌రాజ్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోగలిగింది.





ఏసీటీలో భారత్ ఆధిపత్యం

2011లో ప్రారంభించిన ఈ టోర్నీ తొలి ఎడిషన్‌లో విజేతగా నిలిచిన భారత్ 2012లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆ తర్వాత 2016, 2018లో బ్యాక్ టు బ్యాక్ టైటిల్స్ గెలిచింది. 2023, 2024లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది.

హులన్‌బుయిర్ (చైనా): ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి జోరు మీదున్న భారత హాకీ జట్టు మరో మెగా టోర్నీలో సత్తాచాటింది. చైనా వేదికగా జరిగిన ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ) ఫైనల్‌లో భారత్.. 1-0తో చైనాను ఓడించి వరుసగా రెండోసారి, మొత్తంగా ఐదోసారి ఏసీటీని సొంతం చేసుకుంది. టోర్నీలో ఓటమన్నదే లేకుండా ఫైనల్ చేరిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేనకు తుది పోరులో చైనా నుంచి గట్టి సవాలే ఎదురైనా జుగ్‌రాజ్ సింగ్ 51వ నిమిషంలో కొట్టిన గోల్‌తో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. టోర్నీ ఆసాంతం అద్భుతంగా రాణించి ప్రతి మ్యాచ్‌లోనూ గోల్ కొట్టిన హర్మన్‌ప్రీత్ ఫైనల్‌లో గోల్ చేయడంలో విఫలమైనా జుగ్‌రాజ్‌కు బంతిని అందించడంలో సఫలీకృతుడయ్యాడు. మూడో స్థానం కోసం జరిగిన పోరులో పాకిస్థాన్.. 5-2తో దక్షిణ కొరియాను ఓడించి పరువు నిలుపుకుంది.

పోరాడిన చైనా..

భారత్‌తో పోల్చితే అంతగా అనుభవం లేని చైనాకు ఇది అంతర్జాతీయ స్థాయిలో రెండో ఫైనల్ (2006 ఆసియా క్రీడల్లో తొలిసారి ఫైనల్ చేరింది) మాత్రమే. కానీ సొంతగడ్డపై ప్రేక్షకుల మద్దతుతో ఆ జట్టు రెచ్చిపోయింది. తొలి మూడు క్వార్టర్స్‌లో మన ఆటగాళ్లు ఎంత ప్రయత్నించినా చైనా రక్షణ శ్రేణి గోల్ చేసే అవకాశమే ఇవ్వలేదు. లీగ్ దశలో భారత్‌కు (3-0)తో అలవోకగానే లొంగిన చైనా.. ఫైనల్‌లో మాత్రం హోరాహోరీగా పోరాడింది. ఆట ఆరంభంలో భారత ఆటగాడు రాజ్‌కుమార్ పాల్ గోల్ చేసేందుకు అవకాశం దక్కినా చైనా గోల్ కీపర్ వాంగ్ వీహావొ దానిని విజయవంతంగా అడ్డుకున్నాడు. 10వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ (పీసీ) అవకాశాన్నీ భారత్ సద్వినియోగం చేసుకోలేదు. తొలి క్వార్టర్ ముగియనుండగా చైనాకు వచ్చిన పీసీని భారత గోల్ కీపర్ కృషణ్ బహదూర్ పాఠక్ అడ్డుకున్నాడు. రెండో క్వార్టర్‌లోనూ దాదాపు ఇదే కథ నడిచింది. 'మెన్ ఇన్ బ్లూ' ఎదురుదాడికి చైనా దీటుగానే సమాధానమిచ్చింది.

జుగ్‌రాజ్ గోల్..

ఆట నాలుగో క్వార్టర్ దాకా గోల్ లేకుండా డ్రా దిశగా సాగుతున్న మ్యాచ్‌కు ఆఖర్లో హర్మన్‌ప్రీత్, జుగ్‌రాజ్ ఊపు తెచ్చారు. నాలుగో క్వార్టర్ 9వ నిమిషంలో చైనా డిఫెన్స్‌ను తప్పించుకుంటూ సర్కిల్‌లోకి వచ్చిన హర్మన్‌ప్రీత్.. గోల్‌పోస్ట్‌కు అత్యంత సమీపంలో ఉన్న జుగ్‌రాజ్‌కు బంతిని పాస్ చేశాడు. బంతిని అందుకున్న జుగ్‌రాజ్.. రెప్పపాటు వేగంతో దానిని గోల్‌పోస్ట్‌లోకి పంపించి తొలి గోల్ కొట్టడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక ఆఖర్లో చైనా గోల్‌కీపర్‌ను తప్పించి ఎక్స్‌ట్రా ఫీల్డర్‌తో గోల్ కోసం యత్నించినా ఫలితం దక్కలేదు. టోర్నీ ఆద్యంతం రాణించిన హర్మన్‌ప్రీత్ సింగ్ (7 గోల్స్)కు 'హీరో ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది.

7 ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ చేసిన గోల్స్. యంగ్ జి జిహున్ (ద.కొరియా) 9 గోల్స్‌తో ప్రథమ స్థానంలో ఉన్నాడు.

5 మంగళ వారం ముగిసిన టోర్నీ 8వ ఎడిషన్ కాగా ఇందులో భారత్ ఐదుసార్లు విజేత కాగా ఒకసారి రన్నరప్‌గా నిలిచింది.



టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మరోమారు తన ఉదారతను చాటుకున్నాడు. ముంబైలో ఈనెల 19న జరిగే 'గోధార్మిక్ ఆక్షన్' కోసం కోహ్లీ తాను సంతకం చేసిన జెర్సీతో పాటు క్యాప్‌ను సదరు సంస్థ ప్రతినిధికి అందజేశాడు. ఈ ఫొటోను కోహ్లీ ఫ్యాన్స్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అద్భుతమైన స్పందన కింగ్ కోహ్లీ అంటూ కామెట్లు చేస్తున్నారు. బంగ్లాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం విరాట్ సిద్ధమవుతున్నాడు.

చైనా జెండాలతో పాక్ ప్లేయర్లు



ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీలో పాకిస్థాన్ ప్లేయర్లు చైనాపై తమ ప్రేమను చాటుకున్నారు. మంగళవారం భారత్, చైనా మ్యాచ్ జరుగుతున్న సమయంలో స్టేడియంలో మ్యాచ్ చూస్తున్న పాక్ ఆటగాళ్లు చైనా జెండాలు ఊపుతూ కనిపించారు. సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన దీనిపై ట్రోలింగ్ నడుస్తున్నది.

పురుషులతో సమానంగా..

మహిళలకూ ఈక్వల్ ప్రైజ్‌మనీ

ఐసీసీ కీలక నిర్ణయం

దుబాయ్: వచ్చే నెలలో దుబాయ్ వేదికగా జరుగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ముందు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐసీసీ నిర్వహించే టోర్నీలలో పురుషులతో సమానంగా మహిళలకూ ప్రైజ్ మనీ ఇవ్వనుంది. తదుపరి పొట్టి ప్రపంచకప్ ఎడిషన్ నుంచే ఇది అందుబాటులోకి రానుంది. అక్టోబర్ నుంచి జరుగబోయే మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో టైటిల్ గెలిచిన విజేతకు ప్రైజ్‌మనీగా 2.34 యూఎస్ మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.19 కోట్లు) దక్కనున్నాయి. గత ఎడిషన్‌తో పోల్చితే ఇది 134 శాతం అధికం. రన్నరప్‌గా నిలిచే జట్టుకు 1.17 యూఎస్ మిలియన్ డాలర్లు (రూ.9.8 కోట్లు) అందుతాయి. 2022లో టీ20 ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియాకు 1 యూఎస్ మిలియన్ డాలర్ల (రూ.8.37 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కింది.

రజావత్ నిష్క్రమణ

చెంగ్జూ: భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రజావత్.. 13-21, 16-21తో బ్రియాన్ యంగ్ (కెనడా) చేతిలో పరాభవం పాలయ్యాడు. రజావత్ ఓడటంతో ఈ టోర్నీ మెన్స్ సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జి ఒక్కడే బరిలో మిగిలాడు.

అర్జున్‌కు 9 వికెట్లు

అదరగొట్టిన జూనియర్ టెండూల్కర్

ఆలూరు (కర్నాటక): భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఒకే మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టి అదరగొట్టాడు. కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ కె తిమ్మప్పయ్య మెమోరియల్ టోర్నమెంట్ 2024-25లో భాగంగా కేఎస్‌సీఏతో జరిగిన మ్యాచ్‌లో అర్జున్ (9/87) విజృంభించాడు. గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అర్జున్ చెలరేగడంతో ఆ జట్టు 189 పరుగుల తేడాతో విజయం సాధించింది.

- తెలంగాణ సరిహద్దుల్లో పులుల సంచారం



ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోగల పెన్‌గంగా నది పరీవాహక ప్రాంతంలో మంగళవారం ప్రయాణికులకు మూడు పులులు కనిపించాయి. తెలంగాణలోని అంతర్గాం, గుబిడిలకు ఆవల ఉన్న మహారాష్ట్ర, మంగి, సవర్గాం గ్రామాల మధ్య పెద్ద పులులు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ పులులు తరచూ తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చి వెళ్తుంటాయని మంగి గ్రామానికి చెందిన రైతులు ఓంకారం, రమేశ్ తెలిపారు.

సీఆర్‌డీలో రిటైర్డ్ అధికారి తిష్ట!

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్(సీఆర్‌డీ) కార్యాలయంలో ఓ రిటైర్డ్ అధికారి తిష్ట వేశాడు. ఆయన చెప్పిందే వేదం.. ఆయన చేసిందే రాజ్యాంగం అన్నట్టుగా వ్యవహారశైలి ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి గత మార్చి 12న సెర్ప్ ఉద్యోగులకు ఐఆర్ ఐదు శాతం వర్తింపచేస్తూ సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్వయంగా సంతకం చేసి ఆర్డర్ రిలీజ్ చేసినప్పటికీ.. సీఆర్‌డీలో రిటైర్డ్ కన్సల్టెంట్ సుబ్బారావు ఉద్దేశపూర్వకంగా లేనిపోని అడ్డంకులు సృష్టించి ఆరు నెలల కాలయాపన చేశాడని సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ నాయకులు కుంట గంగాధర్ ఏపూరి నరసయ్య, జానయ్య, మహేశ్ సుదర్శన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. మంత్రి సీతక్క, శాఖ ముఖ్యకార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్యలకు ఫిర్యాదు చేయడంతో ఆరు నెలల ఆలస్యం తర్వాత ఈ నెలలో జమ చేశారని చెప్పారు. సెర్ప్ ఉద్యోగులకు రెండున్నర దశాబ్దాలుగా హక్కుగా అందుతున్న ప్రయోజనాలను ఆరు నెలలుగా అడ్డుకుంటున్న రిటైర్డ్ కన్సల్టెంట్ సుబ్బారావు తీరుకు నిరసనగా బుధవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వారు ప్రకటించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాల ఉన్నప్పటికీ, రెండో వారం వరకు వేతనాలు రాకుండా రిటైర్డ్ అధికారి సుబ్బారావు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తే చేతులు తడపాలని, లేకుంటే జీవితకాలం ఇలాగే సతాయిస్తానని యూనియన్‌లకు సంకేతాలు పంపుతున్నాడని మండిపడ్డారు. తాజాగా సెర్ప్ ఉద్యోగులకు వస్తున్న ఈపీఎఫ్‌ను సగానికి సగం కోత విధించేలా సీఆర్‌డీ నుంచి సెర్ప్‌కు మెమో జారీ చేయించాడని ఆరోపించారు. ఈ రిటైర్డ్ అధికారి చేష్టలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3974 సెర్ప్ ఉద్యోగులు విసిగి వేసారి పోయారని, బుధవారం అన్ని జిల్లాల యూనియన్ నాయకులు, సభ్యులు, సెర్ప్ ఉద్యోగులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ నాయకులు ప్రకటించారు. సెర్ప్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి సీఈవోకి వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. అనంతరం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి రిటైర్డ్ కన్సల్టెంట్‌పై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అప్పటికీ అతని వైఖరిలో మార్పు రాకపోతే నేరుగా మంత్రికి ఫిర్యాదు చేస్తామని, ఈ ఉద్యోగిని తొలగించి కఠినచర్యలు తీసుకునే వరకు నిరవధిక నిరసన చేపడతామని హెచ్చరించారు.

- మెదక్ జిల్లా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో ప్లవర్ పక్షి





మెదక్ జిల్లా పోచారం వన్యప్రాణుల అభయారణ్యంలో సీజనల్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీరామ్ ఆదిత్య సోమవారం టిబెటన్ ఇసుక ప్లవర్ పక్షిని కనుగొన్నారు. వికారాబాద్ జిల్లా యెంకటాల వద్ద మరో పక్షి సాబెల్లిన్ వీటర్‌ను రాజశేఖర్ ముద్దం గుర్తించారు. నర్సాపూర్‌లో ఏషియన్ బ్రౌన్ ఫ్లై క్యాచర్‌ను ప్రముఖ వన్యప్రాణి ఫొటోగ్రాఫర్ శ్రీరామ్‌రెడ్డి తన కెమెరాలో బంధించారు. ఇప్పటివరకు 280 పక్షిజాతులు తెలంగాణకు వలస వచ్చినట్టు తెలిపారు. ఈ పక్షులు చలికాలంలోనే వలస వస్తాయని, తర్వాత స్వస్థలాలకు చేరుకుంటాయని చెప్పారు.

జింబాబ్వే, నమీబియాలో కరువు రక్కసి

హరారే, సెప్టెంబర్ 17: కొన్ని దక్షిణ ఆఫ్రికా దేశాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడటంతో ప్రజలు క్షుద్బాధ భరించ లేక ఆకలి కేకలు వేస్తున్నారు. జింబాబ్వే, నమీబియా దేశాల్లో ఇలాంటి దయనీయ పరిస్థితులు ఉండటంతో ఆ ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి. ఆ దేశంలోని వందలాది ఏనుగులు, ఇతర అడవి జంతువులను వధించి ఆకలితో అలమటిస్తున్న పౌరులకు వాటి మాంసాన్ని ఆహారంగా అందించాలని ప్రణాళిక సిద్ధం చేసినట్టు సోమవారం ప్రకటించాయి. జింబాబ్వేలో 200 ఏనుగులను చంపి వాటి మాంసాన్ని అన్నార్థులకు పంపిణీ చేయనున్నట్టు ప్రకటించగా, తమ దేశంలోని 83 ఏనుగులు సహా 700 అడవి జంతువులను హతమార్చాలని నిర్ణయించినట్టు నమీబియా తెలిపింది. దీనిపై జింబాబ్వే నేషనల్ పార్క్స్ అండ్ వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ అధికారి థినాషే ఫరావో మాట్లాడుతూ అవసరమైన జాతుల వారు ఏనుగులు వేటాడటానికి అనుమతులు ఇచ్చేశామని, కొన్నింటిని తాము చంపి వారికి అప్పగిస్తామని చెప్పారు.

ఎన్‌సీబీ డీజీగా అనురాగ్ గార్గ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: బీఎస్ఎఫ్ అదనపు డీజీగా ఉన్న ఐపీఎస్ అధికారి అనురాగ్ గార్గ్.. 'నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో' (ఎన్‌సీబీ) నూతన డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. కేంద్ర హోంశాఖ మంగళవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేసింది. హిమాచల్ ప్రదేశ్ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన అనురాగ్ గార్గ్ ఎంపికను క్యాబినెట్ కమిటీ ఆమోదించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 మే 23 వరకు లేదా తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఎన్‌సీబీ డీజీగా కొనసాగుతారని కేంద్రం పేర్కొన్నది. అఖిల భారత స్థాయిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, చట్ట విరుద్ధమైన పదార్థాల వినియోగాన్ని అడ్డుకోవటంలో ఎన్‌సీబీ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తుంది. స్మగ్లింగ్ కార్యకలాపాలను అడ్డుకునేందుకు దేశ సరిహద్దుల్లోనూ నిఘా కార్యకలాపాలను చేపడుతుంది.

ట్రూడో రాజీనామాకు ఒత్తిడి?

టొరంటో, సెప్టెంబర్ 17: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు వరుసగా రెండో ఉప ఎన్నికలోనూ ఎదురుదెబ్బ తగిలింది. అధికార లిబరల్ పార్టీ మాంట్రియల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఒక సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. మంగళవారం వెలువడిన ఈ ఫలితాలతో జస్టిన్ ప్రధాన పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి రావచ్చునని భావిస్తున్నారు. లాసల్-ఎమర్డ్-వెర్డున్ ఉప ఎన్నికలలో లిబరల్ అభ్యర్థి లారా పాలెస్తినీ ఓటమి చెందారు. ఆయనపై క్యుబియోకిస్ అభ్యర్థి లూయిస్ ఫిలిప్పే విజయం సాధించారు. తొమ్మిదేండ్లుగా పదవిలో ఉన్న ట్రూడో ప్రాభవం ఇటీవలి కాలంలో మసకబారుతూ వస్తున్నది. 2025 అక్టోబర్‌లో జరిగే ఎన్నికల్లో తానే నేతృత్వం వహిస్తానని ట్రూడో పట్టుబడుతూ వస్తున్నారు. అయితే ఆయన నాయకత్వాన్ని మార్చాలంటూ సొంత పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు.